# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 68 | హైదరాబాద్ | బుధవారం 27-08-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

హైదరాబాద్ మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం.. ఐదుగురు విద్యార్థులకు పాజిటివ్!

## నేటి భారతం

- మీకు ఓట్లేస్తాం.. ఊడిగం చేస్తాం..
- ఉప్పు కొన్నా..పప్పు కొన్నా టాక్సులు కడతాం..
- మిమ్మల్ని గెలిపించుకుని జీతాలు కూడా ఇస్తాం..
- ఎందుకంటే మీరంతా మేధావులని మా నమ్మకం..
- మా కోసం అభివృద్ధి పథకాలు రచిస్తారేమో అని ఆశపడతాం..
- చివరికి మీరు మా తలరాతలనే మార్చేస్తున్నారు..
- మీరు చట్టాలు చేసే చట్టసభల్లో భోజనం మీకు రూ.10 కే దొరుకుతుంది..
- రోజంతా కష్టపడ్డా నాకు ఒక్కపూట కూడా ఆకలితీరదు...
- మీకేమో అన్ని హంగులతో ఆధునిక నివాసాలు...
- మాకేమో నిలువ నీడకూడా కరువు...
- రాజకీయానికి ఇంత పవర్ ఎవరిచ్చారో గానీ...
- మా ఓట్లతో గెలిచి.. మా రక్తం తాగుతున్నారు... హతవిధీ...ఏమిటి మాకీ ఖర్మ..?

– బోయినపల్లి రమణా రావు, సీనియర్ జర్నలిస్ట్..

పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంద్రమ్మ హౌసింగ్ స్కీమ్ ఒకప్పుడు ఎంతో ఆదర్శవంతమైన పథకంగా నిలిచింది. అయితే, అమలు దశలో ఈ పథకం అవినీతి, లోపాలు, రాజకీయ జోక్యాలతో దెబ్బతిని, అసలు లక్ష్యానికి దూరమైంది. నీడను ఇవ్వాల్సిన పథకం కన్నీటిని మిగుల్చుతుంది.. అధికార పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అర్హత లేకపోయినా ఇండ్లు కేటాయిస్తున్నారు.. లిస్ట్ లో పేరు లేకపోయినా ఇరికించి మరీ ఇస్తున్నారు.. ఎవరి పేరుమీదో ఇండ్లు కేటాయింపు చేసుకుని.. ఆ తరువాత అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న అవినీతి నాయకులు కో కొల్లలు.. ఇదే కాకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకం మెటీరియల్ తో ఇండ్ల నిర్మాణాలు సాగిస్తున్నారు.. అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు.. ఈ పద్ధతికి స్వస్తి పలకాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది "ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ"..

# నిరుపేదల గూటికి అవినీతి సెగ..



12లో

- ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో భారీ అక్రమాలు..
- కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు..
- అడ్డగోలుగా మారిపోయిన ఆదర్శవంతమైన పథకం..
- నాసిరకం మెటీరియల్ తో నిర్మాణాలు..
- గాలివానకే దెబ్బతింటున్న పలు గృహాలు..


## క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం..

### ఇక మనమే గ్లోబల్ హబ్: ప్రధాని మోదీ

- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం
- క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో భారత్ ప్రపంచ హబ్‌గా మారుతుందన్న ప్రధాని
- భారత్‌లో బ్యాటరీల తయారీ కోసం మూడు జపాన్ కంపెనీల భాగస్వామ్యం


11లో

- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని మోదీ పిలుపు
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలపై ఇకపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్న ప్రధాని


11లో

## రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

- బ్యాంకర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- బ్యాంకర్ల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి
- సీజన్ చివర్లో రైతులకు రుణాలిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్న
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని హితవు



11లో

## ఏటీఎంలపై బ్యాంకులకు ఆర్బీఐ కీలక ఆదేశాలు

- ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు తప్పనిసరి
- బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు ఆర్‌బీఐ ఆదేశాలు
- సెప్టెంబర్ 30 లోపు అమలు చేయాలన్న ఆర్బీఐ

## తెలంగాణకు హెచ్చరిక

*నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు*


11లో

- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం
- నేడు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- రేపు ఏడు జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరికల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు

## 30 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

### 'కాళేశ్వరం' నివేదికపై చర్చ!

- సభ ముందుకు జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ కాళేశ్వరం నివేదిక
- ఐదు రోజుల పాటు సమావేశాలు జరిగే అవకాశం
- అసెంబ్లీలో చర్చించాకే కాళేశ్వరం అవకతవకలపై చర్యలని కోర్టుకు స్పష్టం చేసిన ప్రభుత్వం

11లో




11లో

## సముద్రంలో శత్రువులకు చెక్..

- నౌకాదళంలోకి రెండు స్వదేశీ యుద్ధనౌకలు

# క్షేత్రస్థాయి పటిష్టత పై జనసేన దృష్టి

విశాఖపట్టణం, ఆగస్టు 26,

జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధమవుతుంది. అందుకే విశాఖలో మూడు రోజులపాటు విస్తృత స్థాయిసమావేశం నిర్వహిస్తున్నారు.ఆగస్ట్ 28వ తేదీ నుంచి 30వ తేదీవరకు మూడు రోజులు విస్తృత స్థాయి సమావేశం విశాఖ లో నిర్వాహిస్తున్నారు. ఈ మూడు రోజులు పాటు సేనతో సేనాని పేరిట జరిగే కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. 28వ తేదీన జనసేన లెజిస్టేటివ్ పార్టీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేల నుంచి పవన్ కల్యాణ్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. పార్టీ క్షేత్రస్థాయిలో ఎలా ఉంది? కూటమి పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై ఎమ్మెల్యే అభిప్రాయాలను తెలుసుకుంటారు.టీడీపీ ప్రతి ఏటా నిర్వహించిన మహానాడు తరహాలో ఈ సమావేశాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అలాగే జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని ఎప్పటి నుంచో ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ తమ మాట వినకుండా టీడీపీ ఇన్ ఛార్జుల మాటకే విలువ ఇస్తున్నారని, నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ జనసేనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇటీవల తరచూ ఎమ్మెల్యేలు చెబుతుండటంతో 28వ తేదీన జరిగే లెజిస్టేటివ్ సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చించే అవకాశముంది. ఎక్కడెక్కడ ఇబ్బందులున్నాయో తెలుసుకుని వాటిని టీడీపీ అధినేత చంద్రబాబు ముందు ఉంచే ప్రయత్నంలో భాగంగా ఈ సమావేశాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిసింది ఈతరం నేతలను గాడిన తేవడం కష్టమేనా? పార్లమెంటు నియోజకవర్గాల వారీగా... 28వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఆగస్ట్ 29వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పార్లిమెంట్ నియోజక వర్గాల వారిగా పదిమంది పార్టీ నేతలతో చర్చిస్తారు. అనంతరం పర్యావరణం , మహిళా బాధ్యత పై రక్షిత మంచినీటి పథకం, ఉపాధి క్షల్పన,మీద చర్చలు ఉంటాయి. కొత్త నాయుకత్వం బయుటకు వచ్చేలా ప్రోత్సహించేందుకే ఈ రకమైన సమావేశాలు అని జనసేన చెబుతుంది. విపక్షం సొషల్ మీడియా వినియోగించి చేసిన దుష్ప్రచారంపై కూడా చర్చిస్తారు. ఏడాది నుంచి అందించిన సుపరిపాలన మీద చర్చ జరుగుతుంది. ఎన్నికలు గడిచి పథ్నాలుగు నెలలు కావడంతో ఇప్పటి వరకు పార్టీ శ్రేణులతో గడిపే సమయం లేకపోవడం తో ఇప్పుడు ఈ కార్యక్రమంతో పార్టీ నాయకులు, కార్య కర్తలతో పవన్ కళ్యాణ్ కలిసి ఉంటారు. ఈ నెల 30 వ తేదీ జనసేన మహా సభ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సభ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రసంగం ఉంటుంది.ఇప్పటికే సేనతో సేనాని కార్యక్రమ పోస్టర్ ను మంత్రి నాదెండ్ల మనోహర్ విడుదల చేశారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను నాదెండ్ల పరిశీలించారు. క్యాడర్ లో ఉన్న అసంతృప్తిని పోగొట్టడానికి, కొత్త నాయకత్వాన్ని ఆహ్వానించడానికి, పార్టీలో, ప్రభుత్వంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని జనసేన నేతలు చెబుతున్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా హాజరయి క్యాడర్, ఇబ్బందులను విని వాటిని తొలగించే ప్రయత్నం చేస్తారని నమ్ముతున్నారు.

# రాయలసీమలో వజ్రాల వేట..

కర్నూలు, ఆగస్టు 26,

రాయలసీమ ప్రాంతంలో కురిసిన వర్షాలు కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రజల అదృష్టాన్ని పరీక్షించే సమయంగా మారాయి! ఖరీఫ్ సాగుతో పాటు ఇక్కడ వజ్రాల వేట కూడా జోరుగా సాగుతోంది. జొన్నగిరి, తుగ్గలి, పెరవలి మండలాల్లో వజ్రాలు దొరుకుతాయనే ప్రచారం ఎప్పటినుంచో ఉంది. ఈ వర్షాలకు భూమి తడిసి, విలువైన రాళ్లు పైకి తేలుతాయన్న మాటలతో.. స్థానికులు, వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి వజ్రాల వేటకు వస్తున్నారు."ఒక్క రాయి దొరికినా మీ అదృష్టమే మారిపోతుంది'' అని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యాపారవేత్త భరత్ పలోడ్ అన్నారు. సాధారణ రైతులు కూడా కోటీశ్వరులైన కథలు ఈ ప్రాంతంలో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చాయని ఆయన తెలిపారు. పలోడ్ స్వయంగా 2018లో తొలి వజ్రాన్ని కనుగొన్నారు. ఈ ఏడాది మరొక వజ్రాన్ని రూ. 8 లక్షలకు అమ్ముకున్నానని చెప్పారు.సామాజిక కార్యకర్త దీపికా దుసకంటి గతంలో రూ. 5 లక్షల విలువైన వజ్రాన్ని అమ్మి, ఆ డబ్బుతో పేద పిల్లల చదువుకు సాయం చేసినట్లు గుర్తు చేసుకున్నారు.''ఈసారి రూ. 10 లక్షల విలువైన వజ్రం దొరికింది. దీన్ని కూడా విద్యార్థుల కోసమే ఉపయోగిస్తాను," అని ఆమె తెలిపారు.వజ్రాలు దొరుకుతున్న వీడియోలు చూసి జొన్నలగిరికి వచ్చానని చిత్తూరుకు చెందిన రైతు గోదావరమ్మ చెప్పారు. "నేను ఆలస్యంగా వచ్చినా, వెతుకులాట కొనసాగిస్తాను. ఒక్కటి దొరికినా మా కుటుంబానికి సాయం అవుతుంది," అని ఆమె అన్నారు.కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ.. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వజ్రాల గురించి అనేక కథలు ఉన్నాయన్నారు. "ప్రజలు పని కోసం వలస వెళ్లి, వర్షాకాలంలో తిరిగి వచ్చి వజ్రాల వేటలో పాల్గొంటారు. ఇంత పెద్ద మొత్తంలో వజ్రాల వేట సాగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నేరాలు నమోదు కాలేదు," అని ఆయన తెలిపారు. భూమిని తమదని చెప్పుకుని బయటివారిని అడ్డుకున్న సందర్భాలు ఉన్నప్పటికీ, పెద్దగా గొడవలు లేదా నేరాలకు సంబంధించిన సంఘటనలు జరగలేదని ప్రవీణ్ పేర్కొన్నారు.ఈ సీజన్‌లో చాలా విలువైన వజ్రాలు దొరికినట్లు వార్తలు రావడంతో మరింత ఉత్సాహం పెరిగింది. పెరవలి గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి అనే కూలీకి దొరికిన వజ్రాన్ని స్థానిక వ్యాపారికి రూ. 15 లక్షలకు అమ్ముకున్నాడని సమాచారం. అనంతపురం జిల్లాలో 40 ఎకరాలకు పైగా భూమి ఉన్న పీ బజరంగలాల్, తన భూమిలో వజ్రాల వేటకు అభ్యంతరం లేదని చెప్పారు. చాలామందికి ఇక్కడ వజ్రాలు దొరికాయని, వారికి తాగునీరు, ఆహారం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. "ఈ వజ్రాలు ఇతరుల జీవితాల్లో సంతోషం తెస్తే, నేను పూర్తిగా మద్దతు ఇస్తాను," అని ఆయన అన్నారు.కర్నూలు జిల్లా మద్దికేర మండలానికి చెందిన శ్రీనివాసులు అనే రైతుకు రూ. 2 కోట్లు విలువ చేసే అరుదైన వజ్రం దొరికినట్లు, అది సిండికేట్‌కు చెందిన వ్యాపారులకు అమ్ముకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ ఏడాది దొరికిన వజ్రాల్లో ఇదే అత్యంత విలువైనదని అధికారులు తెలిపారు. తుగ్గలి మండలం చింతలకొండ గ్రామంలో ప్రసన్న అనే మహిళ తన పొలంలో దున్నుతుండగా మెరిసే రాయి దొరికింది. దానిని స్థానిక వ్యాపారికి రూ. 13.5 లక్షలకు అమ్మింది. ఈ విషయం ఆమె కుటుంబానికే కాకుండా గ్రామంలోని అందరికీ ఆనందాన్ని ఇచ్చిందని గ్రామస్తులు తెలిపారు.జొన్నగిరి, పాగిదిరాయి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి వంటి ప్రాంతాల్లో వజ్రాల వేట వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. భారీ వర్షాల కారణంగా భూమిలోపల ఉన్న రాళ్లు బయటపడతాయని అంటూ ఉంటారు. అయితే చాలామంది ఖాళీ చేతులతోనే తిరిగి వెళ్తారు. అయినా అప్పుడప్పుడు దొరికే వజ్రాలు వేలాది మందికి స్ఫూర్తిని ఇస్తుంటాయి.కొన్ని సిండికేట్‌లు వజ్రం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేసి, తక్కువ ధరకు కొనేందుకు ప్రయత్నిస్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిని ఎదుర్కోవడానికి కొంతమంది స్థానికులు ఆన్‌లైన్ వేలం లేదా సోషల్ మీడియాలో తమ వజ్రాలను యాడ్స్? రూపంలో పెట్టి మెరుగైన ధరలను పొందుతున్నారు. ఈ వ్యాపారంపై ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను రూపొందించలేదు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఉన్నప్పుడు వజ్రాలకు ఎందుకు ఉండకూడదని పలువురు వంటి రైతులు ప్రశ్నిస్తున్నారు.ఈ వజ్రాల వేట శతాబ్దాల చరిత్రను కలిగి ఉంది. విజయనగర రాజుల ఖజానాలోకి రాయలసీమలో దొరికిన వజ్రాలు వెళ్లాయని జానపద కథలు చెబుతున్నాయి. ఈ వజ్రాల వేట కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాకుండా, ఈ ప్రాంత ప్రజల జీవన శైలిలో ఒక భాగం అయింది. వలస వెళ్లిన కుటుంబాలు.. వర్షం పడగానే తిరిగి వచ్చి అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. అధికారులు దీనిని ఒక రకమైన "వజ్రాల వ్యవసాయం" అని పిలుస్తున్నారు. కఠినమైన భూభాగంలో, అదృష్టం, విశ్వాసం, పట్టుదలపై ఆధారపడిన ఈ వజ్రాల వేట, ఈ ప్రాంతంలో ఒక ప్రత్యేకమైన సాంప్రదాయంగా కొనసాగుతోంది.

# యూరియా సరఫరాపై విజిలెన్స్ నిఘా

విజయవాడ, ఆగస్టు 26,

ఏపీలో పలుచోట్ల యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఫోకస్ పెట్టింది. యూరియా కొరత రానివ్వకుండా చర్యలు చేపట్టామని వెల్లడించింది. విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేశామని? జిల్లాల వారీ మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపింది.తెలుగు రాష్ట్రాల్లో యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరు ప్రభుత్వాలు కూడా యూరియా సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. యూరియా కొరత లేకుండా తక్షణమే సరఫరా చేయాలని కోరుతున్నాయి.యూరియా సరఫరా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ తెలిపింది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని పేర్కొంది. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు... సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టింది.

2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది.

గత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 8,76,928 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ సంవత్సరం అదే కాలానికి 10,96,239 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి.

గత సంవత్సరం కంటే 2,19,311 మెట్రిక్ టన్నులు అధికంగా ఎరువులను రైతులు కొనుగోలు చేశారు.

యూరియా వినియోగం 2024లో 3,74,290 మెట్రిక్ టన్నుల నుంచి ఈసారి 4,57,727 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది 83,436 మెట్రిక్ టన్నుల అధిక వినియోగాన్ని సూచిస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.డీఏపీ వినియోగం 1,17,582 మెట్రిక్ టన్నుల నుంచి 1,37,884 మెట్రిక్ టన్నులకు పెరిగింది.

పొటాష్ వినియోగం 39,054 మెట్రిక్ టన్నుల నుంచి 54,276 మెట్రిక్ టన్నులకు పెరిగి 15,222 మెట్రిక్ టన్నుల మేర పెరిగింది.

యూరియా, ఎరువుల కొరత రాకుండా నెలవారీ సరఫరా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ తాజాగా వెల్లడించింది. కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేస్తున్నారని? దీని వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్ ఫెడ్ కు ఎరువుల కేటాయింపులను పెంచుతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. అందుబాటులో ఉన్న ఎరువుల్లో ఇకపై 70 శాతం ఎరువులను మార్క్ ఫెడ్ కు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్టుకు తరలించిన వారిపై కేసులు పెట్టాలని.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

అలాంటి వారిపై కఠిన చర్యలు - సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. ఎరువుల కొరత అనే సమస్య లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలని సీఎం సూచించారు. ఎరువుల కొరత అనే సమస్య ఉన్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా...రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.

# ప్రపంచ యూత్ ఛాంపియన్ షిఫ్ విజేతగా చికిత

## - భారత తొలి అర్చరి క్రీడాకారిణి గా చికిత రికార్డు
## - భారత్ కు తొలి బంగారు పథకం అందించిన జిల్లా వాసి
## - పలువురు క్రీడాకారుల అభినందనలు

పెద్దపల్లి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి తానిపర్తి చికిత తన అద్భుతమైన ప్రతిభతో అర్చరీ పోటీలో పాల్గొని దేశం గర్వించదగ్గ స్థాయిలో యూత్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. మన దేశంలో ఈ ఘనత సాధించిన మొదటి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించి మన జిల్లాకు గర్వం కారణం. వివరాల్లోకి వెళ్ళితే ఇటీవల కెనడాలో జరిగిన అర్చరి క్రీడా పోటీల్లో తానిపర్తి చికిత పాల్గోని ప్రపంచ స్థాయి విజేతగా నిలిచి భారత దేశ కీర్తిని నిలబెట్టింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత అర్చరి క్రీడాకారిణిగా రాణించి భారత తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. సుల్తాన్ పూర్ గ్రామంలో వ్యవసాయం చేసుకునే తానిపర్తి శ్రీలత - శ్రీనివాస్ రావు దంపతుల కూతురు చికిత, కుమారుడు యస్వంత్ లు ఉన్నారు. చికిత కరీంనగర్ ఉమ్మడి జిల్లా నగునూరులోని ఎస్ పిఆర్ పాఠశాలలో 10 వ తరగతి, పెద్దపల్లి జిల్లా గర్రెపల్లిలో ఇంటర్మిడియట్, పంజాబ్ లోని ఎల్ పి యూనివర్ సిటీ లో డిగ్రీ చదువుతున్నది. బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడాల పట్ల మక్కువ పెంచుకోని అర్చరి పోటీలు జరుగుతున్నపుడు, నేరుగా చూడడంతో పాటు టివిల్లో చూసి ఆ క్రీడాపట్ల ఆసక్తి పెంచుకుంది. ఎలాగైనా ఈ విల్లు క్రీడాను నేర్చుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని పట్టుదలతో కరీంనగర్ లోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందింది. కృషి పట్టుదలతో అర్చరి క్రీడలో నైపుణ్యం పొంది రెండు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రజత, కాంస్య పథకాలను సాధించింది. ఈ ఏడాదిలో జరిగిన ఆసియా కప్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పత కాన్ని కోల్పోయింది. కాగా ఈనెల 24న కెనడాలో జరిగిన అర్చరీ ప్రపంచ ఛాంపియన్షిప్ కాంపౌండ్ విభాగం అండర్ - 21 లో ప్రత్యర్థులను మట్టికరిపించి బంగారు పతకం సాధించి విశ్వ విజేతగా నిలిచింది. అర్చరి క్రీడా విభాగంలో భారత్ కు తొలి బంగారు పథకాన్ని సాధించి దేశ ప్రతిష్ట ను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన చికితను దేశ ప్రజలు అభినందిస్తున్నారు. అలాగే ఓ మారుమూల గ్రామమైన సుల్తాన్ పూర్ బిడ్డ చికిత వల్ల ప్రపంచ దేశాల్లో నిలిచిందని గ్రామ ప్రజలు ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం అధికార యంత్రాంగం అప్రమత్తం

విశాఖపట్నం

బంగాళాఖాతంలో అల్పపీడనంతో ప్రభుత్వం అప్రమత్తం అయింది. అల్పపీడనం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో పలుచోట్ల వర్షాలు పడనున్నాయి. ఇప్పటికే పలుచోట్ల వర్షాలు కురుస్తుండటంతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలి. లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి. సహాయ చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిద్ధంగా ఉండాలి. ప్రమాదకర హోర్డింగ్లు, కూలిన చెట్లను వెంటనే తొలగించాలని హోంమంత్రి ఆదేశించారు.

# డబుల్ పెన్షన్ పై సర్వత్ర చర్చ...

తెలుగు రాష్ట్రాల్లో 'డబుల్ పెన్షన్' వార్త చర్చనీయమైంది. ఒకేఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి... ఏదైనా కారణాలవల్ల నెలకో, రెండు నెలలకో 'మాజీ' అయినా జీవితాంతం పింఛను పొందవచ్చు. అదే నేత... ఎంపీగా గెలిస్తే, మాజీ అయిన తర్వాత ఆ హోదాలో మరో పింఛను ఇస్తారు. మాజీ ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు పింఛను ఇస్తే... మాజీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం రూ.31వేలు జీవితాంతం చెల్లిస్తుంది.ఇలా ఒకే వ్యక్తికి రెండేసి పింఛన్లు ఇవ్వడంలో హేతుబద్ధత ఏమిటో ఎవరికీ అర్థం కాదు. పార్లమెంటు చట్టం ప్రకారం మాజీ ఎంపీలకు, రాష్ట్ర శాసనసభ చట్టాల ప్రకారం మాజీ ఎమ్మెల్యేలకు పింఛన్లు ఇస్తున్నారు. కానీ... ఒకే వ్యక్తికి రెండు పింఛన్లు ఇవ్వకూడదనే చట్టం మాత్రం లేదు.మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్యేగా పని చేసి రెండు పింఛన్లు తీసుకుంటున్న వారిలో మన రాష్ట్రంలో చాలామంది ఉన్నారు. వీరిలో... వందలు, వేల కోట్ల వ్యాపారాలు చేసే బడా పారిశ్రామిక వేత్తలు, స్టార్లు, రాజకీయ వారసు లూ ఉన్నారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యేగా ఒక్కరోజు పని చేసి మాజీ అయినా జీవితాంతం రూ.30వేలు పింఛను వస్తుంది. పొరుగు రాష్ట్రం తెలంగాణలో మాజీ ఎమ్మెల్యేలకు రూ.50 వేలు పింఛను చెల్లిస్తున్నారు. ఇక... మాజీ ఎంపీలకు రూ.31 వేల పింఛను అందుతుంది. విచిత్రం ఏమిటంటే... ఒకే వ్యక్తి 2 పదవులు చేసి మాజీ అయ్యాక అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు పింఛన్లు ఇచ్చేస్తున్నాయి. ఏదేమైనా.. వాళ్లు దీనిని వదులుకోవడంలేదు. మిగిలిన వాళ్లు తమకు తెలియకుండానే రెండూ తీసుకుంటున్నారు.ఒకే వ్యక్తి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేస్తే రెండు పెన్షన్లు తీసుకోవడం సరికాదంటూ ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లికి చెందిన డబ్ల్యూడీ గణేశ్ అనే ఆర్టీఐ కార్యకర్త అభిప్రాయపడ్డారు.చట్టసభ సభ్యులుగా పనిచేసిన మాజీలు ఏదో ఒక పెన్షన్ తీసుకుని మరొకటి వదిలేయాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, చట్టం అనుమతిస్తుంది కాబట్టే, వారు డబుల్ పెన్షన్ తీసుకుంటున్నారని, ఇదేమీ నేరం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.తెలుగునాట ఇలా డబుల్ పెన్షన్ తీసుకుంటున్న వారు 21 మంది ఉండగా, వారిలో సెలబ్రిటీలు, బడా వ్యాపారులు కూడా ఉన్నారు.ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా పనిచేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవితాంతం పెన్షన్లు ఇస్తాయి. వారు మరణించిన తరువాత వారి భార్య/భర్తకు కూడా పెన్షన్ ఇస్తాయి.ఎంపీలుగా పనిచేసిన వారికి భారత ప్రభుత్వం రూ.31 వేల పెన్షన్ ఇస్తుండగా, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి ఏపీ ప్రభుత్వం కనిష్ఠంగా రూ.30 వేల నుంచి గరిష్ఠంగా రూ.50 వేల వరకు పెన్షన్ ఇస్తోంది.ఇక తెలంగాణ కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.70 వేల వరకు ఇస్తోందని గణేశ్ చెప్పారు.సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ప్రకారం తాను చేసిన దరఖాస్తుకు అధికారుల నుంచి వచ్చిన సమాధానంలో ఎంపీలు, ఎమ్మెల్యేల పెన్షన్ల డేటా తెలుసుకున్నానని గణేశ్ చెప్పారు.దాని ప్రకారం.. ప్రస్తుతం భారత్‌లో 2,229 మంది మాజీ ఎంపీలు పెన్షన్లు తీసుకుంటుండగా, ఏపీలో 473 మంది, తెలంగాణలో 465 మంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెన్షన్ తీసుకుంటున్నట్టు తెలిసిందని గణేశ్ అంటున్నారు.ఇవి కాకుండా వారికి ఇతర సదుపాయాలు ఉంటాయని ఆయన చెబుతున్నారు.పెన్షన్ కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని, అలాంటి వారికే పెన్షన్ వస్తుందని ఆయనంటున్నారు."చట్ట ప్రకారం రెండు పెన్షన్లు తప్పు కాకపోవచ్చు. కానీ, రాజభరణాలను రద్దు చేసిన తీరులోనే వీటిని రద్దు చేయాల్సిన సమయం వచ్చింది. అప్పట్లో సొంత ఆస్తులు అమ్ముకున్న నాయకుల కోసం ఈ పెన్షన్లు వంటివి వచ్చాయి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అసలు పెన్షన్లే వద్దు అనడం లేదు. ఒక మనిషికి ఒక పెన్షన్, అది ఎమ్మెల్యేదో లేదా ఎంపీదో చాలు అంటున్నాను. ఇప్పుడు సుందరయ్య, ప్రకాశం, సంజీవయ్య వంటి వారు లేరు. పెన్షనే వద్దంటే అన్యాయం. ఒకటి చాలు, రెండు వద్దు అంటున్నాను" అని అన్నారు గణేశ్.ది శాలరీస్ అండ్ పెన్షన్ యాక్ట్' ప్రకారం ఎంపీలకు, తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్థానిక చట్టాల ప్రకారం ఈ పెన్షన్లను చెల్లిస్తున్నారు.2004 తరువాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి కూడా పెన్షన్లు ఉండవు.అంతేకాదు, ప్రభుత్వ రంగ సంస్థలు అంటే పీఎస్‌యూలలో పనిచేసే వారికి కూడా నామమాత్రపు పెన్షన్ వస్తుంది.లేని సౌకర్యం చట్టసభల సభ్యులకు మాత్రం ప్రభుత్వం ఎందుకు ఇవ్వాలని యాక్టివిస్టులు ప్రశ్నిస్తున్నారు.గ్యాస్ సిలిండర్ మీద సబ్సిడీ వదులుకోమని చెబుతున్న ప్రభుత్వాలు, డబుల్ పెన్షన్ వదులుకోమని ఎందుకు చెప్పడం లేదు?. ఈ జాబితాలో వందల కోట్ల ఆస్తులున్న వారు కూడా ఉన్నారు. పన్ను కట్టే వ్యక్తిగా అడిగే హక్కు నాకు, నాతో పాటు మనందరికీ ఉంది" అన్నారు గణేశ్.చట్ట ప్రకారం రెండు పెన్షన్లు తీసుకోవడం నేరం కాదు కాబట్టి, వారిని విమర్శించాల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు."ఇందులో విమర్శించడానికి ఏమీ లేదు. ఎవరైనా కావాలంటే స్వచ్ఛందంగా తమ పెన్షన్ వదులుకుంటే బావుంటుంది. కానీ, వారిని వ్యక్తిగతంగా తప్పు పట్టాల్సిన అవసరం లేదు. కొందరు ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడే జీతం తీసుకోరు, మరికొందరు తీసుకుంటారు. అందులో ధనిక, తక్కువ ఆదాయం అన్న తేడా లేదు. మేం చేసిన దానికే ఇస్తున్నారు కదా అని వారు అనుకోవచ్చు. దానికి చట్టం అనుమతిస్తుంది. అయితే చట్టం మార్చాలి లేదా వ్యక్తిగత నిర్ణయానికి వదిలేయాలి. అంతేకానీ, చట్ట ప్రకారం తీసుకుంటున్న వారి విషయంలో ఇలా పేర్లు తీసుకుని, ఫోటోలు వేసి ఏదో నేరం చేసినట్టు చూపించడం మంచిది కాదు" అని రాజకీయ విశ్లేషకులు కటారి శ్రీనివాస్ అన్నారు.ప్రస్తుతం ఈ పెన్షన్లను ఎంపీలకు 'ది శాలరీస్ అండ్ పెన్షన్ యాక్ట్' ప్రకారం, తెలుగు రాష్ట్రాల చట్టసభల సభ్యులకు స్థానిక చట్టాల ప్రకారం చెల్లిస్తున్నారు.ఇవి 1953-54 ప్రాంతానికి చెందిన చట్టాలు. ప్రస్తుతం ఈ చట్టాలకు సవరణ చేసి డబుల్ పెన్షన్ విధానం రద్దు చేయాలని గణేశ్ డిమాండ్ చేస్తున్నారు.వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ తాను త్వరలో హైదరాబాద్, విజయవాడల్లో నిరసన కార్యక్రమాలు చేపడతానని గణేశ్ బీబీసీతో అన్నారు. అసలు మొత్తంగా ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేసిన వారికి పెన్షన్లు రద్దు చేయాలంటూ కొందరు గతంలో సుప్రీంకోర్టుకు వెళ్లగా, దాన్ని కోర్టు కొట్టేసింది.మదనపల్లికి చెందిన డబ్ల్యూడీ గణేశ్ ఓ ఆర్టీఐ యాక్టివిస్టు. తాను రెండేళ్లుగా ప్రజాస్వామ్య సంస్కరణల కోసం పోరాడుతున్నట్టు ఆయన చెప్పారు.డబుల్ పెన్షన్ల తొలగింపుతో పాటు, పార్టీ ఫిరాయింపు నిబంధనలలో సంస్కరణలు చేసి స్పీకర్ స్థానంలో ఎన్నికల సంఘానికి బాధ్యత ఇవ్వడం, ఒక నాయకుడు ఒక పదవిలోనే ఉండేలా చూడటం, ఒకేసారి రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయకుండా చూడటం, మంత్రి కావాలంటే ముందుగా కచ్చితంగా ఎమ్మెల్యే లేదా ఎంపీ లేదా ఎమ్మెల్సీ తప్పకుండా అయ్యేలా చూడటం ? ఇలాంటి కొన్ని సంస్కరణల కోసం పోరాడుతున్నట్టు ఆయన చెప్పారు.

====================లీలీలీ

## దారి తప్పుతున్న ధర్మవరం

అనంతపురం, ఆగస్టు 26,

ధర్మవరం నియోజకవర్గం ఎన్నికలు జరుగుతున్న దగ్గర నుంచి నిత్యం వార్తల్లోనే నిలుస్తుంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య పొసగడం లేదు. అలాగే టీడీపీ నేతలు కూడా గ్రూపులుగా విడిపోయి వీధుల్లోకి దిగుతుండటం మంత్రికి తలనొప్పిగా మారింది. ధర్మవరం నియోజకవర్గంలో కూటమి పార్టీల్లో సఖ్యత లేకపోవడంతో పాటు నియోజకవర్గం టీడీపీలో గ్రూపు తగాదాలు రచ్చ రేపుతున్నాయి. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి 2019 ఎన్నికల తర్వాత టీడీపీని వీడి బీజేపీలో వెళ్లడంతో అక్కడ ఇన్ ఛార్జి బాధ్యతలను పరిటాల శ్రీరామ్ కు చంద్రబాబు నాయుడు అప్పగించారు. అయితే మొన్నటి ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గం కూటమి పార్టీల్లో పొత్తులో భాగంగా బీజేపీకి వెళ్లిపోయింది. సత్యకుమార్ యాదవ్ బీజేపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి నియోజకవర్గంలో ఏదో ఒక విషయంలో విభేదాలు కూటమి నేతల మధ్య తలెత్తుతూనే ఉన్నాయి. మొన్నటి వరకు సత్యకుమార్ మాత్రం వైసీపీ స్థానిక నేతలను దగ్గరకు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. టీడీపీ, జనసేన కంటే వైసీపీ నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నేతలు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ధర్మవరానికి సత్యకుమార్ తీసుకురావడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఆవివాదం సద్దుమణిగిందని భావించిన సమయంలో మరొక వివాదం చుట్టుముట్టింది. మరోసారి మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నేతలలో గ్రూప్ వార్ మొదలయింది. ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య యుద్ధం మొదలయింది. బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి వద్ద ఘటన జరిగింది. టీడీపీ నేతలు విశ్వనాథ నాయుడు, గంటాపురం జగ్గు వర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. బొగ్గు వ్యాపారుల నుంచి కమిషన్ల కోసం పరిటాల వర్గీయుల మధ్య ఆధిపత్యపోరు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరస్పరం ఇనుపరాడ్లు, కర్రలతో పరిటాల శ్రీరామ్ అనుచరులు దాడి చేసుకున్నారని చెబుతున్నారు. ఇరువర్గాల దాడిలో రెండు వాహనాలు ధ్వంసం కాగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. సోషల్ మీడియాలో టీడీపీ నేతల ఫైట్ దృశ్యాలు వైరల్ కావడంతో సైకిల్ పార్టీలో విభేదాలు రోడ్డుకెక్కాయి.

## సెకండరీ టారిఫ్ లు

ముంబై, ఆగస్టు 26,

దేశంలోని 140 కోట్ల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, 'బెస్ట్ డీల్' ఉన్న చోట నుంచే చమురు కొనుగోలును భారత్ కొనసాగిస్తుందని రష్యాలోని భారత రాయబారి వినయ్ కుమార్ స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై డోనల్డ్ ట్రంప్ 25 శాతం పెనాల్టీతో కలిపి విధించిన 50 శాతం టారిఫ్‌ల అమలుకు కొన్ని రోజుల ముందు వినయ్ కుమార్ ఈ ప్రకటన చేశారు. రష్యాపై ఆర్థిక ఒత్తిడి తీసుకురావడానికి, యుక్రెయిన్‌తో యుద్ధం ఆపేలా ఒత్తిడి పెంచడానికి భారత్‌పై ట్రంప్ సెకండరీ టారిఫ్‌లు (నేరుగా రష్యాపై కాకుండా, ఆ దేశంతో వ్యాపారం చేసే ఇతర దేశాలపై సుంకాలు విధించడం) విధించారని సోమవారం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచి రష్యా చౌక ముడి చమురును భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకోవడంతో భారత్, అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వాణిజ్య ఒప్పందం చర్చలు కూడా దీనివల్ల ప్రభావితమయ్యాయి. భారత చమురు దిగుమతుల్లో రష్యా క్రూడాయిల్ వాటా 2021లో 3 శాతం ఉండగా, 2024లో 35-40 శాతానికి పెరిగింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల యుక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు నిధులు సమకూరేందుకు భారత్ సహకరిస్తోందంటూ అమెరికా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణను భారత్ ఖండిస్తోంది. భారత వాణిజ్యం, మార్కెట్ అంశాలపై అధారపడి ఉందని, దేశ ప్రజల ఇంధన భద్రతకే కట్టుబడి ఉందని సోమవారం రష్యా న్యూస్ ఏజెన్సీ టాస్‌తో వినయ్ కుమార్ అన్నారు. భారత్‌పై ట్రంప్ సెకండరీ టారిఫ్‌ల విధింపు 'అన్యాయం, అహేతుకం, అసమంజసం' అని ఆయన పునరుద్ఘాటించారు. రష్యా క్రూడాయిల్‌ను భారత్ కొనుగోలు చేయడాన్ని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ గట్టిగా సమర్థించారు. ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే వినయ్ కుమార్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. వాణిజ్యానికి అనుకూలంగా ఉన్న అమెరికా పాలకవర్గంలో పనిచేసే వ్యక్తులే ఇతరులు వ్యాపారం చేస్తున్నారంటూ ఆరోపించడం హాస్యాస్పదంగా ఉంది. ఇంకా చెప్పాలంటే, రష్యా చమురుకు అతిపెద్ద దిగుమతిదారు అయిన చైనా, రష్యాతో పెద్ద ఎత్తున వాణిజ్యం చేస్తున్న యూరోపియన్ యూనియన్‌పై ట్రంప్ సెకండరీ టారిఫ్‌లు విధించలేదు. భారత్ వ్యూహాత్మకంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. అమెరికా ఒత్తిడికి తలొగ్గదు" అని ఆయన చెప్పారు. భారత్‌కు అత్యంత ముఖ్య మిత్రదేశాల్లో రష్యా ఒకటి కాగా, యుక్రెయిన్‌తో కూడా భారత్ స్నేహపూర్వక సంబంధాలనే కొనసాగిస్తోంది. రష్యా-యుక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్యం ద్వారా శాంతిపూర్వక పరిష్కారం దిశగా పనిచేయాలని భారత్ పదే పదే చెబుతోంది. అయితే, పశ్చిమ దేశాల నుంచి ఒత్తిడి ఉన్నప్పటికీ రష్యాను బహిరంగంగా భారత్ ఇప్పటివరకు ఖండించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ 2024లో యుక్రెయిన్‌ను సందర్శించారు. వీలైనంత త్వరగా శాంతిని పునరుద్ధరించేందుకు అన్ని విధాలుగా సహకరించేందుకు భారత్ తమ సంసిద్ధతను వ్యక్తం చేసింది. యుక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమీర్ జెలియన్‌స్కీ త్వరలోనే భారత్‌కు రావొచ్చని, తేదీలు ఇంకా ఖరారు కాలేదని సోమవారం స్థానిక మీడియాతో భారత్‌లోని యుక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్చుక్ చెప్పారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కూడా ఈ ఏడాది భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. యుక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ట్రంప్ ప్రయత్నాలపై వాన్స్ విశ్వాసం వ్యక్తం చేశారు.'

# పీ4 కిందకు 13 లక్షల కుటుంబాలు

విజయవాడ, ఆగస్టు 26, (

ఈ ఏడాది ఉగాది నాడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించగా..అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి.. అభివృద్ధి చెందాలి.. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్టకుండా... బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి'' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అనుకున్నదే చేస్తారు. దానిపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కు తగ్గరు. తనకు అనుకూలమైన మీడియా వ్యతిరేకించినా తాను మాత్రం అనుకున్న దారిలోనే ముందుకు వెళతారు. అందులో పీ4 పథకం పై ఆయన ముందుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఎవరేమనుకున్నా.. ఎవరేం చెప్పినా తన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. పేదరిక నిర్మూలన అంటే మొత్తం పేదరికం రూపుమాపడం కాదని, కనీసం వాళ్లు తమ కుటుంబాన్ని పోషించుకునే స్తోమతను కల్పించడమే తన ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇందుకోసం వెనక్కు తగ్గబోమని, పేదవాళ్ల కోసం మనసున్న వాళ్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పదే పదే పిలుపు నిస్తున్నారు. గత ఉగాదికి పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి పేదల కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా ఎంపిక చేసుకుంటూ వెళుతున్నారు. తాను నియోజకవర్గాలను పర్యటించినప్పుడు కనీసం రెండు, మూడు బంగారు కుటుంబాలను గుర్తించే పనిగా పెట్టుకున్నారు చంద్రబాబు నాయుడు. ఇప్పటికే ఈ పథకం కింద దాదాపు పదమూడు లక్షల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. అలాగే మార్గదర్శకులుగా ఉండేందుకు దాదాపు 1.40 లక్షల మంది ముందుకు రావడం కూడా పథకం విజయవంతమవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. వీరిలో ప్రవాసాంధ్రులతో పాటు పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు. సంపద సృష్టించడమంటే పేదల ఇళ్లల్లో వెలుగు నింపడమేనని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ పథకం వల్ల కొన్ని కుటుంబాలయినా కూడు, గుడ్డ, నివాసానికి ఇబ్బంది లేకుండా ఉండగలిగితే సగం విజయం సాధించినట్లేనని నమ్ముతున్నారు. ఎంతమందికి అవకాశాలు కల్పించామన్నది కాకుండా వారు జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. దీనివల్ల పేదల కుటుంబాల్లో తొలుత మానసికంగా ధైర్యంవస్తుందని, తర్వాత వారు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడమే కాకుండా పది మందికి ఉపయోగపడేలా తయారవుతారన్నది చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు తన సొంత మీడియాలో విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. పీ4 పథకం ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆయన బలంగా విశ్వసిస్తున్నారు. మరి ఈ పథకం సక్సెస్ అయితే మాత్రం చంద్రబాబు నాలుగో పర్యాయంలో నూతన పథకంతో జనంలోకి వెళ్లినట్లే అనుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురాబోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం. సంజీవని పేరుతో ప్రజారోగ్య పరిరరక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని తెస్తున్నాం. ఇప్పటికే కుప్పంలో బిల్‌గేట్స్ ఫౌండేషనుతో డీజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తెస్తాం" అని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

పీ4 అంటే??

రాష్ట్రంలోని పేద కుటుంబాలను గుర్తించి సాధికారతను కల్పించటమే పీ-4 ప్రోగ్రాం ఉద్దేశ్యం. సంపద అధికంగా ఉన్న ఫ్యామిలీలను మార్గదర్శులుగా ఉంటారు. వీరు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు సపోర్టుగా నిలబడే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా గ్రామా, వార్డుల్లో నిర్వహించే సర్వే, గ్రామసభల ఆధారంగా ఎంపిక చేస్తున్నారు.

# లేడీ డాన్ అరుణ..

## పెరోల్ లో చేతులు మారిన 2 కోట్లు

నెల్లూరు, ఆగస్టు 26, (న్యూస్ పల్స్)

అంతా శాఖాహారులే?.. కానీ? బుట్టలోని రొయ్యలు మాత్రం మాయం. ప్రస్తుతం రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ ఎపిసోడ్‌కు ఈ సామెత సరిగ్గా సరిపోతుందంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఈ కేసుకు సంబంధించి పేర్లు బయటికి వచ్చిన నేతలంతా? మాకు సంబంధం లేదంటే మాకు లేదంటున్నారు. కానీ? పెరోల్ మాత్రం వచ్చింది, రచ్చ అయ్యాక మళ్లీ శ్రీకాంత్‌ని లోపలికి నెట్టారు. కానీ.. ఇక్కడ అసలు దోషులెవరన్నది బిగ్ క్వశ్చన్. ఒక హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న, అంతకు ముందు కూడా నేర చరిత్ర ఉన్న వ్యక్తిని పెరోల్ మీద బయటికి తీసుకువచ్చి? అతనితో ఏం చేయిద్దామనుకున్నారన్నది మిలియన్ డాలర్ క్వశ్చన్. ఒక రౌడీషీటర్‌కు అసలు రెండు సార్లు పెరోల్ ఎందుకు ఇచ్చారు? ఈ ప్రభుత్వంలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఎలా సిఫారసు లేఖలు ఇచ్చారు? మానవతా దృక్పథంతో లెటర్ ఇచ్చామన్నదే వాళ్ళ సమాధానమైతే? ఒక కరుడుగట్టిన నేరస్తుడి మీద అంత మానవత్వం ఎందుకు ప్రదర్శించాల్సి వచ్చింది? మా సిఫారసు లేఖలు రిజెక్ట్ అయ్యాయని ఎమ్మెల్యేలు చెబుతున్నారు సరే? మరి పెరోల్ వచ్చేలా పావులు కదిపింది ఎవరు? హోంశాఖలో ఉన్నతాధికారులు పావులు కదిపారా? ఇందులో అసలు హోం మంత్రి అనిత పాత్ర ఎంతవరకు? ఆమె పెరోల్‌కి అనుమతి ఇచ్చారా లేదా? ఈ మొత్తం ఎపిసోడ్‌కు సంబంధించి ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. ఒకవేళ పెరోల్ వద్దని మంత్రి చెప్పి ఉంటే? ఆమె వద్దన్నా అదే డిపార్ట్‌మెంట్‌లో మినిస్టర్ మాట కాదని నేరస్తుడిని బయటికి తీసుకువచ్చింది ఎవరన్నది కూడా తేలాల్సి ఉంది. అసలు గూడూరు ఎమ్మెల్యే సునీల్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని పెరోల్ కోసం ఎవరు అప్రోచ్ అయ్యారన్న డౌట్స్ కూడా ఇప్పుడు పెరుగుతున్నాయట. శ్రీకాంత్ కుటుంబ సభ్యుల పేర్లను పైకి చెబుతున్నా? వాళ్ళని కూడా వెనక నుంచి ఏదో శక్తి డ్రైవ్ చేసిందన్న సందేహాలు పెరుగుతున్నాయి. శ్రీకాంత్ తండ్రి పెరోల్ కోసం తన దగ్గరకు వచ్చారని, అందుకే లెటర్ ఇచ్చానంటున్నారు కోటంరెడ్డి. అయినాసరే? తన సిఫారసు లేఖతో పెరోల్ రాలేదన్నది ఆయన వాదన. అదే నిజమనుకుంటే?. మరి పెరోల్ ఎలా వచ్చింది? తెర వెనక చక్రం తిప్పింది ఎవరన్నది మిస్టరీగా మారింది. ఒకవేళ శ్రీకాంత్ ప్రియురాలు నిడిగంటి అరుణ పెరోల్ కోసం ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను అప్రోచ్ అయిఉంటే?. ఆమెతో వాళ్ళకున్న సంబంధాలేంటన్న ప్రశ్నలు వస్తున్నాయి. వెనకున్న అదృశ్య శక్తి ఏదో?. శ్రీకాంత్‌ను పెరోల్ మీద బయటికి రప్పించి చేయకూడని పనులేవో చేయించాలనుకుందన్న చర్చ జరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో. ఎమ్మెల్యేలు ఇద్దరూ పెరోల్ కోసం సిఫార్సు చేస్తే? విచారణ తరువాత హోమ్ మంత్రి అనిత వెనక్కి తగ్గారని, పెరోల్ అవసరం లేదని అన్నారని, ఆ తర్వాతే స్టోరీ మారిపోయిందన్నది ఇంకో వెర్షన్. హోమ్ మంత్రి తిరస్కరించిన వెంటనే? సీన్‌లోకి శ్రీకాంత్ లవర్?అరుణ ఎంటరైపోయి?. అనితతో చర్చలు జరిపిందన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి సచివాలయవర్గాల్లో. ఆ తర్వాతే పెరోల్ ఫైల్ ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్ళి ఓకే అయిందని చెప్పుకుంటున్నారు. ఇక్కడే ఒక పెద్ద డౌట్ వస్తోందట అందరికీ. అసలు పెరోల్‌కు హోమ్ మంత్రి అనుమతి ఇచ్చారా? లేదా అన్నదే ఆ అనుమానం. మంత్రే పెరోల్‌కు రికమండ్ చేశారా? లేక ఫైల్ ఆమె దగ్గరి నుంచి వెళ్ళిపోయాక దాన్ని ఆసరా చేసుకుని? డిపార్ట్‌మెంట్‌లో ఉన్నతాధికారులు చక్రం తిప్పారా అన్న విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. అదే నిజమైతే? రౌడీ షీటర్ పెరోల్‌కు తెర వెనక నుంచి సహకరించిన ఆ పోలీసు అధికారులెవరో తేలాల్సి ఉంది. ఇందులో? ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలున్నాయి? ఏ పనిమీద నేరస్తుడిని బయటకొచ్చారన్న చర్చ ఇప్పుడు ఏపీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సైతం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. ఈ వ్యవహారంపై ముందు ఎవరూ మట్లాడొద్దని ఎంత కట్టడి చేసినా? పోలీస్ వర్గాల్లో కూడా చర్చ ఆగడం లేదు. హోమ్ శాఖలోని కీలక అధికారి, అలాగే? ప్రభుత్వంలోని అత్యంత ఉన్నతాధికారి నేతృత్వంలోనే పెరోల్ మంజూరైందన్న ప్రచారం జోరుగా జరుగుతోంది సచివాలయ వర్గాల్లో. ఆ పెద్ద ఉన్నతాధికారి హోమ్ శాఖ అధికారిని తన ఛాంబర్‌కు పిలిపించుకుని మరీ? పెరోల్ ఇమ్మన్నట్టు చెప్పుకుంటున్నారు. ఆ స్థాయిలో వచ్చిన రికమండేషన్ కారణంగానే? ఆఘమేఘాల మీద ఫైల్ కదిలి రౌడీ షీటర్ బయటికి వచ్చాడని మాట్లాడుకుంటున్నారు. ఆ? పెద్ద ఉన్నతాధికారికి, శ్రీకాంత్ లవర్ అరుణకు మధ్య అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు రికమండ్ చేశాక పెరోల్ ఫైల్..ముందుకు వెళ్ళింది. కానీ? హోమ్ మంత్రి విచారణ తర్వాత ఆగింది. అదే సమయంలో ఉన్నతాధికారులు ఎంటర్ అయ్యారని, దీనికి సంబంధించి దాదాపు 2 కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ప్రచారం ఉంది. అదే నిజమైతే? ఆ డబ్బు ఎవరికి చేరింది? ఇందులో హోమ్ మంత్రి, ఇతర అధికారుల పాత్ర ఎంత అన్న విషయమై హాట్ హాట్ చర్చ జరుగుతోంది. ప్రభుత్వంలో ఉన్న పెద్ద అధికారి పాత్ర ఇందులో ఉన్నట్టు వాసన రావడంతో? ఇటు సర్కార్ పెద్దలు కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారట. మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నట్టు తెలిసింది. మొత్తం మీద ఒక రౌడీ షీటర్‌కు పెరోల్ వ్యవహారం ఇప్పుడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ సచివాలయాన్ని కూడా షేక్ చేస్తోంది.

# భారీగా తగ్గనున్న ధరలు

హైదరాబాద్, ఆగస్టు 26

ఈ సారి ప్రజలు డబుల్ దీపావళి జరుపుకుంటారని స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ అన్నారు. జీఎస్టీ విధానంలో కీలక సంస్కరణలు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో వివిధ వస్తువులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించడంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలు ప్రజలకు భారీ ఊరటనిచ్చే అవకాశం ఉంది. సిమెంట్‌పై జీఎస్టీ తగ్గింపు: సిమెంట్‌పై ప్రస్తుతం ఉన్న 28శాతం జీఎస్టీ రేటును 18శాతానికి తగ్గించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. ఈ తగ్గింపు నిర్మాణ రంగానికి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఊతమిస్తుంది. వినియోగదారులకు కూడా ఇళ్ల నిర్మాణం మరింత చౌకగా మారే అవకాశం ఉంది.: వ్యక్తులు కొనుగోలు చేసే టర్మ్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని సున్నాకి తగ్గించే ప్రతిపాదన కూడా కౌన్సిల్ ముందుకు రానుంది. ఈ చర్య ఆరోగ్య బీమాను ప్రోత్సహించి, దేశంలో బీమా పరిధిని పెంచేందుకు తోడ్పడుతుంది. ప్రస్తుతం మధ్యస్థం నుండి హై-ఎండ్ సెలూన్‌లపై విధించే 18శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ మార్పు సాధారణ ప్రజలకు సెలూన్ సర్వీసులను మరింత అందుబాటులోకి తీసుకొస్తుంది ఆహార, వస్త్ర వస్తువులన్నింటినీ 5శాం పన్ను శ్లాబ్‌లోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. ఇది ఆహార, వస్త్ర పరిశ్రమలలో వర్గీకరణ సమస్యలను తొలగించి, పన్ను విధానాన్ని మరింత సులభతరం చేస్తుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జీఎస్టీ వ్యవస్థను పూర్తిగా పునఃపరిశీలించే అవకాశం ఉంది. వివిధ పన్ను శ్లాబ్‌లను కేవలం రెండు ప్రధాన శ్లాబ్‌లుగా ఏకీకృతం చేయాలని కౌన్సిల్ భావిస్తోంది. కొన్ని విలాసవంతమైన వస్తువులపై 40శాతం పన్ను కొనసాగించవచ్చు. ఈ ప్రతిపాదనలు జీఎస్టీ వ్యవస్థను సరళీకృతం చేసి, పన్ను విధానంపై ఉన్న గందరగోళాన్ని తగ్గించడానికి ఉపయోగపడనున్నాయి. అయితే పశ్చిమ బెంగాల్ వంటి కొన్ని రాష్ట్రాలు 40శాం పన్ను పరిమితిని మరింత పెంచాలని కోరాయి. కానీ అధికారులు ఇది చట్టపరమైన సవరణలను కోరుతుందని, ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. 8ఏళ్ల క్రితం జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి పన్ను వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వినియోగదారులకు, ప్రభుత్వానికి ప్రయోజనం కలిగేలా సమతుల్యం చేయడానికి ఈ సమావేశం ఒక ముఖ్యమైన వేదిక కానుంది. ఈ నిర్ణయాలన్నీ అమలైతే, ప్రజలకు ధరల భారం తగ్గే అవకాశం ఉంది

=================

## సీనియర్లే బెటర్...

కాకినాడ, ఆగస్టు 2

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సీనియర్ నేతల విలువ తెలిసి వచ్చినట్లుంది. జూనియర్ ఎమ్మెల్యేలతో పడుతున్న అవస్థలు చూసి సీనియర్లే నయం అనిపించేలా చంద్రబాబు మాటలు ఉన్నాయి. గత కొంతకాలంగా ఎమ్మెల్యేలు వరస వివాదాలతో చిక్కుకోవడం తో పాటు అందులో ఎక్కువ మంది తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన వారు ఉండటంతో గతంలో లేని తలనొప్పులు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయన్న విషయం చంద్రబాబుకు అర్థమయినట్లుంది. అందుకే సీనియర్ నేతల విలువ ఆయనకు తెలిసిందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. సీనియర్ నేతలకు ఉన్న అనుభవంతో పాటు వారికి ప్రజల్లో ఉన్న పట్టు ఈతరం నేతలకు లేకపోవడానికి అనేక కారణాలున్నాయని చంద్రబాబు గుర్తించారు.. ఒకసారి ఎమ్మెల్యే గా గెలిచిన వెంటనే తాను నియోజకవర్గానికి మోనార్క్ అయిపోయినట్లు వ్యవహరిస్తూ తన విజయం కోసం పనిచేసిన పార్టీ కార్యకర్తలను పట్టించుకోకుండా నియోజకవర్గంలో అన్ని విషయాల్లో వేలుపెడుతూ వివాదాల్లో చిక్కుకోవడంతో పాటు ఇగోలకు పోవడంతో పాటు, సోషల్ మీడియాలో వారి వ్యవహార శైలి కూడా పార్టీకి ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యేలు కొందరు ప్రొటోకాల్ తెలుసుకోకుండానే అధికారులతో ఎమ్మెల్యేలు వాగ్వాదానికి దిగుతుండటాన్ని కూడా ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రస్తావిస్తున్నారు. అలాంటి వివాదాలను గతంలో సీనియర్ నేతలు ఎవరికీ రాకపోవడాన్ని కూడా గుర్తుంచుకోవాలంటున్నారు. కొత్తతరానికి అవకాశమివ్వాలని... పార్టీకి కొత్త రక్తం కావాలని యువతకు పెద్దపీట వేయాలని, కొత్తతరానికి రాజకీయాల్లో అవకాశం కల్పించాలని తాను నిర్ణయం తీసుకుంటే.. కూటమి కారణంగా గెలిచిన ఎమ్మెల్యేలు గెలుపు తమదేనని విర్రవీగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. ఇసుక, మద్యం విషయాల్లోనూ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే ల నియోజకవర్గాల్లోనే రచ్చకెక్కడాన్ని ఆయన గుర్తు చేసుకుంటున్నారు. అనుభవం లేకుంటే పెద్దలను చూసి తెలుసుకోవాలి. పది కాలాల పాటు తాము ఆ నియోజకవర్గంలో గెలిచేందుకు అవసరమైన రోడ్ మ్యాప్ ను గెలిచిన రోజు నుంచి రూపొందించుకోవాల్సిన సమయంలో ఎమ్మెల్యేలు ఇలా వ్యవహరించడంతో చంద్రబాబుకు తత్వం బోధపడిందని తెలిపింది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పార్టీకి అండగా నిలబడకపోగా, విపక్షాల విమర్శలపై స్పందించకపోగా, వివాదాలబారిన పడుతుండటం చంద్రబాబును పునరాలోచనలో పడిందనే చెప్పాలి.

## విజయ్ కు నెటజన్లు సెటైర్లు

చెన్నై, ఆగస్టు 26,

త్వరలో తమిళనాడు రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే పరోక్షంగా ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టాయి. అధికార డిఎంకె సోషల్ మీడియాలో గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. భారీగానే సభలు పెడుతూ హంగామా సృష్టిస్తున్నది. మరోవైపు బిజెపి కూడా తగ్గేది లేదు అన్నట్టుగా ప్రచారం మొదలుపెట్టింది. కాంగ్రెస్ డిఎంకెలో భాగస్వామ్య పార్టీ కాబట్టి.. డీఎంకే నిర్వహిస్తున్న సభల్లో పాల్గొంటున్నది. ఇక ఇటీవల టీవీకే పేరుతో పార్టీ పెట్టిన సినీ నటుడు విజయ్.. తన పార్టీ కార్యక్రమాలను వేగవంత చేసారు. ఇటీవల మధురైలో మానాడు పేరుతో భారీ సభ నిర్వహించారు. ఈ సభకు లక్షలలో జనం తరలివచ్చారు. తమిళనాడు రాజకీయాలను మార్చేస్తానని.. అధికారం కోసం అడ్డదారులు తొక్కనని.. సొంతంగానే అధికారంలోకి వస్తామని.. ప్రజలకు అలవికాని హామీలు ఇచ్చి మోసం చేయలేనని విజయ్ ప్రకటించారు. తమిళనాడు అభివృద్ధికి.. తమిళనాడు ఉన్నతి కి ఏం చేయాలో తనకు తెలుసని విజయ్ పేర్కొన్నారు. విజయ్ నిర్వహించిన సభకు భారీగా జనం రావడంతో టీవీకే పార్టీ కార్యకర్తల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి నాయకులు చేరిపోతున్నారు. ఇది ఎంతవరకు తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేస్తుంది.. విజయ్ ముఖ్యమంత్రి అవుతారా.. అనే విశ్లేషణలు అక్కడి రాజకీయాలలో జోరుగా సాగుతున్నాయి. ఇ

# రంగంలోకి ట్రాఫిక్ మార్షల్స్

హైదరాబాద్, ఆగస్టు 26,

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు హైదరాబాద్ పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా 50 ట్రాఫిక్ పెట్రోలింగ్ బైక్‌లను, 100 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (ఊఊూఅ) ఆధ్వర్యంలో ప్రైవేట్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ తెలిపారు."హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ తరపున ట్రాఫిక్‌కు సంబంధించిన రెండు ముఖ్యమైన కార్యక్రమాలు ప్రారంభించాం. ట్రాఫిక్ ఫోరమ్ కృషితో 100 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను, 50 ట్రాఫిక్ బైక్‌లను ప్రారంభించాం. వీటన్నింటినీ ప్రైవేట్ సంస్థలు అందించాయి. ఈ బైక్‌లు ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించడంలో చాలా ఉపయోగపడతాయి. త్వరలో మరో 500 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను, 100 బైక్‌లను తీసుకురావాలని ప్రణాళికలు రూపొందించాం'' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు.సీపీ సి.వి. ఆనంద్ తన ఎక్స్ పోస్ట్‌లో ఈ కార్యక్రమం గురించి మరిన్ని వివరాలు పంచుకున్నారు. ఈ చొరవ పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ఖఖఖ) మోడల్‌లో అనేక కార్పొరేట్, పౌర సంస్థల సహకారంతో చేపట్టినట్లు ఆయన తెలిపారు.తాజాగా ప్రవేశపెట్టిన పెట్రోలింగ్ బైక్‌లు (బజాజ్ అవెంజర్ 220 క్రూజ్) అధునాతన సాంకేతికతతో రూపొందించినవి. వీటిలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ (ఖం), జీపీఎస్ ట్రాకింగ్, డాష్‌బోర్డ్, బాడీ-వోర్న్ కెమెరాలు వంటివి ఉన్నాయి. ఈ ఫీచర్లు ట్రాఫిక్ నియంత్రణకు, నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడానికి, అత్యవసర పరిస్థితులకు త్వరగా స్పందించడానికి ట్రాఫిక్ పోలీసులకు సహాయపడతాయి.

ట్రాఫిక్ మార్షల్స్‌గా విధులు నిర్వర్తించేందుకు తొలిసారిగా భారతదేశంలోనే ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను కూడా నియమించారు. ఎంపికైన 100 మంది ట్రాఫిక్ మార్షల్స్‌ను నగరంలోని ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు పర్యవేక్షణలో ఉండి సహాయం చేయడానికి పంపించారు. వీరికి 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. భవిష్యత్తులో ఈ మార్షల్స్ సంఖ్యను 500కు పెంచాలని పోలీసులు ప్రణాళికలు రచించారు.

# నోరి ఆసుపత్రిలో శిశువు మృతి బంధువుల దాడి

విజయవాడ

నోరి ఆసుపత్రి లో 18 నెలల శిశువును చిట్టినగర్ కు చెందిన దంపతులు గతవారం నిమోనియా వ్యాధితో బాధపడుతుందని సత్యనారాయణపురంలో గల నోరి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో రోజుకి లక్ష రూపాయలు చొప్పున రోగి వద్దనుండి వసూలు చేశారని మీ బేబీకి ఏమి పర్వాలేదు అని హామీ ఇస్తూ వచ్చారని ఆరోపించారు. తరువాత శిశువు మృతి చెందింది. ఇప్పటివరకు దాదాపు 18 లక్షలు వసూలు చేశారు తీరా మీ బేబీ చనిపోయింది తీసుకుపోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే శిశువు చనిపోయిందని తల్లిదండ్రుల రోదిస్తున్నారు. తమకు జరిగిన అన్యాయంకి న్యాయం జరగకపోతే ఉపేక్షించేది లేదని బంధువులు ఆసుపత్రి వద్ద బై ఠాయించారు ఈ నేపధ్యంలో ఆసుపత్రి సిబ్బంది గానీ కనీసం ఎవరికి సమాధానం చెప్పకపోవడంతో బంధువులు ఆసుపత్రిపై దాడి చేశారు..

# ఆర్టీసీ బస్సుకు అగ్నిప్రమాదం

హైదరాబాద్:ఆగస్టు 26

ఆర్టీసీ బస్సులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం మెహదీపట్నం బస్టాండ్ లో ఆగి వున్న బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే ప్రమాద సమయంలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతోద్ద ప్రమాదం తప్పింది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మంగళవారం ఉదయం బస్ స్టాప్ వద్దకు రాగానే బస్సు స్టార్ట్ కాకపోవడంతో డ్రైవరు బస్సును పక్కకు నిలిపాడు. మరమ్మత్తులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవరు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని టలను అదుపు చేశారు.. ఇంజన్ లో షార్ట్ సర్క్యూట్ కారణమని అనుమానిస్తున్నారు.

# సాధియా అల్మాస్ కు మంత్రి లోకేష్ అభినందనలు

అమరావతికోస్టారికోలో ఐపీఎఫ్ వరల్డ్ క్లాసిక్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కిలోల మహిళా జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించిన మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్ కు మంత్రి లోకేష్ అభినందించారు.. తన ప్రతిభతో అంతర్జాతీయ వేదికపై భారతదేశ జెండాను రెపరెపలాడించారు. కాంస్య పతకం సాధించి దేశంతో పాటు మన మంగళగిరికి గర్వకారణంగా నిలిచారు. ఆమె అంకితభావం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

# బై పోల్ మూడ్ లోకి గులాబీ దళం

హైదరాబాద్, ఆగస్టు 26, (

బీఆర్ఎస్ బై పోల్ మూడ్‌లోకి వచ్చేసిందా? అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టిందా? ఎప్పుడు సైరన్ మోగినా మేము సై అంటూ సిద్ధమైపోతోందా? అసలిప్పుడు ఎందుకు హడావిడి చేస్తోంది కారు పార్టీ? ఏ ఉప ఎన్నికల కోసం సిద్ధమవుతోంది. జూబ్లీహిల్స్ తప్ప మిగతా చోట్ల ఇప్పటికిప్పుడు ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందా? గులాబీ లెక్కలేంటి? 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీ ఫామ్ మీద గెలిచి? తర్వాత కాంగ్రెస్‌లోకి జంప్ అయిపోయారు పది మంది ఎమ్మెల్యేలు. వాళ్ళ మీద అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీ స్పీకర్‌ని కోరింది బీఆర్ఎస్. ఆ పోరాటంలో భాగంగా సుప్రీం కోర్ట్ దాకా వెళ్ళింది. తాజాగా వచ్చిన తీర్పు తమకు అనుకూలంగా ఉన్నట్టు భావిస్తున్నారు గులాబీ నేతలు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సంగతిని మూడు నెలల్లోగా తేల్చమని స్పీకర్‌కు సూచించింది సుప్రీమ్ కోర్ట్. అందులో భాగంగా కొందరు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్స్. మరి కొంత మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా త్వరలో నోటీసులు అందుకోబోతున్నారంటూ ప్రచారం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే? వాళ్ళ మీద ఖచ్చితంగా అనర్హత పడుతుందని కారు పార్టీ గట్టిగా నమ్ముతున్నట్టుందని అంటున్నారు పరిశీలకులు. నిజంగానే అనర్హత వేటు పడితే.. ఆ పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయం. అవి కూడా ఎంతో దూరంలో లేవని, జూబ్లీహిల్స్ బై పోల్‌తో పాటే జరుగుతాయని నమ్ముతోందట కారు పార్టీ అధిష్టానం. అందుకే ఆయా నియోజకవర్గాల మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టబోతున్నట్టు సమాచారం.పార్టీ మారిపోయిన ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయ నేతల్ని సిద్ధం చేసే కార్యక్రమం మొదలైపోయిందట. అందులో భాగంగానే? గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలైనట్టు తెలిసింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి వీచినా?. ఆయా నియోజకవర్గాల్లో తమ పార్టీ గెలిచింది కాబట్టి?.ఇప్పుడు ఉప ఎన్నికలంటూ జరిగితే? తిరిగి దతమ ఖాతాలోనే పడిపోతాయన్నది బీఆర్ఎస్ పెద్దల



నమ్మకం అట. ఈసారి టిక్కెట్స్‌ను అధిష్టానానికి దగ్గరగా ఉన్న వాళ్లకి, గెలిచాక కూడా పక్క చూపులు చూడని వాళ్ళకు ఇవ్వాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. పది నియోజకవర్గాల్లో అలాంటి వాళ్ళు ఎవరున్నారని వెదుకుతున్నారట. శేరిలింగంపల్లిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పటాన్‌చెరులో ఆదర్శ్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్‌లో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, ఖైరతాబాద్ నుంచి మన్నే గోవర్దన్ రెడ్డి, రాజేంద్రనగర్‌లో సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి, జగిత్యాలలోఎమ్మెల్సీ ఎల్ రమణ, బాన్సువాడ నుంచి ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, గద్వాలలో హనుమంతు నాయుడు లేదా కాంగ్రెలో ఉన్న వారిని లాక్కునే అవకాశం ఉందని అంటున్నారు.ఇక భద్రాచలంలో రేగా కాంతారావుకు, చేవెళ్ల నుంచి కొత్త వారికి టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇక వీళ్ళు మాత్రమే కాకుండా? ఉప ఎన్నికలంటూ జరిగితే ఆ టైంకి కాంగ్రెస్ నుంచి గానీ లేకుంటే వేరే పార్టీల నుంచి బలమైన నాయకులు ఎవరైనా ఆసక్తిగా ఉంటే వాళ్ళనుగాని చేర్చుకుని గెలిపించుకునేలా ప్లాన్ చేస్తోందట బీఆర్ఎస్ అధిష్టానం. వాళ్ళు ఊహిస్తున్నట్టుగా?ఒకవేళ ఈ 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరిగితే మాత్రం? ఆ ఫైట్ అసెంబ్లీ సాధారణ ఎన్నికల్ని మించి పోతుంది. అందుకే ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెడుతున్నారట. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుంటూ? అక్కడ ఇన్చార్జ్‌లను నియమిస్తూ? క్యాడర్ ను ఉత్తేజపరచాలని చూస్తున్నారట. ఒకవేళ స్పీకర్ నిర్ణయం తీసుకొని వాళ్లపై అనర్హత వేటు వేస్తే? ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి. ముందుగానే అలర్ట్ అవుతోందట గులాబీ పార్టీ. ఈ ముందస్తు ఏర్పాట్లు సఫలం అవుతాయో లేదో చూడాలి మరి.

# బీజేపీ కమిటీలు ఎప్పుడూ..

హైదరాబాద్, ఆగస్టు 26,

తెలంగాణ బీజేపీ కమిటీ వేసేదెన్నడు? కొత్త అధ్యక్షుడు వచ్చాక వారంలో వేస్తామని ప్రకటించి నెల గడుస్తున్నా? దిక్కూ దివాణం లేకుండా పోయింది ఎందుకు? అధ్యక్షుడు ఎందుకు నిస్సహాయంగా ఉండిపోతున్నారు? తెర వెనక జరుగుతున్న తతంగం ఏంటి? అసలది ఇప్పట్లో తేలే వ్యవహారమా? లెట్స్ వాచ్. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుల ఎన్నిక ఒకే రోజు జరిగింది. ఏపీలో రాష్ట్ర కమిటీని వెంటనే ప్రకటించేశారు పార్టీ ఆ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. కానీ? తెలంగాణలో మాత్రం ఇంతవరకు అతీగతీ లేదు. అసలు ఎప్పుడు ప్రకటిస్తారో కూడా క్లారిటీ రాలేదు. పార్టీలో ఏ ఇద్దరు నాయకులు కలిసినా?. ఇప్పుడు దాని గురించే మాట్లాడుకుంటున్నారు. ఎవరెవరికి ఛాన్స్ ఉండవచ్చన్న చర్చోపచర్చలు నడుస్తున్నాయి. కానీ? ఎక్కడా వీసమెత్తు స్పష్టత రాలేదు. పైగా ఒక అడుగు ముందుకు, పది అడుగులు వెనక్కి అన్నట్టు నడుస్తోందట వ్యవహారం. రాష్ట్ర అధ్యక్షుడయ్యాక రామచంద్రరావు ఇప్పటికే ఒకసారి కమిటీపై చర్చించేందుకు ఢిల్లీ వెళ్ళి వచ్చారు. హైదరాబాద్‌లో సంఘ్ పెద్దలలో సమావేశం అయ్యారు. అయినా కమిటీ కూర్పుపై క్లారిటీ రానట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడం, వాళ్ళంతా ఏదో ఒక విధంగా ఒత్తిడి తీసుకు వస్తుండడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారట అధ్యక్షుడు. ఆశావహులంతా తగ్గకుండా ఎవరికి వారు తమ గాడ్‌ఫాదర్స్‌ని సీన్‌లోకి దించుతుండటం కూడా సంక్లిష్టతకు కారణం అంటున్నారు. మరోవైపు గత కమిటీలో పని చేసిన వాళ్ళలో ఎవరికి అవకాశం ఇవ్వాలి, ఎవరిని పక్కన పెట్టాలన్న గందరగోళం కూడా ఉందంటున్నారు.అదే సమయంలో రకరకాల ఈక్వేషన్స్ తెర మీదికి వస్తున్నాయి. పదేళ్ళుగా రాష్ట్ర కమిటీలో ఉన్న వారికి ఈ సారి అవకాశం ఇవ్వొద్దని, యువతకి ప్రాధాన్యం ఇవ్వాలని, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారికి ఛాన్స్ ఇవ్వకూడదని, కొత్త రక్తాన్ని ఎక్కించాలని? ఒకటి కాదు, రెండు కాదు? ఇలాంటివి రకరకలా వాదనల్ని వినిపిస్తున్నారు పార్టీ నాయకులు. దీంతో అసలేం నిర్ణయం తీసుకోవాలో కూడా అర్థంకాని గందరగోళంలో ఉన్నారట ఢిల్లీ పెద్దలు. కొందరు నేతలు తాము సూచించిన వారికే కమిటీలో స్థానం ఇవ్వాలని గట్టిగా పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. తమవాళ్ళ కోసం పట్టుబట్టే నాయకులు కొందరైతే? ఫలానా వాళ్ళకు ఇవ్వవద్దంటూ మోకాలడ్డుతున్న బ్యాచ్ కూడా ఒకటి తయారైందట. పైగా మేం వద్దన్న వాళ్ళకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సీన్ క్రియేట్ చేస్తున్నట్టు సమాచారం. ఇంకొందరైతే? కొత్త కమిటీ వేసేటప్పుడు మా అభిప్రాయం తీసుకోరా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. ఇలాంటివన్నీ కలిపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు తలనొప్పిగా మారాయట.ఇదెక్కడి లొల్లిరా? నాయనా అని ఆయన తల పట్టుకుంటున్నట్టు సమాచారం. వస్తున్న డిమాండ్స్, సమీకరణల్ని పరిగణనలోకి తీసుకుంటే? వీళ్ళందరినీ ఒప్పించి సమన్వయం చేయడం అంత తేలికైన వ్యవహారం కాదని చెప్పుకుంటున్నారు పార్టీ నాయకులు. ఈ క్రమంలో ఇది ఇప్పటికిప్పుడు తేలే వ్యవహారం కాదని, వినాయక నవరాత్రుల తర్వాతే కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అంటున్నాయి బీజేపీ వర్గాలు. పదవులు తక్కువగా ఉండడం, ఆశావహులు భారీగా పెరిగిపోవడంతో?ఇది అంత తొందరగా తేలే మేటర్ కాదంటున్నారు. పార్టీలో పెద్ద తలకాయలు పెరిగిపోవడం కూడా ఈ తాత్సారానికి మరో కారణమని తెలుస్తోంది. మొత్తం మీద ఎట్నుంచి ఎటు చూసినా? రకరకాల సంక్లిష్టతల మధ్య తెలంగాణ బీజేపీ కమిటీ ఎప్పటికి తేలుతుందో అర్థంకాని వాతావరణం ఉంది.

# అడ్డూ, అదుపులేని అక్రమాలు

మెదక్, ఆగస్టు 26,

మాకు అధికారుల అండదండ లున్నాయి.. మేం ఏదనుకుంటే అది చేయగలం.. ఏ భూమిని కబ్జా చేయలన్నా చేస్తాం.. ఎక్కడ ఏ నిర్మాణం చేపట్టాలన్నా చేపడతాం.. రహదారులు అడ్డొచ్చినా, గ్రామస్తులకు అభ్యంతరాలున్నా లెక్కలేదు.. మాకు ఎవరి అనుమతులు అవస రం లేదు..' అన్నట్లు అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ వైఖరి ఉందని సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపలి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో రేడియల్ రోడ్డు నంబర్-7కి ఇరువైపులా సంస్థ 2.5 కి.మీ పొడవు, 15 అడుగుల ఎత్తున కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నదని, రెవెన్యూశాఖ, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖల కనుసన్నల్లోనే ఈ నిర్మాణం జరుగుతున్నదని చెప్తున్నారు. ఈ విషయంలో గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, పైగా బడా సంస్థకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామస్తులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై స్పందించిన న్యాయస్థానం సంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు, ఆర్డీవోలు, రామచంద్రాపురం తహసీల్దార్, ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులకు నోటీసులు జారీచేసింది. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న కాం పౌండ్ వాల్‌పై స్థానికులు తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అక్రమంగా రేడియల్ రోడ్డు నంబర్- 7కి ఇరువైపులా దాదాపు 2 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నదని చెప్తున్నారు. కొల్లూర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి కొండకల్ వైపునకు వెళ్లే ఈ రేడియల్ మార్గంలోనే ఈ గ్రామం ఉంది. గ్రామ శివారులోని రైల్వేస్టేషన్ నుంచి 2 కిలోమీటర్ల మేర వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.అది కూడా అవతలేం జరుగుతుందో చూడలేనంత ఎత్తులో వాల్ నిర్మించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీస సమాచారం కూడా, వాల్ నిర్మించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాల్‌ను ఎవరు నిర్మిస్తున్నారో? ఎందుకు నిర్మిస్తున్నారో.. ? తెలియడం లేదని, అధికారులను ఈ విషయంలో ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని వాపోతున్నారు.కాంపౌండ్ వాల్ విషయమై రామచంద్రాపురం రెవెన్యూ అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఓసారి రైల్వేశాఖ వాల్ నిర్మిస్తోందని, మరోసారి ఆర్అండ్‌బీ నిర్మిస్తున్నారని.. పూటకో మాట చెప్తున్నారని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. రేడియల్ రోడ్డుకు రెండువైపులా ప్రభుత్వ స్థలం ఉండగా, కొంత రైల్వే ఆధీనంలో ఉన్న భూమి కూడా ఉంది. కాగా నాగులపల్లి, కొండకల్ శివారులో అపర్ణ సంస్థ వందల ఎకరాలు సేకరించగా పొజిషన్ విషయంలో అనేక సమ స్యలు తలెత్తాయి. దీంతో సంస్థ భారీ కాంపౌం డ్ వాల్ నిర్మాణానికి పూనుకున్నదని తెలుస్తున్నది. అక్రమంగా వాల్ నిర్మిస్తున్నా యంత్రాం గం చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నదని గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ విషయంలో గ్రామస్తులు తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేశారు. అయినా, రెవెన్యూశాఖ ఎలాంటి స్పందన లేదని వాపోతున్నారు. వాల్ నిర్మాణం ఇప్పటికే పూర్తి కావొచ్చిందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలోనూ గోడల నిర్మాణం జరుగుతున్నదని, అపర్ణ సంస్థ పేరును కూడా ప్రస్తావించి గ్రామస్తులు ఫిర్యాదు చేయడం గమనార్హం. అక్రమ వాల్ నిర్మాణంపై కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, అయినా స్పందన లేదని చెప్తున్నారు. గ్రామంలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్‌పై గ్రామస్తులు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. ఎక్కడికి వెళ్లినా, వారికి న్యాయం జరగకపోవడంతో ఇటీవల వారు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

# యాప్ లో అప్ లోడ్ చేస్తే రూ. 8100

అదిలాబాద్, ఆగస్టు 26,

ఈ ఏడాది మీరు పత్తి సాగు చేస్తున్నారా..? అయితే మీరు ఈ విషయం తెలుసుకోవాల్సిందే. రైతులందరూ మద్దతు ధర అందుకునేందుకు? కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా? కపాస్ కిసాన్ అనే యాప్ తీసుకొచ్చింది. పత్తి వేసిన రైతులు.. వారు పేర్లను సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా ఎంట్రీ చేసుకున్న వారు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకోవచ్చు. ఈ మేరకు మార్కెటింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి.ఈ యాప్ గురించి సమాచారం? దీన్ని మీరు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీకు తెలియకపోతే మీ పిల్లలను అడిగే చెబుతారు లేదా అధికారులను అయినా సంప్రదించచ్చు. ఆ తర్వాత యాప్‌లో ఆధార్ కార్డు, మీ భూమి రికార్డులు, పత్తి పంటకు సంబంధించి రెవిన్యూ శాఖ వారి ఇచ్చిన రికార్డును అప్‌లోడ్ చేయాలి. ఇలా చేయడం ద్వారా.. దేశవ్యాప్తంగా పత్తి రైతులు ఎందరున్నారు..? పత్తి పంట విస్తీర్ణం ఎంత అనే వివరాలు అన్నీ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వద్ద రికార్డ్ అవుతాయి. మీకు మద్దతు ధర అందాలంటే.. వచ్చే నెలా ఆఖరులోపు యావ్‌లో రికార్డు చేయడం మార్చిపోవద్దు.ఈ ఏడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కపాస్? కిసాన్? యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు.. పత్తిని అమ్మే సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. అప్పుడు ఏ రోజు మీరు పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లాలో యాప్ వివరాలు పంపుతుంది. ఈ పద్దతి వల్ల రైతులకు నీరీక్షణ సమస్యలు ఉండవు. స్లాట్ బుక్ చేసుకుంటేనే సౌలభ్యాన్ని పొందవచ్చు.సెప్టెంబర్ మొదటి వారం నుంచి నుంచి పత్తి పంట చేతికొస్తుంది. అయితే ఇటీవల కాలంలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో.. దిగుబడి పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

# లోకల్ బాడీలో అయిన గులాబీ గుబాళించేనా

వరంగల్, ఆగస్టు 26

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంత మేరకు విజయం సాధిస్తుందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాలలో హట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తుంది. ఈ రెండేళ్ల పాలనపై కాంగ్రెస్ పనితీరుపై ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారన్న విషయం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు ఒక అడ్వాంటేజీ ఉంది. అదేమంటే అధికారంలో ఉండటంతో బలం, బలగానికి సంబంధించి మాత్రమే కాకుండా అన్ని విషయాల్లో అది ముందుకు వెళ్లే అవకాశముంది. కానీ బీఆర్ఎస్ విషయంలో అలా చూడలేం. గత రెండేళ్లుగా బీఆర్ఎస్ ప్రతిపక్షంగా పెద్దగా సక్సెస్ ఫుల్ గా పనిచేయలేదన్న విమర్శలు బాగా వినిపిస్తున్నాయి... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల్లో ఓటమి పాలయిన నాటి నుంచి ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఆయన అప్పుడప్పుడు జనంలోకి వచ్చినా అది పార్లమెంటు ఎన్నికల సందర్భంగానే. ఇక గులాబీ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిగి కొన్నినెలలు గడిచాయి. వరంగల్ లో జరిగిన భారీ బహిరంగ సభలో ఇకపై జనంలోనే ఉంటానని కేసీఆర్ చెప్పారు. ఏప్రిల్ లో జరిగిన ఈ బహిరంగ సభ తర్వాత కేసీఆర్ జనంలోకి వచ్చింది లేదు. ఎక్కడా కార్యక్రమాల్లో పాల్గొనింది లేదు. ఆయన చెప్పిన మాట మీద నిలబడడు అనడానికి ఇది ఉదాహరణ అని పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. సిల్వర్ జూబ్లీ సభ జరిగిన తర్వాత ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ అధినేత గళం విప్పకపోవడాన్నికూడా కొందరు తప్పుపడుతున్నారు. . ఇక అదేసమయంలో బీఆర్ఎస్ లోనూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితల మధ్య ఆధిపత్య పోరు కూడా ప్రజల్లో పార్టీని పలుచన చేసింది. పార్టీ క్యాడర్ లోనూ అయోమయం నెలకొంది. ఎవరు అవునన్నా, కాదన్నా పార్టీలో రెండు గ్రూపులు అయితే ఉన్నాయన్నది కవిత రాస్తున్న లేఖల ద్వారా బయటపడుతుండటంతో నవ్వులపాలయింది కారు పార్టీ. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాన్ని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలనుకున్నా ముందు ఫ్యామిలీ సర్కస్ మాటేమిటని ప్రత్యర్థులు ప్రశ్నించే అవకాశముంది. అలాగే ఇప్పుడు రెండు గ్రూపులు కారు పార్టీలో బహిరంగంగా సవాళు విసురుకుంటుండటంతో క్యాడర్ లో కూడా నిరుత్సాహం నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కారు ఎలా ముందుకు వెళుతుందన్నది చూడాల్సి ఉంది. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ వెళ్లినా ఫలితం ఎంత మేరకు కనిపిస్తుందన్నది ఆ పార్టీ నేతలకు మింగుడపడటం లేదు.

చిన్ననాటి నుంచి చికితలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి గారు అభినందనలు తెలియజేశారు.

# విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి

మంథని మండలంలోని బట్టుపల్లి గ్రామానికి చెందిన రైతు గడ్డి లింగయ్య కు సంబంధించిన ఎద్దు విద్యుత్ షాక్ తో మృతి చెందింది. రైతు కథనం ప్రకారం...రోజు మాదిరిగానే ఎద్దు మేతకు వెళ్ళగా గ్రామ శివారులో ఉన్న ట్రాన్స్ఫారం కు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఎద్దు అక్కడి కక్కడే మృతి చెందింది. ప్రభుత్వ పరంగా సాయం అందించాలని బాధితుడు, గ్రామస్తులు కొరుతున్నారు.ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని వారు తెలిపారు.

## లారీని ఢీకొన్న కారు? ఒకరు మృతి? ముగ్గురికి గాయాలు

చిత్తూరు బెంగళూరు చిత్తూరు ప్రధాన రహదారిలోని మొగిలి ఘాట్ రోడ్లో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగళూరు వైపు నుండి చిత్తూరు వైపు వస్తున్న లారీని వెనుక వైపు నుండి కారు ఢీకొంది. ఓ వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరో ముగ్గురి కి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. పలమనేరు పోలీసులు ప్రమాద ఘటనపై విచారిస్తున్నారు.

## ఈ నెల 30 న సంచార జాతుల సదస్సు

అమలాపురం దేశంలో మను ధర్మం, సంస్కృతి బ్రతికి ఉందంటే సంచార జాతులు కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు.

ఆగస్టు 30వ తేదీన 'స్ఫూర్తి' పేరుతో విజయవాడలో సంచార జాతుల సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు మాధవ్ తెలిపారు. మొదటి స్వతంత్ర సంగ్రామంలో వీరి పాత్ర ఎనలేనిదని మాధవ్ కొనియాడారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సారథ్యం' సమావేశానికి ముఖ్య అతిథిగా మాధవ్ హాజరై ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ప్రపంచ దేశాల్లో భారత దేశ పేరు ప్రఖ్యాతలు మారుమ్రోగుతున్నాయన్నారు. మోడీ సారథ్యంలో దేశం అన్ని రంగాలలో ముందుకు దూసుకెళుతోందని మాధవ్ పేర్కొన్నారు. అంతకు ముందు అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుండి కాపు కళ్యాణ మండపం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెపి జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ప్రొఫెషనల్ సభ్యుల చే మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కాకినాడ స్థానిక గంగరాజు నగర్ లో లయన్ రవికుమార్ గృహం వద్ద లయన్స్ కాకినాడ ప్రొఫెషనల్ సభ్యుల చే సుమారు ఐదు వందల మట్టి వినాయక విగ్రహాల ను ప్రజలకు అందజేశారు. మోహన్ విద్యాసంస్థల అధినేత లయన్ మోహన్ రావు మాట్లాడుతూ" మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణానికి చాలా మంచివని, ఎందుకంటే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ఖూఖ) విగ్రహాల వల్ల పర్యావరణం మరియు నీటి వనరులు కలుషితమవుతాయని, ఖూఖ విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయి కాబట్టి, మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ రూరల్ అధ్యక్షుడు కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ"గత తొమ్మిదేళ్ల గా లయన్ రవికుమార్ ప్రతీ వినాయక చవితి కీ ప్రజలందరికీ ఈ మట్టి వినాయక విగ్రహాల ను అందచేయడం ఆయన కు ప్రకృతి పట్ల ఉన్న నిబద్ధత కు అభినందనలని అన్నారు. వినాయక విగ్రహాలు మట్టివి లేదా ప్లాంట్ బేస్డ్? విగ్రహాలు తెచ్చుకుంటే మంచిదని , ప్లాస్టర్? ఆఫ్? పారిస్ నీటిలో కరగదని. కానీ మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోతాయని పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని,అలాగే ప్లాంట్ బేస్డ్ విగ్రహాల్లో విత్తనాలు ఉంటాయి కాబట్టి అవి నీటిలో కరిగకా మొక్కగా పెరిగి పర్యావరణానికి మేలు చేస్తాయని తెలిపారు. ప్లాస్టిక్ డెకరేషన్?కి బదులుగా అరటిఆకులు, పువ్వులతో అందంగా అలంకరణ చేయవచ్చని. పూలతో గుమ్మాలను అలంకరించుకుని, తిరిగి వినియోగించుకోగలిగే క్లాత్ డెకరేషన్ ఐటమ్స్ వాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం లో నిమ్మకాయల వెంకటేశ్వర రావు బి వి ఎన్ రెడ్డి ద్వారంపూడి విపుల్ లయన్స్ సభ్యులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అడ్డగోలుగా వసూళ్లు.. ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులు

హైదరాబాద్, ఆగస్టు 26,

రాష్ట్రంలో ఇంజినీరిం గ్ సహా ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాలు ఉత్తుత్తి కొలమానాలను తలపిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన సవరణ నిబంధనలను పక్కనబెట్టి తూతూమంత్రం గా ఫీజులను నిర్ధారిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఫీజుల నిర్ధారణ కోసం సోమవారం నుంచి ప్రారంభమైన కాలేజీల పునర్విచారణ నామ్‌కేవాస్తేగా సాగుతుంది. ప్రభుత్వం సవరించిన నిబంధనల ప్రకారం కాలేజీల్లో ఏమున్నాయి? ఏం లేవో? తేల్చి ఫీజులను ఖరారు చేయకుండా కాలేజీలు ఇచ్చిన నివేదికలనే బేస్ చేసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులపై తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) పునర్విచారణ నుంచి ప్రారంభమైంది. మొత్తం 160 ఇంజినీరింగ్ కాలేజీల ను సెప్టెంబర్ 3 వరకు పునర్విచారణ చేయనున్నారు. అయితే తొలిరోజై 20 కాలేజీలను పిలువగా, అందులో 17 కాలేజీలను టీఏఎఫ్ఆర్సీ అధికారులు విచారించినట్టు తెలిసింది. మరో మూడు కాలేజీలు గైర్హాజరయ్యాయి. విచారణకు పిలిచిన కాలేజీల ఫీజులపై ఎలాంటి విచారణ జరగలేదని పలు కాలేజీల యా జమాన్యాలు తెలిపాయి. అయితే ఆయా కా లేజీల నుంచి టీఏఎఫ్ఆర్సీ అధికారులు గతంలో సమర్పించిన ఆడిటింగ్ నివేదికలు అసలైనవేనని అఫిడవిట్లు తీసుకొని పంపించేశారు. ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు ప్రభుత్వం జారీచేసిన నిబంధనలు పక్కకేనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ మార్గదర్శకాలు ఇప్పుడు వర్తించవని, వచ్చే బ్లాక్ (మూడేళ్లు) పీరియడ్‌కు వర్తిస్తాయని ఓ కీలక అధికారి పేర్కొన్నారు. మళ్లీ కోర్టు తీర్పు ఆధారంగా నడుచుకుంటామని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. దీంతో కాలేజీల యాజమాన్యాల్లో గందరగోళం తలెత్తనున్నది. అయితే ఇంత కసరత్తు చేసి ఏం ప్రయోజనమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఫీజుల పెంపుపై సర్కారు ఇటీవలే కీలక ఆదేశాలిస్తూ జీవో నంబర్ -33ను జారీచేసింది. కళాశాలలు సమర్పించే అకౌంట్లతో పాటు, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ, కాలేజీ ర్యాంకింగ్, విద్యాప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ఫీజులను నిర్ధారించాలన్నది. కానీ అవేమీ పట్టించుకోకుండా కేవలం కాలేజీల నుంచి అఫిడవిట్లను మాత్రమే తీసుకుంటున్నారు. విద్యార్థుల హాజరు, అకడమిక్ పనితీరు, ఫేషియల్ రికగ్నిషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు, రీసెర్చ్, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, రీసెర్చ్ ఆర్టికళ్ల ప్రచురణ, అవార్డులు, ప్లేస్మెంట్స్, జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్ పరిశీలించిన తర్వాతే ఫీజులను నిర్ధారించాలన్నది. అకౌంట్స్, ఆడిటింగ్ నివేదికలు సరైనవేనని అఫిడవిట్ సమర్పించాలంది. తప్పులు లెక్కలు, సమర్పించిన కాలేజీలపై చట్టపరంగా చర్యలు తప్పవని జీవోలో హెచ్చరించింది. అయితే సోమవారం కాలేజీల నుంచి కేవలం అఫిడవిట్లు మాత్రమే తీసుకున్నట్టు తెలిసింది.

# హైదరాబాద్ లో మైక్రోసాఫ్ట్ ఆఫీసు

హైదరాబాద్, ఆగస్టు 26,

హైదరాబాద్ టెక్ పరిశ్రమలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇండియా ఆర్ అండ్‌విభాగం గచ్చిబౌలిలో భారీ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఫినిక్స్ సంటారస్‌లోని 2.65 లక్షల చదరపు అడుగుల భారీ ఆఫీస్ స్థలాన్ని తీసుకుంది. ఈ స్థలం కోసం మైక్రోసాఫ్ట్ సంస్థ నెలకు 5.4 కోట్ల రూపాయల అద్దె చెల్లించనుంది. ఇది ఈ ఏడాదిలో హైదరాబాద్‌లో జరిగిన అతి పెద్ద ఆఫీస్ లీజు ఒప్పందాల్లో ఒకటిగా విశ్లేషకులు చెబుతున్నారు. మైక్రోసాఫ్ట్? సంస్థ ఐదు సంవత్సాల లీజు ఒప్పందాన్ని టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ అనే మేనేజ్డ్ వర్క్‌స్పేస్ ఆపరేటర్‌తో కుదుర్చుకుంది. లీజు 2025 జులై నుంచి ప్రారంభమైంది. ఈ ఆఫీస్ ఫీనిక్స్ సెంటారస్ భవనంలో మూడో, నాల్గో అంతస్తులో విస్తరించి ఉంది.

ప్రాథమిక అద్దె- చదరపు అడుగుకు 67రూపాయలు చొప్పున నెలకు 1.77 కోట్లు

మొత్తం నెల అద్దె- 5.4 కోట్లు(చదరపు అడుగుకు రూ. 204)

వార్షిక పెరుగుదల-4.8 శాతం

సెక్యూరిటీ డిపాజిట్-42.15కోట్ల రూపాయలు

స్టాంప్ డ్యూటీ అండ్ రిజిస్ట్రేషన్ - రూ. 92.94 లక్షలు

మొత్తం అద్దెలో కామన్ ఏరియా మెంటెనెన్స్, ఆపరేటింగ్ ఎక్స్‌పెన్సెస్,క్యాపిటల్ ఎక్స్‌పెండించర్ మేనేజ్మెంట్ ఫీ కూడా ఉంటుంది.

ఫీనిక్స్ సెంటారస్ వివరాలు

ఫీనిక్స్ సెంటారస్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ఉంది. స్టేట్ ఆఫ్ ధి ఆర్ట్ ఎస్ఈజెడ్ క్యాంపస్ ఇది. ఫీనిక్స్ గ్రూప్ అభివృద్ధి చేసిన ఈ టెక్ పార్క్ 21లక్షల చదరపు అడుగుల మొత్తం విస్తీర్ణంతో 17 అంతస్తుల భవనంగా నిర్మించారు.

భవనంలో సౌకర్యాల సంగతి ఏంటీ?

ప్రతి అంతస్తు 55,000 నుంచి 69,000 చదరపు అడుగుల విస్తీర్ణ

ఫుడ్ కోర్టు, బిజినెస్ సెంటర్ రిటైల్ స్పేస్

క్రేచ్, జిమ్, సెలూన్ సౌకర్యాలు ఉన్నాయి.

లేటెస్ట్ సెక్యూరిటీ ఫెసిలిటీస్ ఉన్నాయి.

ఇప్పటికే ఇక్కడ జిఈ టెక్నాలజీ సెంటర్ ఇండియా ఉంది. ఇన్‌స్పైడర్ బ్రాండ్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ ఉంది.

మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ చరిత్ర

మైక్రోసాఫ్ట్ కు హైదరాబాద్‌తో సుదీర్ఘకాల అనుబంధం ఉంది. కంపెనీ 1998లో ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 25 ఏళ్ల పాటు ఈ నగరంతో పాటు వృద్ధి చెందుతూ వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్ మైక్రోసాఫ్ట్‌కు అమెరికా వెలుపల అతి పెద్ద ఖీడఆ కేంద్రంగా మారింది.

గచ్చిబౌలి క్యాంపస్ వరాలు

మొత్తం 20వేల మందికి మించి ఉద్యోగులు పని చేయబోతున్నారు.

ంఎ, క్లౌడ్ ఇన్నోవేషన్, ఇంజినీరింగ్ విభాగాలు ఇక్కడ పని చేస్తాయి.

2025 ఫిబ్రవరిలో కొత్తగా 1.1 మిలియన్ చదరపు అడుగుల అదనపు సౌకర్యం ప్రారంభించారు.

2500 మంది అదనపు ఉద్యోగుల కోసం సామర్థ్యం పెంచుతారు.

విస్తరణకు కారణాలు

భారత్‌లో ంఎ టెక్నాలజీ అభివృద్ధికి పెరుగుతున్న డిమాండ్ తోడ్పాటు అందించేందుకు

హైదరాబాద్‌లోని ప్రతిభ లభ్యత, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వాడుకోవడానికి.

ప్రభుత్వ మద్దతు, ఐటీ అనుకూల విధానాలు కూడా కలిసి వచ్చింది.

మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది

మైక్రోసాఫ్ట్ లీజు ఒప్పందం హైదరాబాద్ గ్రేడ్-ం ఆఫీస్ మార్కెట్‌కు గణనీయమైన ప్రోత్సాహం లభిస్తుంది. అంతే కాకుండా ఇలాంటి సంస్థ విస్తరణ పనులు చేపట్టండో హైదరాబాద్ గ్లోబల్ టెక్ హోదాను మరింత బలోపేతం చేసుకుంటుంది. భవిష్యత్ టెక్నాలజీ లీడర్‌గా నిలబెట్టే దిశగా ఇదో కీలక అడుగుగా భావించవచ్చు.

## హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ లో అరుదైన చికిత్స

ఖమ్మం

ఎలుకల మందు తీసుకున్న యువకుడికి హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోయశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ ఑ డయాబెటాలజిస్ట్ డాక్టర్ దిలీప్ కుమార్ సింగరాజు వివరాలు వెల్లడించారు. ఖమ్మం రూరల్ వెంకటాయపాలెం చెందిన 16 ఏళ్ల బాలుడు యలబత్తిని శ్రీ లక్షిత్ ఎలుకల మందు ( పసుపు భాస్వరం) విషాన్ని తీసుకున్నాడు . మొదట స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందాడు . అయితే కడుపు నొప్పి , వాంతులు , బలహీనమైన కాలేయ పనితీరు , కోగులోపతి , సెరిబ్రల్ ఎడెమాతో అతని పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు హైటెక్ సిటీ లో ఉన్న యశోద హాస్పిటల్ ను ఆశ్రయించారు . అధునాతన చికిత్స అవసరం అని తెలుసుకొని యశోద హాస్పిటల్స్‌లో ఉన్న ఇంటర్నల్ మెడిసిన్ , గ్యాస్ట్రో ఎంటరాలజీ , సైకియాట్రీ మరియు వాస్కులర్ సర్జరీలో నిపుణులతో సహా నిపుణుల బృందం పేషంట్ శ్రీ లక్షిత్‌ను ఐసియులో చేర్చారు . అతనికి క్రిటికల్ సపోర్టివ్ థెరపీ , యాంటీబయాటిక్స్ , హెపాటోప్రొటెక్టర్లు మరియు ఇంటెన్సివ్ మానిటరింగ్‌తో పాటు మూడు సెషన్ల హై-వాల్యూమ్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లెక్సీ) చేశారని పేర్కొన్నారు . ముఖ్యంగా పసుపు భాస్వరంతో ఎలుకల మందు చాలా ప్రమాదకరమైనది మరియు వెంటనే చికిత్స అందించకపోతే శరీరంలో బహుళ అవయవ వైఫల్యానికి దారితీస్తుందని అన్నారు . ప్లాస్మా మార్పిడి మరియు బహుళ విభాగ విధానం వంటి అధునాతన చికిత్సలు వెంటనే అందించడం యువ రోగి ప్రాణాలను కాపాడడంలో కీలకమైనవి . అతను బాగా కోలుకోవడం చూసి మేము సంతోషిస్తున్నాము అని అన్నారు . పూర్తి చికిత్స తర్వాత , అతని కాలేయ పనితీరు మరియు గడ్డకట్టే విధానం గణనీయంగా మెరుగుపడిందన్నారు 2025 జూలై 29న అతను డిశ్చార్జ్ చేసామని అతనికి మానసిక చికిత్సతో పాటు కొన్ని కన్సల్టేషన్ తీసుకోవాలని డాక్టర్లు సూచించారు . అటువంటి విషపూరిత పదార్థాలను ప్రమాదవశాత్తు లేదా ఉద్దేశపూర్వకంగా తీసుకోవడంపై సరైన అవగాహన మరియు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు . యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ క్రిటికల్ కేర్ మరియు అత్యవసర వైద్యంలో ముందంజలో ఉందని అత్యాధునిక

సౌకర్యాలు మరియు సంక్లిష్ట వైద్య అత్యవసర పరిస్థితులకు 24 గంటలూ సంరక్షణ అందించే అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులు ఉన్నారన్నారు .

## కూటమి ప్రభుత్వానికి దివ్యాంగులపై మానవత్వం లేదు

విజయవాడకూటమి ప్రభుత్వానికి దివ్యాంగులపై మానవత్వం లేదని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా అన్నారు. కనికరం లేకుండా వారి పొట్ట కొట్టాలని చూడటం దారుణం. వికలాంగుల జీవితాల్లో వెలుగులు పోయి చీకటి నింపడం సర్మార్గం. అనర్హుల కింద అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించాలని చూడటం అన్యాయం. అనర్హత పేరుతో 20 ఏళ్ల నుంచి పెన్షన్ పై బ్రతుకుతున్న వారికి సైతం రద్దు చేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. వికలాంగుల జీవితాలతో రాజకీయం తగదు. బోగస్ పెన్షన్లు గుర్తించడం మంచిదే. వికలాంగుల ముసుగులో అక్రమంగా పెన్షన్లు తీసుకుంటున్న అనర్హులను ఏరివేత హర్షించ దగ్గదే. దొంగ సర్టిఫికెట్లు తీసుకున్న వాళ్ళపై, ఇచ్చిన వైద్యులపై కఠిన చర్యలు ఉండాల్సిందే. కానీ రీ వెరిఫికేషన్ పేరిట అర్హులను సైతం అనర్హులుగా పరిగణించడం పద్ధతి కాదు. అర్హుల పేర్లు తొలగించి వారిని వేధించడం సరికాదు. నోటీసులు ఇచ్చిన 1.20 లక్షల మందిలో అర్హులే ఎక్కువ మంది ఉన్నారని తెలుస్తోంది. అనర్హులుగా గుర్తించిన జాబితాపై మళ్ళీ వెరిఫికేషన్ చేయండి.

# బైరాన్‌పల్లి నెత్తుటి గాథకు నేటితో 77ఏళ్లు

## -రజాకార్లపై తిరుగుబాటు అదో వీరపోరాటం
## -సాయుధ పోరులో 118 మంది వీరమరణం
## -చరిత్ర పుటల్లో స్థానం దొరకని రక్తాక్షరం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

సరిగ్గా 77 ఏళ్ల క్రితం...బైరాన్‌పల్లిలో నరమేధం... మట్టిమనుషుల తిరుగుబాటు.. దోపిడీపై దండయాత్ర.. నిజాం మూకలపై నిప్పుల యాత్ర.. అగ్ని జ్వాలలై రగిలిన నెత్తుటి మడుగు.. గడ్డి కోసిన చేతులే కొడవళ్లు పట్టాయి. బువ్వొండిన చేతులే తుపాకీలు పట్టాయి. దొరల దాష్టీకాలకు... రజాకార్ల రాక్షసత్వానికి వ్యతిరేకంగా పిడికిలెత్తాయి. గడీల పాలనను ప్రజలే తరిమికొట్టారు. సామాన్యులే సాయుధులై రణనినాదం చేశారు. రైతన్నలే నిప్పుకణికలై విప్లవ శంఖం పూరించారు. వీర యోధుల త్యాగాలకు నెత్తుటి సాక్ష్యమే బైరాన్ పల్లి. నాటి తరానికే కాదు... నేటి తరానికీ స్ఫూర్తినిస్తోంది.1948 ఆగస్టు 27న బైరాన్‌పల్లిలో నరమేధం జరిగింది. సాయుధ పోరులో 118 మంది వీరమరణం పొందారు. భారత చరిత్రలోనే మాయని మచ్చగా నిలిచినా... భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమైందిఅది 1948 ఆగస్టు 27ఆ రోజు బైరాన్‌పల్లిలో ఉన్మాదం తాండవించింది. గ్రామ స్వరాజ్యం కోసం 92 మంది ఒకే రోజు నిజాం సేనల చేతుల్లో బలయ్యారు.బైరాన్‌పల్లి పోరాటం కేవలం నిజాం వ్యతిరేక పోరాటమే కాదు.. చరిత్రలోకి తొంగిచూస్తే అది బ్రిటిష్ వ్యతిరేక పోరాటం.. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం.. నిజాం సేనలను తొలుత ఊరి పొలిమేరల్లోకి తరిమికొట్టిన సాహసం వారిది. గ్రామాలపై దాడులు చేసి ఊళ్లకు ఊళ్లే తగలబెట్టి వల్లకాడుగా మార్చారు రజాకార్లు. నిజాం రజాకార్ల అకృత్యాలకు ఎంతోమంది తమ మాన ప్రాణాలను కోల్పోయారు. వీరుల్ని నిరాయుధుల్ని చేసి ప్రాణాలు తీసిన పిరికిపందల చరిత్ర ఒక వైపు ఉంటే.. మరోవైపు త్యాగాల చరిత్ర.. వ్యక్తి స్వార్థం లేని ఒక సమూహ లక్ష్యం

లిగిన మహోన్నత చరిత్ర.. వరంగల్ జిల్లాలోని బైరాన్‌పల్లి నేడు వీర బైరాన్‌పల్లిగా మారింది. జనగామ డివిజన్ మద్దూర్ మండలంలోని గ్రామం బైరాన్‌పల్లి...ఏనాటికీ బైరాన్‌పల్లి పోరాట చరిత్ర మరువనిది. అనేకసార్లు నిజాం మూకలను తరిమికొట్టిన గ్రామం. వీరోచిత పోరాట కేంద్రం. నిజాం మూకల తూటాలకు, సైన్యం వికృత క్రీడకు బలిపశువయినా శౌర్యాన్ని చూపింది. తిరుగుబాటుకు నెలవుగా మారింది. పోరాటకాలంలో బైరాన్‌పల్లి ప్రజలు ప్రక్క గ్రామాల ప్రజలకు అండగా నిలిచారు. రజాకార్లకు ఎదురొడ్డి త్యాగాలు చేశారు. సాటి మనిషి పట్ల ఆ గ్రామం చూపిన తెగువ తెగిపోతున్న మానవ సంబంధాలకు ఆదర్శం. ఆపదొస్తే ఆదుకోవటం ఎంత బాధ్యతో

లింగాపూర్ ఘటన అద్దంలా కనబడుతున్నది. ఆంధ్రమహాసభ పేరుతో ప్రజల్లోకి వచ్చిన ఎర్రజెండా నింపిన చైతన్యం అలాంటిది. ఓ వైపు యావత్ భారతదేశం స్వాతంత్ర్య సంబురాల్లో మునిగితేలుతూ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతుండగా మరో వైపు నిజాం రాజుల ఏలుబడిలో ఉన్న పల్లెలన్నీ రజాకారు మూకల ఆగడాలు, దుశ్చర్యలతో వణికిపోతున్నాయి. రజాకార్లను ఎదురించి పోరాడలేక పల్లె ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. రజాకార్ల దురాగతాలను భరించలేక వారిపై తొలిసారిగా తిరుగుబాటు ప్రకటించి జంగ్‌సైరన్ చేసిన గ్రామమే.. వీరబైరాన్‌పల్లి. ఈ గ్రామానికి ఉన్న చారిత్రక నేపథ్యం మరే గ్రామానికి లేదనడంలో సందేహం లేదు. బైరాన్‌పల్లి.. ఈ ఊరు పేరు వింటేనే రజాకార్లు హడలిపోతారు. గ్రామంలో అడుగుపెట్టేందుకు నిజాం సైన్యాలు వణికిపోతాయి. పిల్లల నుంచి పడుచు యువతుల దాకా..అంతా ఒక్కటై హైదరాబాద్ సంస్థానాన్ని సవాల్ చేస్తున్న కాలమది. నిజాం చీకటిపాలన నుంచి బయటపడి భారత యూనియన్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛాగాలులు పీల్చాలని ప్రతి గుండె, ప్రతి గ్రామం తహతహలాడుతున్న సందర్భమది. వరంగల్ జిల్లా బైరాన్‌పల్లి (నాటి నల్లగొండ జిల్లా) ఈ ఆకాంక్షలకు నిలువెత్తు ఆకృతిగా నిలిచింది. ఫలితం..గ్రామరక్షణ దళం ఏర్పాటుబైరాన్‌పల్లిలో ఇమ్మడి రాజిరెడ్డి, దుబ్బూరి రామిరెడ్డి, మోటం రామయ్యలాంటి యువకులు గ్రామరక్షణ దళాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి పన్నులు కట్టడం మానేశారు. దొరలపై ధిక్కార స్వరం వినిపించి గ్రామమంతా ఒకేతాటిపై నిలిచేలా చేశారు. తమ పొరుగు గ్రామమైన లింగాపూర్‌పై దాడిచేసి ధాన్యాన్ని ఎత్తుకెళుతున్న క్రమంలో... బైరాన్‌పల్లి గ్రామరక్షక దళం నాయకులు, గ్రామస్తులంతా ఏకమై గొడ్డళ్లు, బరిసెలు, ఒడిసెలతో ఎదురుదాడికి దిగారు. దీంతో కక్షగట్టిన రజాకార్లు బైరాన్‌పల్లిని విధ్వంసం చేయాలనే నిర్ణయానికొచ్చారు. 1948 మే నెలలో బైరాన్‌పల్లిపై దాడికి విఫలయత్నం1948 మే నెలలో 60 మంది రజాకార్లు తుపాకులతో బైరాన్‌పల్లిపై దాడికి ప్రయత్నించి విఫలమయ్యారు. రెండోసారి 150 మంది రజాకార్లు పోరుగ్రామంపై దాడికి పాల్పడి ఓటమి చెందారు. ఇలా రెండుసార్లు ఘోరంగా విఫలమైన రజాకార్లు బైరాన్‌పల్లిపై ప్రతీకారం పెంచుకున్నారు. 1948 ఆగస్టు 27న రాక్షసులు పంజా విసిరారు. పారిపోవడానికి ప్రయత్నించిన ప్రజలందరిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలను నగ్నంగా చేసి.. బతుకమ్మ ఆడించిన రజాకార్ల పైశాచిక ఆనందం నేటికీ వారి మనసుల్లో మానని గాయంగానే మిగిలిపోయింది. అవి రజాకార్లు గ్రామాలపై పడి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటూ రాక్షస క్రీడలను కొనసాగిస్తున్న రోజులు. వారిని ఎదిరించి పోరాడేందుకు యువకులంతా కలిసి గ్రామ రక్షక దళంగా ఏర్పడ్డారు. దూళ్మిట్ట, కూటిగల్, లింగాపూర్, బైరాన్‌పల్లిలోని గ్రామ రక్షక దళాలు బైరాన్‌పల్లిని ముఖ్య కేంద్రంగా చేసుకొని రజాకార్ల ఆగడాలను తిప్పికొట్టసాగారు. దీనికి ప్రతిగా రజాకార్లు గ్రామాలపై మూకుమ్మడి దాడులు చేస్తూ ఇళ్లను తగులబెట్టి దోపిడీకి పాల్పడే వాళ్లు. గ్రామాలపై దాడులు చేసి దోచుకున్న సంపదతో తిరిగి రజాకార్లపై బైరాన్‌పల్లి వద్ద దూబూరి రాంరెడ్డి, ముకుందాడ్డి, మురళీధర్‌రావు నాయకత్వంలో గ్రామ రక్షణ, గెరిల్లా దళాలు దాడిచేసి దోపిడీ సంపదను స్వాధీనం చేసుకొని పంచిపెట్టాయి. ఈ ఘటన తర్వాత బైరాన్‌పల్లిపై రజాకార్లు ఏ క్షణానైనా దాడికి పాల్పడే అవకాశముందనే అనుమానంతో గ్రామం నడిబొడ్డున ఎత్తైన బురుజు నిర్మించారు.

# విఘ్నాలు తొలగించే నాయకుడు వినాయకుడు




## -నీలాపనిందలు పోగొట్టే వినాయక వ్రతకథ

## -నేడు వినాయక చవితి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఏ కార్యక్రమం చేపట్టినా తొలి పూజ గణేశుడికే.. వినాయకుడి పుట్టిన రోజైన 'భాద్రపద శుద్ధ చవితి' రోజునే 'వినాయక చవితి' పండుగను హిందువులు జరుపుకుంటారు. ఆ రోజునే వినాయకుడు పుట్టాడని.. గణాధిపత్యం పొందాడని పలు పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి. వినాయక వ్రతం, పూజా విధానం ఎలా చేయాలో మంథని పట్టణానికి చెందిన పురోహితుడు మత్స శివప్రసాద్ తెలిపారు తెలుసుకోండి. వినాయక చవితి రోజున ప్రాతఃకాలమే లేచి ఇంటిని శుభ్రం చేయాలి. తర్వాత తలంటు స్నానం చేసి ఉతికిన వస్త్రాలను ధరించాలి. మామిడాకులు తోరణాలు కట్టి, ఇంటిని అలంకరించారు. ఓ పీటకు పసుపు రాసి ఇంటికి ఈశాన్య భాగంలో లేదా ఉత్తర దిక్కులో ఉంచాలి. ఓ పళ్లెంలో బియ్యంవేసి వాటిపై తమలపాకులు పెట్టుకోవాలి. అగరువత్తులు వెలిగించి, దీపారాధన తర్వాత..'ఓం దేవీంవాచ మజనయంత దేవాస్తాం విశ్వరూపా: పశవో వదంతిసానో మంద్రేష మూర్జం దుహానాధే నుర్వాగాస్మానుప సుష్టుతైత్తు అయం ముహూర్తస్సుముహూర్తోస్తు'శ్లోకం: య శ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వ మంగళా తయో స్సంస్మరణా త్పుంసాం సర్వతో జయమంగళం అని చదవాలి. పీటపై వినాయక ప్రతిమను ఉంచి, పాలవెల్లికి పసుపు రాసి, కుంకుమతో బొట్టు పెట్టి విగ్రహం తలపై వచ్చేలా దాన్ని వేలాడదీయాలి. దీనిపై పత్రి వేసి నలువైపులా మొక్కజొన్న పొత్తులు, పళ్లతో అలంకరించాలి. ఉండ్రాళ్లు, కుడుములు, పాయసం, గారెలు, పులిహోర, మోదకులు, జిల్లెడుకాయలు మొదలైన పిండివంటలు సిద్ధం చేసుకోవాలి. రాగి లేదా ఇత్తడి పాత్రను తీసుకుని పసుపు రాసి, అందులో నీళ్లువేసి, పైన టెంకాయ, జాకెట్టు ఉంచి కలశం ఏర్పాటు చేయాలి.పూజకు కావాల్సిన సామాగ్రిపసుపు, కుంకుమ, గంధం, అగరవత్తులు, కర్పూరం, తమలపాకులు, పూలు, అరటిపండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, తోరం, కుందులు, నెయ్యి, నూనె, వత్తులు, 21 రకాల పత్రి, ఉద్ధరిణ, నైవేద్యాలు.పూజా విధానం..ఓం కేశవాయ స్వాహా:, ఓం నారాయణాయ స్వాహా:, ఓం మాధవాయ స్వాహా: అని మూడుసార్లు చేతిలో నీరు వేసుకొని ఆచమనం చేసుకోవాలి. అనంతరంఈ కింది శ్లోకాలను ఉచ్చరించాలి. గోవిందాయ నమః, విష్ణవే నమః, మధుసూదనాయ నమః, త్రివిక్రమాయ నమః, వామనాయ నమః, శ్రీధరాయ నమః, హృషీకేశాయ నమః, పద్మనాభాయ నమః, దామోదరాయ నమః, సంకర్షణాయ నమః, వాసుదేవాయ నమః, ప్రద్యుమ్నాయ నమః, అనిరుద్ధాయ నమః, పురుషోత్తమాయ నమః, అథోక్షజాయ నమః, నారసింహాయ నమః, అచ్యుతాయ నమః, ఉపేంద్రాయ నమః, హరయే నమః, శ్రీ కృష్ణాయ నమః, శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమఃఈ కింది మంత్రాన్ని చెబుతూ కుడి చేతితో అక్షంతలు దేవునిపై చల్లాలి.ఓం శ్రీలక్ష్మీ నారాయణాభ్యాం నమః, ఓం ఉమామహేశ్వరాభ్యాం నమః, ఓం వాణీ హిరణ్యగర్భాభ్యాం నమః, ఓం శచీపురందరాభ్యాం నమః, ఓం అరుంధతీ వశిష్ఠాభ్యాం నమః, ఓం శ్రీ సితారామాభ్యాం నమః, నమస్సర్వేభ్యో మహాజనేభ్యః అయం ముహూర్త స్సుముహూర్తోస్తభూతోచ్చాటనఉత్తిష్ఠంతు భూతపిశాచా: ఏతే భూమి భారకా: ఏతాషామవిరోధేనబ్రహ్మకర్మ సమారభే అనే మంత్రాన్ని చదువుతూ అక్షతలు తలపై నుంచి వెనుక వేసుకొవాలి.ప్రాణాయామం: ఓం భూః, ఓం భువః, ఓగ్ సువః, ఓం మహః, ఓం జనః, ఓం తపః, ఓగ్ నత్యం, ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్, ఓమా పోజ్యోతీరసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాంగతోపినా యః స్మరేద్వై విరూపాక్షంస బాహ్యాభ్యంతరశ్శుచిః అని నాలుగు దిక్కులా ఉద్ధరనితో నీళ్లు చల్లి శుద్ధిచేయాలి. సంకల్పం:మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శుభేశోభనే ముహూర్తే, శ్రీ మహావిష్ణోరాజ్ఞాయా ప్రవర్తమానస్య అద్య బ్రాహ్మణ: ద్వితీయపరార్థే, శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదే, జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోర్ధక్షిణదిగ్భాగే, ??.. నదీ సమీపే??? ( శ్రీ శైలస్య) నివాసిత గృహే అస్మిన్ వర్తమాన వ్యావహారిక, చాంద్రమానేన శ్రీ వికారినామ సంవత్సరే, దక్షిణాయనే, వర్ష ఋతౌ, (భాద్రపద) మాసే, (శుక్ల) పక్షే, (చతుర్థ్యాం) తిథి ఇందు వాసరే, శుభ నక్షత్రే, శుభయోగే శుభకరణే, ఏవంగుణ విశేషేణ విశిష్టాయాం, శుభతిథౌ శ్రీమాన్???? గోత్ర: ???.నామధేయ (వారివారి గోత్రం, పేరు చదువుకోవాలి) ధర్మపత్నీ?????? సమేతోహం సకుటుంబస్య క్షేమస్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధ్యర్థం, ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభివృద్ధ్యర్థం సకలకార్యేషు సర్వదా దిగ్విజయసిద్ధ్యర్థం, శ్రీ వరసిద్ధి వినాయక దేవతా ముద్దిస్య శ్రీ వరసిద్ధి వినాయక దేవతాపూజాం కరిష్యే అదౌ నిర్విఘ్న పరిసమాప్త్యర్థం శ్రీ మహాగణాధిపతి పూజాం కరిష్యే అంటూ కుడిచేయి ఉంగరం వేలితో నీళ్లు ముట్టుకోవాలి.భవసంచిత పాపౌఘ విధ్వంసన విచక్షణమ్ విఘ్నాంధకార భాస్వంతం విఘ్నరాజ మహంభజేఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజం పాశాంకుశధరం దేవమ్ ధ్యాయేత్సిద్ధి వినాయకమ్ ఉత్తమం గణనాథస్య వ్రతం సంపత్కరం శుభం భక్తాభీష్టప్రదం తస్మాత్ ధ్యాయేత్తం విఘ్ననాయకం.షోడశోపచార పూజధ్యాయేత్గజాననం దేవం తప్తకాంచనసన్నిభం, చతుర్భుజం మహాకాయం సర్వాభరణ భూషితం. శ్రీ మహా గణాధిపతయే నమః ధ్యాయామిఅత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చితేశ్వర అనాథనాథ సర్వజ్ఞ గౌరీగర్భ సముద్భవ.. ఆవాహయామి:మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్నైర్విరాజితం రత్నసింహాసనంచారు ప్రీత్యర్థం ప్రతి గృహ్యతాం.. ఆసనం సమర్పయామి:గౌరీపుత్ర నమస్తేస్తు శంకర ప్రియనందన గృహాణార్ఘ్యం మయాదత్తం గంధ పుష్పాక్షతైర్యుతం.. అర్ఘ్యం సమర్పయామి:గజవక్త్ర నమస్తేస్తు సర్వాభీష్ట ప్రదాయక భక్త్యాపాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానన.. పాద్యం సమర్పయామి:అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ వరపూజిత గృహాణాచమనం దేవ, తుభ్యం దత్తంమయా ప్రభో.. ఆచమనీయం సమర్పయామి: దధిక్షీర సమాయుక్తం థామద్వాజ్యేన సమన్వితం మధుపర్కం గృహాణేదం గజవక్త్రం నమోస్తుతే.. మధుపర్కం సమర్పయామి:స్నానం పంచామృతైర్దేవ గృహాణ గణనాయక అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ గణపూజిత.. పంచామృత స్నానం సమర్పయామి:గంగాదిసర్వతీర్థేభ్యః ఆహృతైరమలిర్జలైః స్నానం కురుష్వభగవానుమాపుత్ర నమోస్తుతే.. శుద్ధోదక స్నానం సమర్పయామి: రక్తవస్త్రద్వయం చారు దేవయోగ్యంచ మంగళం శుభప్రదం గృహాణత్వం లంబోదరహరాత్మజ..వస్త్రయుగ్మం సమర్పయామి:రాజితం బహ్మాసూత్రంచ కాంచనం చో త్తరీయకం గృహాణ సర్వదేవజ్ఞ భక్తానామిష్టదాయక.. యజ్ఞోపవీతం సమర్పయామి:చంద నాగరు కర్పూర కస్తూరీ కుంకుమాన్వితం విలేపనం సురశ్రేష్ఠ ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం.. గంధాన్ సమర్పయామి:అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీయాంస్తండులాన్ శుభాన్, గృహాణ పరమానంద ఈశపుత్ర నమోస్తుతే.. అక్షతాన్ సమర్పయామి:సుగంధాని సుపుష్పాణి జాజీకుంద ముఖానిచ ఏక వింశతి పత్రాణి సంగృహాణ నమోస్తుతే.. పుష్పాణి పూజయామి:అథాంగ పూజ.. పుష్పాలతో పూజించాలి.గణేశాయ నమః - పాదౌ పూజయామిఏకదంతాయ నమః - గుల్ఫౌ పూజయామిశూర్పకర్ణాయ నమః - జానునీ పూజయామివిఘ్నరాజాయ నమః - జంఘే పూజయామిఅఖువాహనాయ నమః - ఊరూ పూజయామిహేరంబాయ నమః - కటిం పూజయామిలంబోదరాయ నమః - ఉదరం పూజయామిగణనాథాయ నమః - నాభిం పూజయామిగణేశాయ నమః - హృదయం పూజయామిస్థూలకంఠాయ నమః - కంఠం పూజయామిగజవక్త్రాయ నమః - వక్త్రం పూజయామివిఘ్నహంత్రే నమః - నేత్రం పూజయామిశూర్పకర్ణాయ నమః - కర్ణౌ పూజయామిఫాలచంద్రాయ నమః - లలాటం పూజయామిసర్వేశ్వరాయ నమః - శిరః పూజయామివిఘ్నరాజాయ నమః - సర్వాణ్యంగాని పూజయామిఏకవింశతి పత్రపూజఏకవింశతి పత్రపూజ: 21 రకాల పత్రాలతో పూజించాలి. సుముఖాయనమః - మాచీపత్రం పూజయామి,గణాధిపాయ నమః - బృహతీపత్రం పూజయామి?ఉమాపుత్రాయ నమః - బిల్వపత్రం పూజయామి,గజాననాయ నమః - దుర్వాయుగ్మం పూజయామిహరసూనవేనమః - దత్తూరపత్రం పూజయామి,లంబోదరాయనమః - బదరీపత్రం పూజయామి,గుహాగ్రజాయనమః - అపామార్గపత్రం పూజయామి,గజకర్ణాయనమః - తులసీపత్రం పూజయామి,ఏకదంతాయ నమః - చూతపత్రం పూజయామి,వికటాయ నమః - కరవీరపత్రం పూజయామి,భిన్నదంతాయ నమః - విష్ణుక్రాంతపత్రం పూజయామి,వటవేనమః - దాడిమీపత్రం పూజయామి,సర్వేశ్వరాయనమః - దేవదారుపత్రం పూజయామి,ఫాలచంద్రాయ నమః - మరువకపత్రం పూజయామి,హేరంబాయనమః - సింధువారపత్రం పూజయామిశూర్పకర్ణాయనమః - జాజీపత్రం పూజయామి,సురాగ్రజాయనమః - గండకీపత్రం పూజయామి,ఇభవక్త్రాయనమః - శమీపత్రం పూజయామి,వినాయకాయ నమః - అశ్వత్థపత్రం పూజయామి,సురసేవితాయ నమః - అర్జునపత్రం పూజయామి,కపిలాయ నమః - అర్కపత్రం పూజయామి,శ్రీ గణేశ్వరాయనమః - ఏకవింశతి పత్రాణి పూజయామి.అష్టోత్తర శతనామ పూజావళిఓం గజాననాయ నమఃఓం గణాధ్యక్షాయ నమఃఓం విఘ్నరాజాయ నమఃఓం వినాయకాయ నమఃఓం ద్వైమాతురాయ నమఃఓం ద్విముఖాయ నమఃఓం ప్రముఖాయ నమఃఓం సుముఖాయ నమఃఓం కృతినే నమఃఓం సుప్రదీప్తాయ నమఃఓం సుఖనిధయే నమఃఓం సురాధ్యక్షాయ నమఃఓం సురారిఘ్నాయ నమఃఓం మహాగణపతయే నమఃఓం మాన్యాయ నమఃఓం మహాకాలాయ నమఃఓం మహాబలాయ నమఃఓం హేరంబాయ నమఃఓం లంబజఠరాయ నమఃఓం హయగ్రీవాయ నమఃఓం ప్రథమాయ నమఃఓం ప్రాజ్ఞాయ నమఃఓం ప్రమోదాయ నమఃఓం మోదకప్రియాయ నమఃఓం విఘ్నకర్త్రే నమఃఓం విఘ్నహంత్రే నమఃఓం విశ్వనేత్రే నమఃఓం విరాట్పతయే నమఃఓం శ్రీపతయే నమఃఓం వాక్పతయే నమఃఓం శృంగారిణే నమఃఓం ఆశ్రితవత్సలాయ నమఃఓం శివప్రియాయ నమఃఓం శీఘ్రకారిణే నమఃఓం శాశ్వతాయ నమఃఓం బల్యాన్వితాయ నమఃఓం బలోద్ధతాయ నమఃఓం భక్తనిధయే నమఃఓం భావగమ్యాయ నమఃఓం భావాత్మజాయ నమఃఓం అగ్రగామినే నమఃఓం మంత్రకృతే నమఃఓం చామీకర ప్రభాయ నమఃఓం సర్వాయ నమఃఓం సర్వోపాస్యాయ నమఃఓం సర్వకర్త్రే నమఃఓం సర్వ నేత్రే నమఃఓం సర్వసిద్ధిప్రదాయ నమఃఓం పంచహస్తాయ నమఃఓం పార్వతీనందనాయ నమఃఓం ప్రభవే నమఃఓం కుమార గురవే నమఃఓం కుంజరాసురభంజనాయ నమఃఓం కాంతిమతే నమఃఓం ధృతిమతే నమఃఓం కామినే నమఃఓం కపిత్థఫలప్రియాయ నమఃఓం బ్రహ్మచారిణే నమఃఓం బ్రహ్మరూపిణే నమఃఓం మహోదరాయ నమఃఓం మదోత్కటాయ నమఃఓం మహావీరాయ నమఃఓం మంత్రిణే నమఃఓం మంగళసుస్వరాయ నమఃఓం ప్రమదాయ నమఃఓం జ్యాయసే నమఃఓం యక్షికిన్నరసేవితాయ నమఃఓం గంగాసుతాయ నమఃఓం గణాధీశాయ నమఃఓం గంభీరనినదాయ నమఃఓం వటవే నమఃఓం జ్యోతిషే నమఃఓం అక్రాంతపదచిత్ప్రభవే నమఃఓం అభీష్టవరదాయ నమఃఓం మంగళప్రదాయ నమఃఓం అవ్యక్త రూపాయ నమఃఓం పురాణపురుషాయ నమఃఓం పూష్ణే నమఃఓం పుష్కరోత్ క్షిప్తహరణాయ నమఃఓం అగ్రగణ్యాయ నమఃఓం అగ్రపూజ్యాయ నమఃఓం అపాకృతపరాక్రమాయ నమఃఓం సత్యధర్మిణే నమఃఓం సఖ్యై నమఃఓం సారాయ నమఃఓం సరసాంబునిధయే నమఃఓం మహేశాయ నమఃఓం విశదాంగాయ నమఃఓం మణికింకిణీ మేఖలాయ నమఃఓం సమస్తదేవతామూర్తయే నమఃఓం సహిష్ణవే నమఃఓం బ్రహ్మవిద్యాది దానభువే నమఃఓం విష్ణవే నమఃఓం విష్ణుప్రియాయ నమఃఓం భక్తజీవితాయ నమఃఓం ఐశ్వర్యకారణాయ నమఃఓం సతతోత్థితాయ నమఃఓం విష్వగ్దృశేనమఃఓం విశ్వరక్షావిధానకృతే నమఃఓం కళ్యాణగురవే నమఃఓం ఉన్మత్తవేషాయ నమఃఓం పరజయినే నమఃఓం సమస్త జగదాధారాయ నమఃఓం సర్వైశ్వర్యప్రదాయ నమఃఓం శ్రీ విఘ్నేశ్వరాయ నమఃఅగజానన పద్మార్కం గజాననమహర్నిశమ్అనేక దంతం భక్తానాం ఏకదంతముపాస్మహేదశాంగం గుగ్గలోపేతం సుగంధం, సుమనోహరం, ఉమాసుత నమస్తుభ్యం గృహాణ వరదోభవ.. ధూపమాఘ్రాపయామిసాజ్యం త్రివర్తిసంయుక్తం వహ్నినాద్యోజితం మయా, గృహాణ మంగళం దీపం ఈశపుత్ర నమోస్తుతే.. దీపందర్శయామి?సుగంధాసుకృతాంశ్చైవమోదకాన్ ఘృతపాచితాన్, నైవేద్యం గృహ్యతాంచణముద్దేః ప్రకల్పితాన్, భక్ష్యం చ లేహ్యంచ చోష్యం పానీయమేవచ, ఇదం గృహాణ నైవేద్యం మయాదత్తం వినాయక.. నైవేద్యం సమర్పయామి.సచ్చిదానంద విఘ్నేశ పుష్కరాని ధనానిచ, భూమ్యాం స్థితాని భగవాన్ స్వీకురుష్వ వినాయక.. సువర్ణపుష్పం సమర్పయామి.పూగీఫల సమాయుక్తం నాగవల్లీ దళైర్యుతం, కర్పూర చూర్ణసంయుక్తం తాబూలం ప్రతిగృహ్యతాం.. తాంబూలం సమర్పయామి.ఘృతవర్తి సహస్రైశ్చ శకలైస్థితం నీరాజనం మయాదత్తం గృహాణవరదోభవ.. నీరాజనం సమర్పయామి.అథ దూర్వాయుగ్మ పూజా.. గణాధిపాయ నమః దూర్వాయుగ్మం పూజయామి.ఉమాపుత్రాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. అఖువాహనాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. వినాయకాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. ఈశపుత్రాయ నమః దూర్వాయుగ్మం పూజయామి.సర్వసిద్ధి ప్రదాయకాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. ఏకదంతాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. ఇభవక్త్రాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. మూషిక వాహనాయ నమః దూర్వాయుగ్మం పూజయామి. కుమారగురవే నమః దూర్వాయుగ్మం పూజయామి.ఏకదంతైకవదన తథామూషిక వాహనాయ నమః దూర్వాయుగ్మం పూజయామి.కుమారగురవే తుభ్యం అర్పయామి సుమాంజలిం మంత్రపుష్పం సమర్పయామి.నమస్కారం, ప్రార్థనప్రదక్షిణం కరిష్యామి సతతం మోదకప్రియ నమస్తే విఘ్ననాశన.. ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి,అర్ఘ్యం గృహాణ హేరంబ సర్వ భద్ర ప్రదాయక గంధ పుష్పాక్షతైర్యుక్తం పాత్రస్థం పాపనాశన.. పునరర్ఘ్యం సమర్పయామి,ఓం బ్రహ్మవినాయకాయ నమఃనమస్తుభ్యం గణేశాయ నమస్తే విఘ్ననాశన, ఈప్సితంమే వరం దేహి వరత్రచ పరాంగతిమ్.వినాయక నమస్తుభ్యం సంతతం మోదక ప్రియ.. నిర్విఘ్నం కురుమే దేవ సర్వ కార్యేషు సర్వదా.వినాయక వ్రత కథవ్రతకథ చెప్పుకునే ముందు కొన్ని అక్షతలు చేతిలో ఉంచుకోవాలి. కథ పూర్తయిన తరవాత వాటిని శిరసుపై వేసుకోవాలి.

పూర్వం చంద్రవంశానికి చెందిన ధర్మరాజు దాయాదుల వల్ల రాజ్యాన్ని, సిరిసంపదలన్నీ పోగొట్టుకున్నాడు. భార్య, తమ్ములతో వనవాసం చేస్తూ ఒకనాడు నైమిశారణ్యానికి చేరుకున్నాడు. అక్కడ శౌనకాది రుషులకు అనేక పురాణ రహస్యాలను బోధిస్తున్న సూతమహామునిని దర్శించి 'రుషివర్యా, మేము రాజ్యాధికారాన్నీ సమస్త వస్తు వాహనాలనూ పోగొట్టుకున్నాం. ఈ కష్టాలన్నీ తీరి, పూర్వవైభవం పొందేలా ఏదైనా సులభమైన వ్రతాన్ని చెప్పండి' అని ప్రార్థించాడు. అప్పుడు సూతుడు ధర్మరాజుకు... వినాయకవ్రతం చేస్తే కష్టాలు తొలగిపోయి, సమస్త సౌఖ్యాలూ కలుగుతాయంటూ ఇలా చెప్పసాగాడు.'ఒకసారి కుమారస్వామి పరమశివుణ్ణి దర్శించి 'తండ్రీ! మానవులు ఏ వ్రతం చేయడం వలన వంశవృద్ధిని పొంది, సమస్త కోరికలూ తీరి, సకల శుభాలనూ విజయాలనూ వైభవాలనూ పొందగలుగుతారో అటువంటి వ్రతాన్ని చెప్పండి' అని కోరాడు. అందుకు శివుడు 'నాయనా! సర్వసంపత్కరం, ఉత్తమం, ఆయుష్కామ్యార్థ సిద్ధిప్రదమూ అయిన వినాయక వ్రతమనేదొకటుంది. దీన్ని భాద్రపద శుద్ధ చవితినాడు ఆచరించాలి. ఆరోజు ఉదయమే నిద్రలేచి, స్నానం చేసి, నిత్యకర్మలు నెరవేర్చుకుని తమ శక్తిమేరకు బంగారంతోగానీ, వెండితోగానీ లేదా మట్టితోగానీ విఘ్నేశ్వరుడి బొమ్మను చేసి, తమ ఇంటికి ఉత్తర దిక్కులో బియ్యాన్ని పోసి మండపాన్ని నిర్మించి, అష్టదళ పద్మాన్ని ఏర్పరచాలి. అందులో గణేశుని ప్రతిమను ప్రతిష్ఠించాలి. అనంతరం శ్వేతగంధాక్షతలు, పుష్పాలు, పత్రాలతో పూజించి, ధూపదీపాలను, వెలగ, నేరేడు మొదలైన ఫలములను, రకమునకు ఇరవైఒకటి చొప్పున నివేదించాలి. నృత్య, గీత, వాద్య పురాణ పఠనాదులతో పూజను ముగించి, యథాశక్తి వేదవిదులైన బ్రాహ్మణులకి దక్షిణ, తాంబూలాదులు ఇవ్వాలి.బంధుజనంతో కలిసి భక్ష్య భోజ్యాదులతో భోజనం చేయాలి. మరునాడు ఉదయం స్నానసంధ్యలు పూర్తిచేసుకుని గణపతికి పునఃపూజ చేయాలి. ఈ విధంగా ఎవరైతే వినాయక వ్రతాన్ని చేస్తారో వాళ్ళకి గణపతి ప్రసాదం వలన సకల కార్యాలూ సిద్ధిస్తాయి. అన్ని వ్రతాల్లోకీ అత్యుత్తమమైన ఈ వ్రతం త్రిలోక ప్రసిద్ధమై దేవ ముని గంధర్వాదులందరిచేతా ఆచరింపబడింది'అని పరమశివుడు కుమారస్వామికి చెప్పాడు.కనుక ధర్మరాజా, నువ్వు కూడా ఈ వ్రతాన్ని ఆచరించినట్లయితే- నీ శత్రువులను జయించి సమస్త సుఖాలనూ పొందుతావు. గతంలో విదర్భ యువరాణి దమయంతి ఈ వ్రతం చేయడం వల్లనే... తాను ప్రేమించిన నలమహారాజును పెళ్లాడ గలిగింది. శ్రీకృష్ణుడంతటివాడు ఈ వ్రతం చేయడం వల్లనే శమంతకమణితోబాటుగా జాంబవతీ సత్యభామలనే ఇద్దరు కన్యామణులను కూడా పొందగలిగాడు. ఆ కథ చెబుతాను విను' అంటూ ఇలా చెప్పసాగాడు.పూర్వం గజముఖుడయిన గజాసురుడు శివుడి కోసం తపస్సు చేశాడు. అతని తపస్సునకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. గజాసురుడు 'స్వామీ నువ్వు నా ఉదరమందే నివసించాలి' అని కోరాడు. దాంతో భక్తసులభుడైన శివుడు అతడి కుక్షియందు ఉండిపోయాడు. జగన్మాత పార్వతి భర్తను వెదుకుతూ ఆయన గజాసురుని కడుపులో ఉన్నాడని తెలుసుకుంది. ఆయన్ను దక్కించుకునే ఉపాయం కోసం శ్రీమహావిష్ణువును ప్రార్థించినది. శ్రీహరి బ్రహ్మాది దేవతలను పిలిపించి చర్చించాడు. గజాసుర సంహారానికి గంగిరెద్దు మేళమే తగినదని నిర్ణయించారు. నందీశ్వరుణ్ణి గంగిరెద్దుగా అలంకరించారు. బ్రహ్మాది దేవతలందరూ తలకొక వాయిద్యాన్ని ధరించారు. మహావిష్ణువు చిరుగంటలు, సన్నాయిలు ధరించాడు. గజాసుర పురానికి వెళ్ళి గంగిరెద్దును ఆడిస్తుండగా గజాసురుడది విని, వారిని పిలిపించి తన భవనం ఎదుట గంగిరెద్దును ఆడించమని కోరాడు. బ్రహ్మాది దేవతలు రసరమ్యంగా వాద్యాలను వాయిస్తుండగా జగన్నాటక సూత్రధారియైన హరి చిత్రవిచిత్రంగా గంగిరెద్దును ఆడించాడు.గజాసురుడు పరమానందభరితుడై 'ఏమి కావాలో కోరుకోండి... ఇస్తాను' అన్నాడు. అంతట శ్రీహరి గజాసురుణ్ణి సమీపించి 'ఇది శివుని వాహనమైన నంది, శివుణ్ణి కనుగొనడానికి వచ్చింది, శివుణ్ణి అప్పగించు' అని కోరాడు. ఆ మాటలకు గజాసురుడు నివ్వెరపోయాడు. వచ్చినవాడు రాక్షసాంతకుడైన శ్రీహరి అని తెలుసుకున్నాడు. తనకు మరణం నిశ్చయమనుకున్నాడు. తన గర్భంలో ఉన్న పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి 'స్వామీ, నా శిరస్సును త్రిలోక పూజ్యముగా చేసి, నా చర్మాన్ని నువ్వు ధరించు' అని ప్రార్థించాడు. తన గర్భంలో ఉన్న శివుణ్ణి తీసుకోవచ్చునని విష్ణుమూర్తికి అంగీకారం తెలియజేశాడు. అంత శ్రీహరి నందిని ప్రేరేపించగా, నంది తన కొమ్ములతో గజాసురుని ఉదరాన్ని చీల్చాడు. బ్రహ్మాది దేవతలకు వీడ్కోలు చెప్పి శ్రీహరి వైకుంఠానికి వెళ్ళగా, శివుడు నందినెక్కి కైలాసానికి వెళ్లాడు.తన భక్తుడైన గజాసురుని కోరిక మేరకు అతడి ఉదరంలో ఉన్న పరమేశ్వరుని శ్రీమహావిష్ణువు విముక్తి కల్పిచడంతో భర్త రాకకు పార్వతి కైలాసంలో ఎదురుచూస్తోంది. శివుడి కోసం ఎదురు చూస్తూ స్నానానికి సిద్ధమైంది. స్నానానికి వెళుతూ దేహానికి నలుగుపిండిని అద్దుకుంది. పరధ్యానంలో ఆ పిండితోనే ఓ ప్రతిమను తయారుచేసింది. చూడముచ్చటైన ఆ బాలుడికి తండ్రి ఉపదేశించిన మంత్ర సాయంతో పార్వతి ప్రాణం ప్రతిష్ఠ చేసింది.దివ్య సుందరమైన ఆ బాలుని వాకిట కాపలా ఉంచి తాను స్నానానికి వెళ్లింది. అంతలో అక్కడికి వచ్చిన శివుడిని ఆ బాలుడు అడ్డుకున్నాడు. ఆగ్రహావేశాలకు లోనైన రుద్రుడు....ఆ బాలుడి శిరస్సును తన త్రిశూలంతో ఖండించాడు. ఆ శబ్దానికి బయటికి వచ్చిన పార్వతీ దేవి, జరిగిన ఘోరం చూసి కన్నీళ్లు పెట్టుకుంది. దీంతో శివుడు...గజముఖుడి శిరస్సును తెప్పించి ఆ బాలుడికి అతికించి ప్రాణం పోసి గజాననుడు అనే నామకరణం చేశాడు. అతడి శక్తి సామర్థ్యాలను పరిశీలించి భాద్రపద శుద్ధ చవితి నాడు గణాధిపత్యం కట్టబెట్టాడు. ఆ రోజున తనకు భక్తితో సమర్పించిన ఉండ్రాళ్లు, కుడుములు, పిండివంటలు, పండ్లను సుష్టిగా తిన్న వినాయకుడి నడవటానికి ఇబ్బందిపడుతూ కైలాసం చేరుకున్నాడు.శివుని శిరస్సుపై ఉన్న చంద్రుడు గణనాధుని అవస్థలు చూసి ఫక్కున నవ్వాడు. రాజదృష్టి సోకితే రాళ్లు కూడా నుజ్జవుతాయని విఘ్ననాధుని ఉదరం పగిలి అందులోని ఉండ్రాళు,, కుడుములు బయటకు వచ్చి అచేతనుడయ్యాడు. దీంతో ఆగ్రహించిన పార్వతి దేవి.. పాపాత్ముడా నీ దృష్టిసోకి నా కుమారుడు అచేతనంగా పడివున్నాడు.. కాబట్టి నిన్నుచూసివారు పాపాత్ములై నీలాపనిందలు పొందుదురు గాక అని శపించింది.ఋషి పత్నులకు నీలాపనిందలుపార్వతీదేవి చంద్రుని శపించిన సమయంలో సప్తఋషులు భార్యలతో కలసి యజ్ఞం చేస్తూ, అగ్నిదేవునికి ప్రదక్షిణం చేస్తున్నారు. అగ్నిదేవుడికి ఋషిపత్నుల మీద మోహం కలిగింది. కోరిక తీరక, శపిస్తారేమో అనే భయంతో అగ్ని క్షీణింపసాగాడు. భర్త కోరిక తెలుసుకున్న స్వాహాదేవి ఋషుల భార్యల రూపంలో అగ్నిదేవుడిని చేరింది. అగ్నిదేవునితో ఉన్నది తమ భార్యలేనని భ్రాంతి చెందిన ఋషులు, వారిని విడిచిపెట్టారు. శాపగ్రస్థుడైన చంద్రుని చూడటం వలనే ఋషుల భార్యలు నీలాపనిందలకు గురయ్యారని దేవతలు గ్రహించారు. వీరందరూ బ్రహ్మదేవునితో కలసి కైలాసానికి వెళ్లారు. మరణించిన విఘ్నేశ్వరుడిని బ్రహ్మదేవుడు తిరిగి బతికించాడు.తర్వాత పార్వతీదేవితో 'అమ్మా నీవు చంద్రునికి ఇచ్చిన శాపం వలన ఆపద కలిగింది. కావున శాపాన్ని ఉపసంహరించుకో' అని కోరాడు. అప్పుడు పార్వతీదేవి 'ఏ రోజున చంద్రుడు విఘ్నేశ్వరుడిని చూసి నవ్వాడో ఆ రోజు చంద్రుణ్ణి చూడకూడదు' అని శాపాన్ని సవరించింది. ఆ రోజునుంచి అందరూ భాద్రపద శుద్ధ చవితి నాడు చంద్రుణ్ణి చూడకుండా జాగ్రత్తగా ఉండి, సుఖంగా ఉన్నారు. ఇలా కొంతకాలం గడిచింది.శమంతకోపాఖ్యానంద్వాపరయుగంలో ద్వారకలో నివాసం ఉన్న శ్రీకృష్ణుడిని నారదుడు కలిశాడు. కాసేపు పిచ్చాపాటి మాట్లాడాక 'స్వామీ! ఈ రోజు వినాయక చవితి. పార్వతి శాపం కారణంగా చంద్రుని చూడకూడదు. నేను వెళ్తాను' అని కృష్ణుడికి చెప్పి నారదుడు వెళ్లిపోయాడు. ఆ రోజు రాత్రి ఎవ్వరూ చంద్రుణ్ణి చూడకూడదని పట్టణంలో శ్రీకృష్ణుడు చాటింపు వేయించాడు. శ్రీకృష్ణుడికి పాలంటే ఇష్టం. ఆ రోజు రాత్రి శ్రీకృష్ణుడు ఆవు పాలను తాగుతుండగా పాత్రలోని పాలలో చవితి చంద్రుడి ప్రతిబింబాన్ని చూశాడు. దాంతో తనకెలాంటి అపనింద వస్తుందో అని చింతించాడు. కొన్ని రోజులు గడిచాయి. సత్రాజిత్తు సూర్యుని వరంతో శమంతకమణిని సంపాదించాడు.రోజుకు పది బారువుల బంగారాన్ని ఇచ్చే ఆ మణిని తీసుకుని ద్వారకకు వెళ్లాడు. శ్రీకృష్ణుడు సత్రాజిత్తుకు అతిథి మర్యాదలు చేసి ఆ మణిని తనకు ఇవ్వమని కోరాడు. అందుకు సత్రాజిత్తు ఒప్పుకోలేదు. తర్వాత ఒక రోజు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు శమంతకమణిని మెడలో వేసుకుని అడవికి వేటకు వెళ్లాడు. అడవిలో ఒక సింహం ఆ మణిని చూసి మాంసం ముక్క అనుకుని ప్రసేనుణ్ణి చంపింది. మణిని నోట కరచుకుని పోతున్న సింహాన్ని జాంబవంతుడు చంపాడు.శమంతకమణిని కొండగుహలో ఉన్న తన కూతురు జాంబవతికి ఆట వస్తువుగా ఇచ్చాడు. మరుసటి రోజు సత్రాజిత్తు తమ్ముడి మరణవార్త విన్నాడు. శ్రీకృష్ణుడే తన తమ్ముడిని చంపి శమంతకమణిని అపహరించాడని నిందించాడు. శ్రీకృష్ణుడు అది విన్నాడు. భాద్రపద శుద్ధ చవితి రోజు చంద్రబింబాన్ని చూసిన దోషంవల్ల తన మీద నింద పడిందనుకున్నాడు. శమంతకమణిని వెదుకుతూ అడవికి వెళ్లాడు. ఒక చోట ప్రసేనుడి శవం కనిపించింది. అక్కడి నుంచి సింహం అడుగులు కనిపించాయి.అలా వెదుకుతూ వెళ్లి ఒక పర్వత గుహలోకి ప్రవేశించాడు. అందులో ఉన్న ఉయ్యాలకు కట్టిన మణిని చూసి, దానిని తీసుకుని బయటకు రాసాగాడు. వెంటనే జాంబవతి పెద్దగా ఏడ్వసాగింది. కూతురి ఏడుపు విని జాంబవంతుడు కోపంతో శ్రీకృష్ణుడిపై యుద్ధానికి తలపడ్డాడు. వారిద్దరి మధ్య ఇరవై ఎనిమిది రోజులు యుద్ధం జరిగింది. జాంబవంతుని శక్తి తగ్గిపోయింది. తనతో యుద్ధం చేస్తున్నవాడు శ్రీరామచంద్రుడని తెలుసుకున్నాడు. త్రేతాయుగంలో జాంబవంతుడు శ్రీరాముడితో యుద్ధం చేయాలని కోరాడు. ఆ కోరికను ఇప్పుడు శ్రీకృష్ణుని రూపంలో వచ్చి తీర్చాడని గ్రహించాడు.శ్రీకృష్ణుడికి నమస్కరించి శమంతకమణితో పాటు తన కుమార్తె జాంబవతిని కూడా ఆయనకు సమర్పించాడు. శ్రీకృష్ణుడు శమంతకమణిని తెచ్చి సత్రాజిత్తుకు ఇచ్చాడు. నిజం తెలుసుకున్న సత్రాజిత్తు తనను క్షమించమని శ్రీకృష్ణుడిని వేడుకున్నాడు. తన కుమార్తె సత్యభామను ఇచ్చి వివాహం జరిపించాడు. శమంతకమణిని కూడా శ్రీకృష్ణుడికి ఇచ్చాడు.ఆ సమయంలో అక్కడకు వచ్చిన మునులు శ్రీకృష్ణుడితో 'మీరు సమర్థులు కనుక మీపై పడిన నిందను పోగొట్టుకోగలిగారు. మావంటి వారికి ఏది గతి?' అన్నారు.'భాద్రపద శుద్ధ చవితినాడు యథావిధిగా వినాయకుని పూజించి ఈ శమంత కోపాఖ్యానాన్ని విని అక్షతలు తలపై వేసుకున్న వారికి, ఆరోజు చంద్ర దర్శనం అయినా కూడా అపనిందలు కలగవు' అని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ నాటి నుంచి ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చవితి రోజు దేవతలు, మహర్షులు, మనుషులు తమ శక్తికి తగినట్లుగా గణపతిని పూజించి తమ కోరికలు తీర్చుకుంటున్నారు.ఈ కథను చదివి గాని, విని గాని తలపై అక్షతలను వేసుకొని వినాయక వ్రతాన్ని ముగించాలి. చివరగా వినాయకుని ఎదుట వీలైనన్ని గుంజీలు తీసి, సాష్టాంగ నమస్కారాలు చేయాలి.

# అధునాతన వసతులతో చెన్నంపల్లె ఎంపీపీ పాఠశాల పునర్నిర్మాణం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, ఆగస్టు 26(భారత శక్తి) : బద్వేలు మండలం చెన్నంపల్లె మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను అధునాతన వసతులతో పునర్నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బద్వేలు మండలం చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణంపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బద్వేలు మండలం చెన్నంపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గదులను కోల్పోవడం జరిగిందని అందుకు సంబంధించి పరిహారంగా నేషనల్ హైవే వారు అందించిన మొత్తంతో పాటు,పాఠశాలకు సంబందించిన 50 సెంట్లలో తరగతి గదుల భవనంతో పాటు టాయిలెట్స్, అధునాతనంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి అయ్యే ఖర్చు అంచనా ప్రతిపాదనలు తెలియజేయాలని సమగ్ర శిక్ష అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మోడల్ స్కూలుకు ఉండాల్సిన అన్ని నింబంధనలను తుచా తప్పక పాటిస్తూ అన్ని రకాల నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగవంతం చేయాలన్నారు. మూడు నెలలో పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఓబులమ్మ, ఎస్ఎస్ఏ ఎపిసి ఎ. నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏ ఈఈ గురివిరెడ్డి, ఎంపిడివో మల్లీశ్వరి, సంబందిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించండి..!!




కడప, ఆగస్టు 26(భారత శక్తి) : గణేష్ ఉత్సవాల్లో మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పర్యావరణ సహిత మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంచేలా.. రాష్ట్ర పర్యావరణ నియంత్రణ మండలి వారు రూపొందించిన పోస్టర్ లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు జిల్లా కలెక్టర్ కు మట్టి వినాయకుడి ప్రతిమను అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మట్టివిగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన పెంచేలా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పిఓపి) విగ్రహాలను వాడడం వల్ల చెరువులు, నదులు, ఇతర జల వనరులు కాలుష్యం అవుతున్నాయన్నారు. తద్వారా ఎన్నో రకాల జీవరాశులకు ప్రాణ హాని కలుగుతోందన్నారు. ఈ విఘత్తును నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహనతో గణేష్ ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను వినియోగించాలన్నారు. మట్టి విగ్రహాలను వాడటం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్య తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ, జెడ్పి సీఈవో ఓబులమ్మ, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారద, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, తదితరుల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లిక్కర్ స్కామ్ నిందితులకు సెప్టెంబర్ 3 వరకు రిమాండ్ పొడిగింపు

విజయవాడమద్యం కుంభకోణం కేసులో నిందితులకు రిమాండ్ల పర్వం కొనసాగుతోంది. ఈ కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలిస్తున్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి. మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు.

# వైభవోపేతంగా, ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


### -వినాయక విగ్రహాల తరలింపు సమయంలో జాగ్రత్తలు పాటించాలి
### -ప్రతి గణేష్ మండపం వద్ద ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలు ఉంచాలి
### -ప్రతి గణేష్ మండపానికి లైన్ మెన్ విద్యుత్ కనెక్షన్ అందిస్తారు



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), ఆగస్టు 26:వైభవోపేతంగా, ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, వైభవోపేతంగా జరగాలని అన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా, నిమజ్జనం పాయింట్ల వద్ద ఏర్పాట్లు తదితర అంశాల్లో మంచి ఏర్పాట్లు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. నవరాత్రి వేడుకల సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.గణపతి విగ్రహాల తరలింపు సమయంలో ఎక్కడా విద్యుత్ షాక్ గురికాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యుత్ మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ కాకుండా ఏర్పాట్లు చేయాలని, ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు అధికారులతో పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 7 చోట్ల ఎక్కువ సంఖ్యలో నిమజ్జనం జరిగే ప్రాంతాల వద్ద అవసరమైన బారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, లైటింగ్ ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అన్నారు. నిమజ్జనం సందర్భంగా జిల్లాలో ఎక్కడ మద్యం అమ్మడానికి వీలు లేదని, మధ్య నిషేధం కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము తేలు కాటు మందులు అందుబాటులో పెట్టాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద 3 షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బంది నియమించి పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.నిమజ్జనం పాయింట్ల వద్ద క్రేన్ లలో అదనపు డ్రైవర్ లు, క్రెయిన్ మరమ్మత్తు చేసే మేకానిక్ లను అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. నిమజ్జనం రోజు నాడు ఉదయం 6 గంటల వరకు క్రెయిన్ లు సిద్దంగా ఉండాలని అన్నారు. విగ్రహాల తరలింపు సమయంలో అడ్డు వచ్చే చెట్టు కొమ్మలను తొలగించాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద అవసరమైన మేర గజ ఈతగాళ్ళ ను షిఫ్టుల వారిగా నియమించాలని, స్విమ్మర్స్ తో ముందుగానే చర్చించి వారికి షిప్టు వివరాలు తెలియజేయాలని అన్నారు. ప్రతి వినాయక మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, హెల్త్ మొదలగు ఎమర్జెన్సీ కాంటాక్ట్ వివరాలతో కూడిన చిన్న పోస్టర్ ప్రదర్శించాలని అన్నారు. గణేష్ విగ్రహం నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని, నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. నిమజ్జన పాయింట్ లకు అప్రోచ్ రోడ్డు సరిగ్గా ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలో ప్రతి వినాయక విగ్రహం మండపం రిజిస్టర్ కావాలని, ప్రతి విగ్రహం వద్ద చేసే ఏర్పాట్ల వివరాలు ముందుగానే తెలుసుకోవాలని అన్నారు. విగ్రహాల తరలింపుకు అడ్డు వచ్చే ఇంటర్నెట్, కేబుల్ లను సరి చేయాలని అన్నారు.ప్రతి గణేష్ మండపానికి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ కనెక్షన్ అందిస్తుందని, మండపానికి విద్యుత్ కనెక్షన్ ను లైన్ మెన్ అందిస్తారని, ప్రజలు ఎవరు అనవసరంగా విద్యుత్ కనెక్షన్ పెట్టబోయి ప్రమాదాలకు గురి కావద్దని కలెక్టర్ కోరారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ నిమజ్జనం రోజు ఊరేగింపు కార్యక్రమం, చివరి పూజ సూర్యాస్తమం కంటే ముందే సాయంత్రం 4.00 గంటల ప్రాంతంలో ప్రారంభించాలని ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. నిమజ్జనం నాడు విగ్రహం తరలించే వాహనాలు ముందుగా బుక్ చేసుకోవాలని, విగ్రహం తరలించే రూట్ మ్యాప్ ఫైనల్ చేసుకోవాలని అన్నారు. వినాయక మండపం సమీపంలో ఎక్కడైనా మద్యం బెల్ట్ షాపు ఉంటే, అబ్కారీ శాఖ అధికారులు వెంటనే కట్టడి చేయాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వివాదాస్పద ప్రాంతాల్లో మండపాలు పెట్టవద్దని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్, ఉత్సవ సభ్యులు, పోలీస్ అధికారులు సమన్వయంతో నిమజ్జన సమయంలో రూట్ మ్యాప్ ఫైనల్ చేయాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ వద్ద త్రాగునీటి సరఫరా సమృద్ధిగా అందుబాటులో ఉండాలని అన్నారు. ఆర్టిసి నుంచి డ్రైవర్లు, మెకానిక్ లు అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు జరపడానికి సంపూర్ణ సహకారం పోలీస్ శాఖ నుంచి అందిస్తామని అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ నగరాలు, పట్టణ స్థాయిలో కూడా వినాయక నిమజ్జనం, నవరాత్రి ఉత్సవాలపై రివ్యూ సమావేశం నిర్వహించాలని అన్నారు. మున్సిపాలిటీ స్థాయిలోనే వివిధ శాఖల మధ్య కోఆర్డినేషన్ ఉండాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ, పోలీస్ బందోబస్తు, విద్యుత్ సరఫరా, ఫైర్ సేఫ్టీ చాలా కీలకంగా పరిగణించాలని అన్నారు. అనంతరం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మట్టి గణపతి విగ్రహాల పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మ శ్రీ, టీజీ ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, సహాయ ఎక్సైజ్ పర్యవేక్షకులు వి. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్ కుమార్, ఇరిగేషన్ అధికారి వెంకట్రామ్, జిల్లా రవాణా అధికారి వెంకట రమణ, ఆర్ అండ్ బి ఇఇ పవార్, ఖమ్మం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, ఎఫ్.ఆర్.ఓ. నాగేశ్వర రావు, ఈఈ పంచాయతీ రాజ్ యు. మహేష్ బాబు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవీందర్, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, స్థంభాద్రి గణేష్ ఉత్సవ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ విద్యాసాగర్, కార్యదర్శి జైపాల్ రెడ్డి, కన్వీనర్ ప్రసన్న కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు సాయి కిరణ్, అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

### -అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



వైయస్సార్ కడప జిల్లా, ఆగస్టు 26(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.


ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి.వివిధ శాఖల ద్వారా అందిన ఆన్లైన్ అర్జీలను చాలా మంది అధికారులు ఇంకా ఓపెన్ చేయడం లేదని ఇలాంటివి మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలన్నారు.

48 గం లో అధికారులందరరూ వివరణ ఇవ్వాలన్నారు. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు.వచ్చే సోమవారం లోగా పెండింగ్ లో ఉన్న అర్జీలను నాణ్యతతో పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు బి. మఠం మండలం మల్లే పల్లి గ్రామానికి చెందిన ఎన్ రాజు మా ఊరు నందు సొంత భూమి ఉందని ఆ భూమిని ఆక్రమించారని తగు విచారణ జరిపించి మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతూ అర్జీని సమర్పించారు.

ఆర్ఎస్ కొండాపురం మండలానికి చెందిన


గంగా ప్రసాద్ మా సొంత భూమినీ 22%ఋ% కింద ఆన్లైన్లో చూపించారని, విచారణ జరిపించి 22%ఋ% కింద తొలగించి మా భూమి మాకు రిజిస్ట్రేషన్ చేయించగలరని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్డీసి వెంకటపతి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రిమ్స్ రంగస్వామి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ స్వగృహ ఫ్లాట్ కొరకు 2 లక్షలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), ఆగస్టు 26:రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ లో ఫ్లాట్ కొరకు ఆసక్తి గల ఉద్యోగులు ఆగస్టు 30 లోపు 2 లక్షల రూపాయలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ పై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు 9 ఎకరాల 22 గుంటలలో నిర్మించిన 8 టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ఫ్లాట్ లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం నిర్వహించామని, గజం భూమి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. జలజ టౌన్ షిప్ లో ఉన్న 8 టవర్లు ఉద్యోగులకు లాటరీ పద్ధతిన అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సొంత ఇళ్ళు కావాలని ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొని తమ కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూ తో టవర్స్ బాగా ఉన్నాయని, ఖమ్మం నగరంలో అభివృద్ధి త్వరగా జరిగే ప్రాంతంలో ఈ టవర్లు ఉన్నాయని తెలిపారు.ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి వల్ల రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుందని, మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద ముంపు ఇకపై ఉండదని అన్నారు. టౌన్ షిప్ వద్ద 60 అడుగుల రోడ్డు, జలజ టౌన్ షిప్ కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆసక్తి గలవారు ఫ్లాట్ పొందవచ్చని అన్నారు.రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జలజ టౌన్ షిప్ లో 9.22 ఎకరాల విస్తీర్ణంలో 8 టవర్ లలో మొత్తం 576 ప్లాట్స్ నిర్మించడం జరిగిందని అన్నారు. చదరపు గజానికి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. భవన నిర్మాణ నాణ్యతలో ఎటువంటి లోపాలు లేవని అన్నారు. జలజ టౌన్ షిప్ లోని ప్లాట్లు ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆసక్తి గల ఉద్యోగులు ఫ్లాట్ కోసం రెండు లక్షల రూపాయలు చెల్లించి సెప్టెంబర్ 8న జరిగే లాటరీలో పాల్గొన్నాలని అన్నారు. లాటరీ విధానం ద్వారా టౌన్ షిప్ అలాట్ మెంట్ జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ధర చదరపు గజానికి 1150గా నిర్ణయించిందని, మనం కొనుగోలు చేసి మరో 1100 రూపాయలు ఖర్చు చేసుకుంటే అన్ని సౌకర్యాలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందని అన్నారు.టిజిఓ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ టౌన్ షిప్ లో ఫ్లాట్ కొనుగోలు చేయడం వల్ల జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఉద్యోగులకు బ్యాంకర్లు రుణాలు అందించేందుకు కూడా సుముఖంగా ఉన్నారని అన్నారు. ఉద్యోగులు ప్రస్తుతం రెండు లక్షల రూపాయలు చెల్లించి బుక్ చేసుకుంటే తర్వాత మనకు బ్యాంకు రుణాలు దొరుకుతాయని అన్నారు. జలజ టౌన్ షిప్ లో ఇప్పటి వరకు 76 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన ఇండ్ల కోసం ఆసక్తి గలవారు రెండు లక్షల రూపాయలు చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలని అన్నారు. టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ అసోసియేషన్, హౌజింగ్ బిల్డింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూములు ఇవ్వవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల దృష్ట్యా, ఉద్యోగస్తుల సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ లో ఉన్న 576 ఫ్లాట్ లను 1150 రూపాయలకు అందించాలని నిర్ణయించామని అన్నారు.మరో 1350 రూపాయలు చదరపు గజానికి చెల్లిస్తే పెండింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయడంతో పాటు ఫ్లాట్ అందించడం జరుగుతుందని అన్నారు. 28 లక్షలతో ఒక ఫ్లాట్ మనకు వస్తుందని ఆసక్తి గల ఉద్యోగులు త్వరగా తమ పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ఉత్సవ కమిటీ జామ్ గ్రామం అధ్యక్షులుగా కరిపే విలాస్



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 (భారత శక్తి):సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలో జరిగే వినాయకచవితి దృష్టిలో పెట్టుకొని 70 మంది యువకులతో హిందూ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ అధ్యక్షులుగా కరిపే విలాస్, ఉపాధ్యక్షులుగా దాసరి ప్రశాంత్, ప్రధానకార్యదర్శి జంగం నవీన్, ప్రచార కార్యదర్శులుగా తిరుమలచారి, పొలాస మధుకర్,అల్లాడి నర్సయ్య, తాండ్ర అవిందర్, సలహా సభ్యులుగా ధని గణేష్, వాసాల నవీన్,సామల దిలీప్, దర్శనం లక్ష్మణ్,బొడ్డు లక్ష్మణ్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది .

## అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్కు వినతిపత్రం అందజేత.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అగస్ట్ 26: అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సోమవారం కుబీర్ మండల తహసీల్దార్ శివరాజు కు తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు గఫూర్ రోద్దీన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎన్నో సంవత్సరాలనుండి వివిధ పత్రిక లో పనిచేస్తున్న వారు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురుకోవడం జరుగుతుందని. అద్దె భావనలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దింతో ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్క ఇండ్లు నిర్మించేలా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు గపూ రోద్దీన్, మరియు విఠల్, రవికుమార్, మోహినొద్దీన్ తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది :ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఆగష్టు 26: మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.సంగారెడ్డి పట్టణంలోని 31,32 వార్డులో వన మహోత్సవం కార్యక్రమాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. మాజీ సి డి సి చైర్మన్ బుచ్చిరెడ్డి , మాజీ కౌన్సిలర్ రామప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డు ప్రజలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు.కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని చింత ప్రభాకర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, విఠల్ రెడ్డి, బత్తుల శ్రీనివాస్, నవీన్,వార్డు మహిళలు ఉన్నారు.

## బోనకల్ షైన్ హై స్కూల్ లో వినాయక చవితి సంబరాలు.



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), ఆగష్టు 26:షైన్ హై స్కూల్ లో వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిపారు.చిన్నారులు కూరగాయలు, పండ్లు, పప్పులు, మట్టి, పసుపు, పిండి, చెక్క తోటి అనేక రకాల బుజ్జి గణపతుల్ని తయారు చేసారు..ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ వినాయక చవితి గొప్పతనాన్ని వివరిస్తూ చిన్నారులను అభినందించారు అలాగే పిల్లల్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు...ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# దళారుల జోక్యం లేకుండా నేరుగా ప్రజలకు సాండ్ బజార్ నుండి ఇసుక ను సరఫరా

### ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నాణ్యమైన ఇసుక ను అందించటమే లక్ష్యం

### ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక సరఫరా

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఆగష్టు 26: సంగారెడ్డి జిల్లా పరిధిలో,ఆందోల్ నియోజకవర్గంలో, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగుపేట %-% జోగిపేట చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ను మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరసమైన ధరలో అందించడం ప్రభుత్వ ప్రాధాన్య కర్తవ్యం. దళారుల బెడద లేకుండా, పారదర్శక పద్ధతిలో, నేరుగా ప్రజలకు ఇసుక అందించేందుకు ప్రభుత్వం సాండ్ బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .ఇసుక తరలింపు వాహనాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా నిర్వహించారు.ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో సాండ్ బజార్లు,ఆందోల్ నియోజకవర్గం సహా జిల్లాలో ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో ఒక సాండ్ బజార్ ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీని వలన ప్రజలు తక్కువ దూరంలోనే అవసరమైన ఇసుకను సులభంగా పొందగలరని ఆయన పేర్కొన్నారు.ఇళ్ల నిర్మాణం, ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.సంగారెడ్డి జిల్లాలో సహజసిద్ధమైన ఇసుక రీచ్లు లేవు. ఈ కారణంగా ఇక్కడి ప్రజలు ఇప్పటివరకు అధిక ధరలకు, మధ్యవర్తుల ద్వారా ఇసుక కొనుగోలు చేయవలసి వచ్చేది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సాండ్ బజార్లను ఏర్పాటు చేసింది.ఇకపై లబ్ధిదారులు, గృహనిర్మాణదారులు తక్కువ ధరలో, నాణ్యమైన ఇసుకను ఈ బజార్ల ద్వారా పొందవచ్చని మంత్రి తెలిపారు.ఇసుక కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అయిందన్నారు.సాండ్ దళారుల బెడదను పూర్తిగా అరికట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ఇసుక సరఫరా ప్రక్రియలో ఎవరైనా దళారుల మాదిరిగా వ్యవహరించినా, వారిపై కఠిన



చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మైనింగ్ కార్పొరేషన్, రెవెన్యూ, హౌసింగ్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక సరఫరాను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రభుత్వం తరపున మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం లో ఇసుక కొరత సమస్య రాకూడదు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారికి కావలసినంత ఇసుక సాండ్ బజార్లలో నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి అని మంత్రి అధికారులను ఆదేశించారు.సాండ్ బజార్ల ఏర్పాటు వలన స్థానిక కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చిన్న కాంట్రాక్టర్లు, మేస్త్రీలు కూడా నాణ్యమైన ఇసుకను సులభంగా పొందగలరని అధికారులు తెలిపారు.ఇసుక సరఫరా ఆన్లైన్లోనూ పర్యవేక్షణ జరుగుతుందని, ఎవరైనా అక్రమ రవాణా చేస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో టీజీఎండిసి ఎండి భవేష్ మిశ్రా , జిల్లా అదనపు ( స్థానిక సంస్థలు)కలెక్టర్ చంద్రశేఖర్ , జిల్లా. మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబు,జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి , మార్కెఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి , పిఎసిఎస్ ఛైర్మన్ నరేందర్ రెడ్డి , హౌసింగ్ , రెవిన్యూ , పోలీస్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

# ఉపాధి వనరుల ఖిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### లి కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తో కలిసి కొప్పర్తిలో ఏపీఐఐసీ మెగా ఇండస్ట్రియల్ హబ్ పరిశీలనలి





కడప, ఆగస్టు 26 : జిల్లాలో ప్రధాన ఉపాధి వనరుల ఖిల్లాగా కొప్పర్తి ఏపీఐఐసీ మెగా ఇండస్ట్రియల్ హబ్ వెలుగొందుతోందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కొరత లేదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు.మంగళవారం కొప్పర్తి లోని దాదాపు 600 ఎకరాల్లో ఏర్పాటైన మెగా ఇండస్ట్రియల్ హబ్ లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తోకలిసి పరిశీలించారు.సెప్టెంబర్ 2న రాష్ట్ర విద్యాశాఖ, ఐటి శాఖామంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్బంగా.. కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ గెస్ట్ హౌస్ ను అలాగే.. నూతనంగా ఏర్పాటైన "టెక్నో డోమ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్", రెడీమేడ్ సూట్స్ తయారు చేసే "టెక్సానా ఇండియా ప్రయివేటు లిమిటెడ్" పరిశ్రమల్లో ప్రొడక్షన్ ను మంత్రిచే ప్రారంభోత్సవం చేయించే యోచనలో జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా.. అధునాతన సదుపాయాలతో నిర్మితమైన ఎగ్జిక్యూటివ్ గెస్ట్ హౌస్ తోపాటు ఆయా పరిశ్రమల యూనిట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మంత్రిచే ప్రారంభోత్సవం చేయడానికి తగిన ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో కలిసి సంబందిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అంతేకాకుండా అక్కడ అవసరమైన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించారు.ఈ సందర్భంగా మెగా ఇండస్ట్రియల్ పార్కులో నిర్వహణలో ఉన్న ఎల్ఈడి మానిటర్ల ఉత్పత్తి కంపెనీ "టెక్నో డోమ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్", రెడీమేడ్ సూట్స్ తయారు చేసే "టెక్సానా ఇండియా ప్రయివేటు లిమిటెడ్" పరిశ్రమలను అక్కడి ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ తయారువుతున్న ఎల్ఈడి మానిటర్లు, రెడీమేడ్ సూట్ ల నాణ్యతతో పాటు అక్కడ సిబ్బంది, సదుపాయాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సలహాలు, సూచనలు ఇస్తూ.. ఇక్కడ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, సదుపాయలకు సంబందించి ఎలాంటి అవసరాలు వున్నా తమకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మంచి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆ దిశగా కొప్పర్తి పారిశ్రామిక వాడను.. రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తోందన్నారు. అందులో భాగంగంగానే.. కొప్పర్తి పారిశ్రామిక వాడలో జిల్లాకే తలమానికంగా "ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)" క్లస్టర్ లో పరిశ్రమలు రూపు దిద్దుకుంటున్నాయన్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూపుదిద్దుకుంటున్నాయని.. దీంతో జిల్లా యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కాంట్రాక్టర్లకు, పెట్టుబడిదారులకు మంచి అవకాశాలు పెరగనున్నాయని.. భవిష్యత్తులో జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధిలోకి రానుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, ఏపి ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జీఎం చాంద్ బాషా, సికె దిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావు, సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10 వేల 7వందల ఇరవై మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా: డి ఏ ఓ సురేష్ కుమార్

ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26 (భారత శక్తి) : జిల్లాలో గత సంవత్సరం 10 వేల 20 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా కాగా, ఈ సంవత్సరము 10 వేల 7వందల 20 మెట్రిక్ టన్ను యూరియా సరఫరా చేయటం జరిగిందని మంగళ వారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు.రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ల సూచనలు మేరకు ములుగు జిల్లాకి ఈనెల 27న 5 వందల మెట్రిక్ టన్నులు, 31న మరో 5 వందల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు సిద్ధం చేశామనిపేర్కొన్నారు.అదేవిధంగా వచ్చేనెల కావలసిన 4వేల మెట్రిక్ టన్నులు ములుగు జిల్లాలోని రైతులకు సరఫరా చేయుటకు ఏర్పాట్లు చేశామని రైతులు ఎవరూ



కూడా యూరియా కొరకు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## యూరియా కష్టాలు.. రైతన్నకు తప్పని తిప్పలు



జిన్నారం, భారత శక్తి ప్రతినిధి, ఆగస్టు 26 : సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో యూరియా ఎరువుల కోసం మంగళవారం ఉదయం రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్థానికంగా ఉన్న రెండు ఫర్టిలైజర్ షాపుల్లో పెద్ద ఎత్తున రైతులు పడిగాపులు కాశారు. ఆయా గ్రామాల నుంచి రైతులు రావడంతో దుకాణాల ముందు రద్దీ ఏర్పడింది. ఎరువుల కొరత కారణంగా రైతులు ఎక్కువసేపు క్యూల్లో నిలబడి ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోయారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొని సకాలంలో యూరియా సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాబోయే వానాకాలం పంటలు నష్టపోకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు స్థానికులు పాల్గొన్నారు.

## సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, ఆగస్టు 26: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము జనహిత గణేష్ మండలి 9వ వార్షికోత్సవమును పురస్కరించుకొని ఈరోజు తేదీ. 26.08.2025 మంగళవారం రోజున జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము నందు కార్యాలయ ఉద్యోగులకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై వారి చేతుల మీదుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయపు ఉద్యోగులకు మట్టి గణపతుల పంపిణీ చేయడం జరుగును.అనంతరం ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము జనహిత గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమం చేపట్టాలని శుభాకాంక్షలు తెలుపుతూ, పర్యావరణహితమైన మట్టి గణపతి లను పూజించడం మంచి సాంప్రదాయమని.. అదేవిధంగా జిల్లా ఉద్యోగులకు, జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా టీజీఇజెఎసి చైర్మన్, టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కామారెడ్డి జిల్లా టీజీఇజెసి ప్రధాన కార్యదర్శి, జిల్లా టీజీవోస్ సంఘం అధ్యక్షులు దేవేందర్,టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఎం నాగరాజు, వారి కార్యవర్గ సభ్యులు, టీజీఓస్ జిల్లా కార్యదర్శి సాయి రెడ్డి, వారి కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కామారెడ్డి జిల్లా టిఆర్ఇఎస్ఎ కార్యవర్గ సభ్యులు, జిల్లా క్లాస్ ఫోర్ సంగం కార్యవర్గ సభ్యులు,సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము జనహిత గణేష్ మండలి కార్యవర్గ సభ్యులు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయపు ఉద్యోగులు పాల్గొన్నారు.

## భైంసా పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు ముందస్తు వినాయక చవితి ఉత్సవాలు.



భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26: భైంసా పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో చిన్నారులు గణపతి వేషధారణలో అలరించారు. పర్యావరణ పరిరక్షణకు ముందంజగా, వారు మట్టి విగ్రహమే ముద్దు %-% ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు అనే సందేశాన్ని అందించారు.చిన్నారుల అద్భుతమైన ప్రదర్శనతో, కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## డ్రైవర్ ను హత్య చేసి ఇంటికి డోర్ డెలివరీ చేసిన కేసులో నిందితుడు అనంత బాబు భార్యకు నోటీసులు

విజయవాడగతంలో రాష్ట్ర వ్యాప్తంగా సంచనం సృష్టించిన డ్రైవర్ సుబ్రమణ్యం కేసులో కోర్టు ఆదేశాల మేరకు సిట్ అధిక్ఆరులు మరల విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితుడు అనంత బాబు భార్య రాజ్యలక్ష్మికి నోటీసులు జారీ చేసారు.

భారత శక్తి
27-8-2025 , బుధవారం

# మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26 (భారత శక్తి) : వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుచున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను వీడి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జితో కలసి వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణం పై అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగాంగ 8 అంగుళాల మట్టి గణపతి లను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో మట్టి మేటలని తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలాని మట్టి తో వినాయక విగ్రహాలు తాయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాలుష్య నియంత్రణ మండలి ఏ ఈ ఎం సుభాష్ నాయక్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దేశ్య పూర్వకముగా పొలములో రోడ్డు నిర్మాణం అమానుషం - రైతు ఆవేదన

### ఒక వ్యక్తి కక్ష పూరితముగా చేస్తున్న కుట్రకు

### రెవిన్యు వారు ఒత్తాసు %-%రైతు చంద్ర మోహన్



పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, ఆగస్టు 26: కలసపాడు మండలం మహానంది పల్లె పంచాయతిలో మామీల్లపల్లె గ్రామ పోలములోని సర్వ్ నంబర్ .12,4,5,లో విస్తీర్ణం మొత్తముగా 2-23 సెంట్లు భూమిని రైతు బత్తుల చంద్ర మోహన్ తండ్రి సిద్దయ్య పూర్వపు పెద్దల నుండి సంక్రమించిన రిజిస్టర్ పట్టా భూమిని సాగు చేసుకుంటూ కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారు అయితే ఇటీవల బక్కిరేడ్డి నారాయణ రెడ్డి తండ్రి కొండారెడ్డి మా దాయాదుల భూమి 0.75 సెంట్లు కొనుగోలు చేసి 0.90 సెంట్ల భూమి ఉన్నట్లుగా రిజిస్టర్ చేసుకున్నాడు 0.75 సెంట్ల భూమి అయితే 0.95 సెంట్ల ఎలా రిజిస్టర్ చేసారు అని ప్రశ్నించగా సరే నీ కథ ఇలా ఉందా అని మీ పని చెప్తా అని రెవిన్యు వారి ప్రోద్బలముతో వారి భూమిలో 34 లింకులు గల రోడ్డు పోతుందని నట్ట నడి మధ్య పొలములో జే సి బి తో దారి చేసారు, దారి చేసి పంట వేసుకోనివ్వడం లేదని రైతు వాపోయాడు కేవలం వారి పోలములోనే దారి తీయడం అమానుషమని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ఆ పోలములోనే పంటలు వేసుకుంటూ జీవనోపాది జరుపుకుంటున్నామన్నారు వాస్తవముగా వారి చేనుకు పక్క బాగమున మంచిగా తెలుగు గంగ కాలువ అనుకోని చేనులలోకి వెళ్ళుటకు గ్రావెల్ రోడ్డు కలదు కేవలం వారి భూమిలోనే రోడ్డు ఎందుకు వేసారని పై నుండి ఎక్కడ రోడ్డు పనులు గాని రాస్తా ఏర్పాటు గాని జరుగ లేదు మేము నష్ట పోతాము అని రైతు అడుగగా కలసపాడు రెవిన్యు డిపార్టుమెంటు వారు సర్వేయర్,వి ఆర్ ఓ లూ వచ్చి పూర్వము బ్రిటిషు వారు ఏర్పాటు చేసిన రోడ్డు కలదు అందుకే దారి చేస్తున్నామని బదులిచ్చినారు కేవలం మా పోలములోనే రోడ్డు జేసిబి ద్వారా తీసి పంట వేసుకోకుండా నష్టం చేసారని రైతు లబో దిబో మంటున్నాడు వాస్తవమునకు పై నుండి రస్తా చేయకుండా చిట్ట చివరిలో ఉన్న బాదిత రైతు భూములోనే రాస్తా తీయడము అమానుషమైన చర్య అని అయన ఆవేదన వ్యక్తము చేస్తున్నారు అన్ని చేలలో దారి తీసి మా చేనులో కూడా దారి తీస్తే సంతోషమే మాకు ఎలాంటి అభ్యంతరము లేదు కేవలము ఒక వ్యక్తి కక్ష పూరితముగా చేస్తున్న కుట్రకు రెవిన్యు వారు ఒత్తాసు పలకటము ఏంటి అని రైతు ప్రశ్నిస్తున్నాడు ఇలాంటి కక్ష పూరిత చర్య తక్షణమే నిలుపుదల చేయకపోతే మాకు ఆత్మహత్యే శరణ్యం అంటూ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేచి చూడాలి రెవిన్యు సిబ్బంది ఆ రైతు కి ఎటువంటి న్యాయం మరియు ఎటువంటి చర్యలు తీసుకుంటారో ?

# పూడికతీత అవినీతిని సిఎం దృష్టికి తీసుకెళ్తాం.! - మణుగూరు ముంపుకు గురి కాకుండా కాపాడుకుంటాం

### -ఇప్పటికే కలెక్టర్ కు ఫిర్యాదు

### -రేణుక అక్షర మహిళా మండలి

మణుగూరు, ఆగస్టు 26 (భారతశక్తి): కొద్దిపాటి వర్షానికే పట్టణంలోని మున్సిపాలిటీ ఏరియాలో కొన్ని కాలనీలు వరద నీరుతో ముంచెత్తుతున్నాయని రేణుకా అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు వస్తున్నారు.. ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయినా ప్రతి సంవత్సరం చిన్న వర్షపాతానికి ముంపు గురవుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సంవత్సరం కూడా వర్షాలకు మణుగూరు ముంపునకు గురి కాకుండా స్థానిక ఎమ్మెల్యే అనుచరులు చేపట్టిన పనుల్లో పురోగతి కన్పిచడం లేదని మండిపడ్డారు. లక్షల్లో నిధులు వెచ్చించిన పనుల్లో జాప్యం చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని మహిళా మండలి సభ్యులు ఆరోపించారు. కొన్ని చోట్ల అసలు పనులు చేయకుండానే కాల్వల్లో పూడికతీత పనులు చేశామని డబ్బులు తమ ఖాతాలో కాంట్రాక్టర్లు వేసుకుంటున్నారని ఆమె ఆరోపించింది. మూడు సంవత్సరాలుగా కాల్వల పూడికతీత పనులు చేపడుతూ తాత్కాలికంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకొంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని మహిళ మండలి సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కోట్లాది రూపాయలతో తాత్కాలిక పనులు తూతూ మంత్రంగా చేస్తూ.. మణుగూరు ను ముంపుకు గురికాకుండా చేసే చర్యల్లో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. చాలా చోట్ల పనులు చెయ్యకుండా అలానే



వదిలేశారని తెలిపారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు కూడా మౌనం వహించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మణుగూరులో జరిగిన పనులలో అవినీతిని వివరిస్తామని మీడియాకు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ జితేష్ పాటిల్ దృష్టికి తీసుకెళ్ళామని తెలియజేశారు. మణుగూరు ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని సిఎం ను కోరతామని వెల్లడించారు. అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్ పై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. గత పాలకులు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి మోడల్ జర్నలిస్ట్ కాలనీలు కట్టిస్తామని హామీలు ఇచ్చి విస్మరించారని తెలిపారు. రేవంత్ సర్కార్ లోనైన ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళ మండలి సభ్యులు కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, రేణుక, నాంపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

### - ఎన్ఎస్ఎస్ కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), ఆగస్టు 26: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్ఎస్ఎస్ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ పథకం ఆధ్వర్యంలో చేయబోయే కార్యక్రమాలను గురించి వివరించారు. అదేవిధంగానవ సమాజ నిర్మాణంలో విద్యార్థినుల పాత్రను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, సమాజం పట్ల తమ బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి అనే అంశాలపై విద్యార్థినులకు స్పష్టతనిచ్చి. వారిని సేవా కార్యక్రమాలపట్ల ప్రోత్సహించారు. . ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, మాట్లాడుతూ... విద్యార్థినిలకు ఎన్ఎస్ఎస్ యొక్క ఉద్దేశాలు, ప్రాముఖ్యత, విద్యార్థుల పాత్రపై సమగ్ర అవగాహన కల్పించారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారిగా భౌతిక శాస్త్ర అధ్యాపకులు పి. చంద్రకళ యూనిట్-2 ప్రోగ్రామ్ అధికారిగా జంతు శాస్త్ర అధ్యాపకులు జి. వెంకటేశ్వర్లు నియమించబడ్డారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, డి. రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బైంసా మహాదేవ మందిరం సిసి రోడ్డు పనుల్లో నాణ్యత లోపాలు

### - అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం





భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26: బైంసా పట్టణంలోని శివారులో ఉన్న మహాదేవ ఆలయానికి చెందిన ప్రధాన రహదారిపై చేపడుతున్న సిసి రోడ్డు పనుల్లో నాణ్యత తీవ్రంగా నష్టపోతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ నిర్మాణ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకకు బదులుగా కంకర మిషన్ (బ్లాక్) పౌడర్ వాడటం తీవ్ర దుమారానికి దారి తీస్తోంది. ఈ పనులకు ఆర్ అండ్ బి శాఖ డిప్యూటీ ఇంజనీర్ సునీల్ కుమార్ ప్రత్యక్షంగా హాజరైపర్యవేక్షణ చేస్తున్నా, నాణ్యత లోపాలపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్‌ను పట్టించుకోకుండా పనులు సాగిపోతుండటంతో అధికారులు తమ బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. సుమారు 60 లక్షల రూపాయల బడ్జెట్‌తో జరుగుతున్న ఈ ప్రాజెక్టులో మౌలిక ప్రమాణాలను పట్టించుకోకుండానే పని చేయడం దారుణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా చూసేందుకు ఉన్నతాధికారులు వెంటనే చొరవ చూపి, స్థల పరిశీలన చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని దృష్టిలో పెట్టుకుని, సంబంధిత శాఖలు స్పందించి దోషులను తేల్చాలని, అవసరమైతే పనులను తాత్కాలికంగా నిలిపివేసి నాణ్యత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్ అండ్ బి శాఖ డిప్యూటీ ఇంజనీర్ సునీల్ కుమార్ ను సిసి రోడ్డుకు సంబంధించిన పనుల వివరాలు ఫోన్ ద్వారా సంప్రదించగా ఫోను రిసీవ్ చేయలేకపోయారు.. ఏది ఏమైనా జిల్లా ఉన్నత అధికారులు ఎలాంటి పనులపై అధికారులు మీద మరియు సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

# భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఆగష్టు 26: లిశాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్‌లి మండలంలోని వివిధ గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా శాయంపేట మండల తహసీల్దార్ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను స్థానిక తహసిల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా భూభారతి దరఖాస్తులు ఎన్ని వచ్చాయని, అందులో ఎన్నిటిని ఆమోదించారని, ఎన్ని దరఖాస్తులు తిరస్కరణ అయ్యాయని తహసీల్దార్, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులలో ఏ ఏ కారణాల చేత తిరస్కరణ అయ్యాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తిరస్కరణ అయిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేయాలని, ఏయే ఆధారాలతో భూమిపై ఉన్నారనే వివరాలను విచారించాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలని, ప్రతిరోజు పురోగతి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో మాట్లాడి వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ







సరూర్నగర్,భారతశక్తి ప్రతినిధి,ఆగష్టు26:ఉచిత మట్టి వినాయక విగ్రహాలు ఎన్విరాంమ్మెంట్ వారి ఆధ్వర్యంలో కొత్తపేట్ చౌరస్తా లో పంపిణీ చేసారు. ప్రతి సంవత్సరం ఈ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణి చేస్తున్నారు. మట్టి విగ్రహాల వల్ల కాలుష్యం బారిన పడకుండా చూడటమే ముఖ్య ఉద్దేశం అని ఉచిత మట్టి విగ్రహాల పంపిణి దారుడు ఉప్పల వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమం లో సుధాకర్ రావు, వెంకటేష్, భాస్కర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి శిక్షణలు అందించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 26 : మహిళలు విభిన్న రంగాల్లో స్వయం ఉపాధి పొందేలా శిక్షణలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం చించోలి సమీపంలోని మహిళా ప్రాంగణంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రాంగణంలో సర్పంచ్‌లు, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు, మహిళా సంఘాలు, కిశోర బాలికలు తదితరులకు అనేక శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయని, అలాగే పీఎం విశ్వకర్మ పథకం కింద బ్యూటీషియన్, కంప్యూటర్, కుట్టు రంగాల్లో శిక్షణలు పూర్తయ్యాయని మహిళా ప్రాంగణం% జిల్లా మేనేజర్ విజయలక్ష్మి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్వయం ఉపాధి కల్పించేలా మహిళలకు కుట్టుమిషన్, అల్లికలు, టైలరింగ్, బ్యూటీ పార్లర్, పేపర్ బ్యాగ్ తయారీ, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్ వంటి రంగాల్లో శిక్షణలు ఇవ్వాలని ఆదేశించారు. మండలాల వారీగా ఆసక్తి గల మహిళలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేపట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి, అధిక సంఖ్యలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు విజయలక్ష్మి, మోహన్ సింగ్, నరసింహారెడ్డి, శంకర్, సిడిపిఓ సరిత, మహిళా ప్రాంగణ%శీ% అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాట ప్రకారం మెగా డీఎస్సి నిర్వహణ

-నిరుద్యోగులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం
-సంస్కరణల అమలు...బడులకు నూతన వెలుగులు
-ఏడాదికో డిఎస్సీ పేరిట దగా చేసిన జగన్ రెడ్డి
-మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

తిరుపతి జిల్లా ప్రతినిధి/ పలమనేరు, ఆగస్టు 26 (భారత శక్తి ):- యువతకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక ప్రతి ఏటా మెగా డీఎస్సీని నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామని అన్నారు. దీంతో ఎస్సీ,ఎస్టీ, బీసీ,ఈడబ్ల్యూఎస్ మరియు దివ్యాంగ అభ్యర్థులకు వయసు మినహాయింపు ఇచ్చి వారికి అండగా నిలబడ్డామన్నారు. యువత బాగుపడటం ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించారని వాటన్నిటిని అధిగమించి మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నారని నారా లోకేష్ ను కొనియాడారు. చంద్రబాబు తన 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో దాదాపు 13 డీఎస్సీలు నిర్వహించి లక్ష ఎనభై వేలకుకు పైగా పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులలో అధిక శాతం ఆయన హయాంలో ఉద్యోగాలు పొందిన వారేనన్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ ఇస్తానని మాట ఇచ్చిన జగన్ రెడ్డి గత ఎన్నికలకు రెండు నెలల




ముందు డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేశాడన్నారు. ఇక ప్రతి ఏడాది డీఎస్సీ అని అధికారం చేతుల్లో ఉన్నప్పుడు ఒక డీఎస్సీ కూడా ప్రకటించకుండా మెగా,,జంబో,మినీ డీఎస్సీ అని కాలం గడిపేసి నిరుద్యోగులను జగన్ దగా చేశారని విమర్శించారు.

# రోహిత్ శర్మను తప్పించడానికే బ్రాంకో టెస్ట్: టీమ్ ఇండియా మాజీ క్రికెటర్

: టీమ్ఇండియా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను తేల్చేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న యోయో పరీక్షతో పాటు బ్రాంకో టెస్టునూ ఇకపై బీసీసీఐ ప్రవేశ పెట్టనుంది. ఈ నిర్ణయంపై పలువురు మాజీల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. అయితే టీమ్ఇండియా ఆటగాళ్లలో ఫిట్‌నెస్ ప్రమాణాలను పెంచడం కోసం స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అడ్రియన్ లి రాక్స్ ఈ పరీక్షను జట్టుకు పరిచయం చేశాడు. అంటే ఇకపై ఓ ఆటగాడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడని ధ్రువీకరించాలంటే అతడు యోయోతో పాటు బ్రాంకో టెస్టులోనూ పాసవ్వాల్సి ఉంటుంది. అయితే.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పించడానికే ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టారని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తీవ్రమైన ఆరోపణలు చేశాడు.

విరాట్ కోహ్లీ ( రోహిత్ శర్మ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వీరిద్దరూ వన్డే ఫార్మాట్లోనే కొనసాగుతున్నారు. వీరు 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడదామనుకుంటున్నారు. అయితే రోహిత్ శర్మకు బ్రాంకో టెస్ట్ పాస్ కావడం కాస్త కష్టంతో కూడుకున్న పని అని మనోజ్ తివారీ ఓ ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డాడు. 'నా ఉద్దేశం ప్రకారం 2027 వరల్డ్ కప్ ప్రణాళిక నుంచి విరాట్ కోహ్లీని పక్కకు పెట్టడం అంత సులువు కాదు. కానీ వారు రోహిత్ శర్మను తప్పించాలనుకుంటున్నారు. ఇండియన్ క్రికెట్‌లో ఏం జరుగుతుందో నేను సునిశితంగా పరిశీలిస్తున్నా. రోహిత్ శర్మను భవిష్యత్తులో వన్డే జట్టు నుంచి దూరం చేయడం కోసమే ఇటీవల బ్రాంకో టెస్ట్‌ను



ప్రవేశపెట్టారు' అని మనోజ్ తివారీ ఆరోపించాడు.

'మీకు తెలుసా.. బ్రాంకో టెస్ట్ అత్యంత కఠినమైన ఫిట్‌నెస్ పరీక్షల్లో ఒకటి. అయితే ఈ టెస్ట్‌ను ఇప్పుడే ఎందుకు ప్రవేశపెట్టారనేదే ప్రశ్న. కొత్త హెడ్‌కోచ్ ఈ పరీక్షను మొదటి సిరీస్ నుంచే ఎందుకు అమలు చేయలేదు? అసలు ఇది ఎవరి ఆలోచన? దీన్ని ఎవరు ప్రవేశపెట్టారు? కొన్ని రోజుల క్రితం ఈ బ్రాంకో టెస్ట్‌ను ఎవరు అమలు చేశారు? ఇవి నా దగ్గర సమాధానాలు లేని ప్రశ్నలు. కానీ రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్‌పై మరింత దృష్టి పెట్టకపోతే.. ఈ టెస్ట్ పాసవడం అతడికి అంత తేలిక కాదు. ఈ బ్రాంకో టెస్ట్‌తో.. రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి తప్పిస్తారని నేను భావిస్తున్నా' అని మనోజ్ తివారీ వాపోయాడు.

బ్రాంకో అంటే పరుగు పరీక్ష. ఎక్కువగా రగ్బీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను నిర్ణయించేందుకు ఉపయోగిస్తారు. దీని ద్వారా ప్లేయర్ల శారీరక సామర్థ్యం, వేగం, మానసిక దృఢత్వంపై ఓ అంచనాకు రావొచ్చు. ఈ పరీక్షలో ఒక ఆటగాడు విరామం లేకుండా ఆరు నిమిషాల వ్యవధిలో మొత్తంగా 1200 మీటర్ల దూరం పరుగెత్తాల్సి ఉంటుంది.



# ఆసియా కప్‌లో టీమ్ఇండియానే ఫేవరెట్: శ్రీలంక మాజీ క్రికెటర్

: ఆసియా కప్‌లో టీమ్ఇండియానే ఫేవరెట్ అని శ్రీలంక మాజీ క్రికెటర్ ఫర్వేజ్ మహరూఫ్ అంటున్నాడు. అదే సమయంలో టీ20ల్లో ఏమైనా జరగొచ్చని, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా గెలిచే అవకాశం ఉందని అతడు చెబుతున్నాడు. ఇప్పటివరకు శ్రీలంక మొత్తం ఆరుసార్లు ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. అలాగే బంగ్లాదేశ్ 2012, 2016, 2018లో ఫైనల్స్‌కు చేరుకుంది. కానీ విజేతగా నిలవలేకపోయింది.

'టీమ్ఇండియానే ఆసియాకప్ టైటిల్ ఫేవరెట్. కానీ.. శ్రీలంక, బంగ్లాదేశ్‌లు అందరినీ విస్మయానికి గురిచేస్తూ గెలిచే అవకాశమూ ఉంది. టీమ్ఇండియా స్క్వాడ్ బలంగా ఉంది. కానీ ఇది టీ20 క్రికెట్. ఇక్కడ ఏదైనా జరగొచ్చు. ఎవరైనా ఛాంపియన్లుగా అవతరించొచ్చు' అని మహరూఫ్ ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. అలాగే భారతజట్టు బలాల గురించి కూడా అతడు విశ్లేషించాడు. 'అన్ని ఫార్మాట్లలోనూ భారత్‌కు చాలామంది ఆటగాళ్లు ఉన్నారు. రోహిత్ శర్మ ( టీ20ల నుంచి రిటైర్ అయ్యాడు. అతడి స్థానాన్ని భర్తీ చేయడానికి చాలామంది క్రికెటర్లు ఉన్నారు. ముఖ్యంగా ఐపీఎల్ వల్ల టీమ్ఇండియాకు ఎంతో మేలు జరుగుతోంది' అని మహరూఫ్ అన్నాడు. యశస్వి జైస్వాల్ గురించి కూడా మహరూఫ్ మాట్లాడాడు. 'యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌ను నేను ఆస్వాదిస్తా. అతడో యువ క్రికెటర్. జైస్వాల్ ఎప్పుడైతే పెద్ద స్కోర్లు చేస్తాడో.. అప్పుడు కచ్చితంగా టీమ్ ఇండియా విజయం సాధిస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ అతడు ప్రస్తుతం టీమ్ఇండియా స్క్వాడ్‌లో లేడు. అయినా జైస్వాల్ త్వరలోనే టీ20 జట్టులోనూ తన స్థానాన్ని సంపాదించుకుంటాడు' అని ఫర్వేజ్ మహరూఫ్ అన్నాడు.

అలాగే జస్‌ప్రీత్ బుమ్రా గాయాల గురించి కూడా అతడు వివరించాడు. 'బుమ్రా బౌలింగ్ యాక్షన్ యూనిక్. అతడు గతానికి ఇప్పటికీ ఎంతో మెరుగయ్యాడు. బంతిని ఇన్‌స్వింగ్, అవుట్ స్వింగ్ కూడా చేయగలుగుతున్నాడు. ఇప్పుడు ఉన్న బౌలర్లలో ఎవరు అత్యంత కఠినమైన బౌలర్ అని బ్యాటర్లను అడిగితే.. వారితో 90 శాతం మంది బుమ్రానే అని చెబుతారు. అయితే దురదృష్టవశాత్తూ అతడు తరచూ గాయాలపాలవుతున్నాడు. అతడి వర్క్‌లోడ్‌ను బీసీసీఐ దృష్టిలోపెట్టుకొని జాగ్రత్తగా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫాస్ట్ బౌలర్లు బంతిని సంధించిన ప్రతిసారీ తమ శరీర బరువుకు మూడురెట్ల భారాన్ని వారి వెన్ను, మోకాళ్లు, మడమల మీద వేసినట్లవుతుంది. అందుకే ఎక్కువగా గాయాలపాలయ్యే అవకాశం ఉంటుంది' అని మహరూఫ్ వివరించాడు.

యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ అఫ్గానిస్థాన్, హాంకాంగ్‌ల మధ్య జరగనుంది. సెప్టెంబర్ 10న టీమ్ఇండియా, యూఏఈ తలపడనున్నాయి.

# తెర వెనక ఏం జరిగిందో విరాట్ కోహ్లీ ఎప్పటికీ చెప్పకపోవచ్చు: టీమ్ఇండియా మాజీ క్రికెటర్

టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ) ఇంగ్లాండ్‌తో అయిదు టెస్ట్‌ల సిరీస్‌కు ముందు మే 12, 2025లో సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. నిజానికి అతడు ఇంగ్లాండ్ టూర్‌లో ఆడదామనే ఉద్దేశంతోనే రంజీ మ్యాచుల్లో కూడా పాల్గొన్నాడు. కానీ అకస్మాత్తుగా అతడు టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే అసలు కారణం ఏంటో.. విరాట్ కోహ్లీ ఎప్పటికీ చెప్పకపోవచ్చని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్నాడు.

'నిజానికి తెర వెనక ఏం జరిగిందో నాకైతే తెలియదు. ఆ విషయం విరాట్‌కే తెలుసు. కానీ అతడు ఆ విషయాన్ని ఎప్పటికీ బహిర్గతం చేయకపోవచ్చు. నాకు తెలిసి భగవంతుడు తనకు ఇచ్చిన దాంతో అతడు ఆనందంగా ఉన్నాడు. అలాగే కోహ్లీ ఆధ్యాత్మిక మార్గంలో కూడా పయనిస్తున్నాడు. ఎవరైతే ధార్మిక చింతనను అలవర్చుకుంటారో.. వారు ఏ విషయాన్నీ పెద్దగా పట్టించుకోరు. వర్తమానం మీదే ఎక్కువగా దృష్టిపెడతారు. వారు గతం గురించి కూడా మాట్లాడటానికి ఇష్టపడరు' అని మనోజ్ తివారీ విశ్లేషించాడు.

'విరాట్ కోహ్లీ మరో మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకు టెస్ట్ క్రికెట్



ఆడగలడు. నాతో సహా, ఫ్యాన్స్ అందరినీ అతడి రిటైర్మెంట్ నిర్ణయం షాక్‌కు గురిచేసింది. విరాట్ ఫిట్‌నెస్ గురించి మనందరికీ తెలుసు. అలాగే అతడు ఇంగ్లాండ్ సిరీస్ కోసం సన్నద్ధం అయ్యాడు. అయితే అసలు ఏం జరిగిందనే విషయం క్రికెట్ విశ్లేషకులకు కొంత తెలిసి ఉంటుంది. తన చుట్టూ ఉన్న వాతావరణం విరాట్‌కు నచ్చి ఉండకపోవచ్చు' అని మనోజ్ తివారీ పేర్కొన్నాడు.

విరాట్ కోహ్లీ... టీమ్ఇండియా తరఫున 123 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. 46.85 యావరేజ్‌తో 9,230 పరుగులు చేశాడు. వీటిలో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలున్నాయి. అలాగే 68 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందులో 40 మ్యాచుల్లో టీమ్ఇండియా విజయం సాధిస్తే, 17 టెస్టుల్లో ఓటమి పాలైంది. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే సిరీస్ ద్వారా అతడు మరోసారి బ్యాట్ పట్టే అవకాశముంది. విరాట్ చివరిసారిగా అంతర్జాతీయ వేదికపై.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో కనిపించాడు. ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్, ఆస్ట్రేలియాపై అద్భుతంగా రాణించాడు.

# కొత్త స్పాన్సర్ కోసం బీసీసీఐ అన్వేషణ

దిల్లీ: డ్రీమ్ 11 వైదొలగడంతో బీసీసీఐ కొత్త స్పాన్సర్ వేటలో పడింది. అయితే వచ్చే నెల ఆసియాకప్ లోపు స్పాన్సర్ ఖరారయ్యే అవకాశం కనిపించట్లేదు. డబ్బుతో ముడిపడి ఉన్న అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధిస్తూ ప్రభుత్వం కొత్త చట్టం తేవడంతో డ్రీమ్ 11.. టీమ్ఇండియా టైటిల్ స్పాన్సర్‌గా కొనసాగరాదని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. డ్రీమ్ 11తో ఒప్పందం ముగిసిన విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించాడు. "వేం వాళ్లతో కొనసాగలేం. కొత్త స్పాన్సర్ కోసం అన్వేషిస్తున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోంది" అని చెప్పాడు. భారత జాతీయ జట్లకు స్పాన్సర్‌గా ఏడాదికి రూ. 358 కోట్లతో డ్రీమ్ 11.. బీసీసీఐతో ఒప్పందం చేసుకుంది. అది ముగియడానికి ఇంకా ఏడాది సమయముంది. అయితే అర్ధంతరంగా ఒప్పందం నుంచి వైదొలిగినా డ్రీమ్ 11పై బోర్డు చర్యలు తీసుకునే అవకాశం లేదు. మరో గేమింగ్ సంస్థ మై11సర్కిల్ కూడా ఐపీఎల్ స్పాన్సర్‌గా వైదొలిగే అవకాశముంది. అయిదేళ్లకు గాను ఏడాదికి రూ. 125 కోట్లతో మై11సర్కిల్ ఒప్పందం చేసుకుంది.

# మీరాబాయికి స్వర్ణం

అహ్మదాబాద్: భారత అగ్రశ్రేణి వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను పునరాగమనంలో అదరగొట్టింది. రికార్డు బద్దలు కొడుతూ కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం గెలుచుకుంది. ఏడాది విరామం తర్వాత బరిలోకి దిగిన ఆమె సోమవారం మహిళల 48కేజీ విభాగంలో 193 కిలోలు ఎత్తి విజేతగా నిలిచింది. ఇది ఛాంపియన్‌షిప్ రికార్డు. గత రికార్డు కన్నా 14 కిలోలు ఎక్కువ. చాను స్నాచ్‌లో 84 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కిలోలు ఎత్తింది. మలేసియాకు చెందిన ఇరెన్ హెన్రీ (161కేజీ) రజతం నెగ్గగా.. వేల్స్ అమ్మాయి నికోల్ రాబర్ట్స్ (150) కాంస్యం సాధించింది. జూనియర్ విభాగంలో సౌమ్య దాల్వీ పసిడి పతకం గెలుచుకుంది. పురుషుల 60కేజీ విభాగంలో రిషికంఠ సింగ్ స్వర్ణం గెలుచుకున్నాడు. అతడు 271 కిలోలు (120o151) ఎత్తాడు.



# క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం.. ఇక మనమే గ్లోబల్ హబ్: ప్రధాని మోదీ

ఢిల్లీ, ఆగష్టు 26 (భారత శక్తి) : ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది" అని ఆయన వివరించారు. భారత్‌జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. "వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది" అని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## రొటీన్ సమావేశాలు వద్దు.. ప్రజల కోసం పనిచేయండి

**అమరావతి, ఆగష్టు 26 (భారత శక్తి) :** కేవలం సమావేశాలు నిర్వహించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని... బ్యాంకులు తమ నిర్ణయాలను ప్రజలు, రైతులు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో మాట్లాడుతూ, బ్యాంకర్లు తమ పనితీరును మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే సగం కాలం గడిచిపోయిందని, ఈ సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు సీజన్ చివరిలో రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం ఉండదని చంద్రబాబు అన్నారు. "రైతులకు అవసరమైనప్పుడు రుణాలు, ఇతర ఇన్‌పుట్‌లు అందించాలి. కాలం దాటిపోయాక ఇచ్చే రుణాలతో వారికి ఉపయోగం శూన్యం" అని ఆయన చెప్పారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకులు కూడా కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచించాలని, నూతన సంస్కరణలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా వంటి దేశాలకు సవాలు విసిరేలా ఎదుగుతోందని, ఈ అభివృద్ధిలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. సంపద సృష్టితో పాటు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. 2047 నాటికి భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాలన్న లక్ష్యంలో భాగంగా బ్యాంకులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు గానూ రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యం కాగా, జూన్ నాటికి రూ.94,666 కోట్లు మంజూరు చేసినట్లు బ్యాంకర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. వీటితో పాటు విద్యా రంగానికి రూ.252 కోట్లు, గృహ నిర్మాణ రంగానికి రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

## 30 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు..

**హైదరాబాద్, ఆగష్టు 26 (భారత శక్తి):** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈ నెల 30 నుంచి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుంది. దాదాపు ఐదు రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ సమావేశాల్లో కాళేశ్వరం నివేదికపైనే ప్రధానంగా చర్చ జరగనుండటంతో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. అయితే, ఈ నివేదికను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. విచారణ సందర్భంగా, అసెంబ్లీలో నివేదికపై చర్చ జరిపిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వం తరపున కోర్టుకు స్పష్టం చేశారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఒకవేళ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించింది. పూర్తి వివరాలతో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఐదు వారాలకు వాయిదా వేసింది.

## ఏటీఎంలపై బ్యాంకులకు ఆర్బీఐ కీలక ఆదేశాలు

**ఢిల్లీ, ఆగష్టు 26 (భారత శక్తి):** ఏటీఎంలలో రూ. 100, రూ. 200 నోట్లు దొరక్క ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా అన్ని ఏటీఎంలలో ఈ డినామినేషన్ నోట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని బ్యాంకులకు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ప్రజలు ఎదుర్కొంటున్న చిల్లర కష్టాలకు త్వరలోనే తెరపడనుంది. ఈ సమస్య కారణంగా చాలామంది చిన్న లావాదేవీలకు కూడా యూపీఐ చెల్లింపులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది చిరు వ్యాపారులు, సాధారణ ప్రజలపై ప్రభావం చూపుతోందని గుర్తించిన ఆర్‌బీఐ, ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ఈ ఆదేశాల ప్రకారం, ప్రతి ఏటీఎంలో కనీసం ఒక క్యాసెట్‌ను రూ. 100 లేదా రూ. 200 నోట్ల కోసం కేటాయించాలి. ఇందుకు అనుగుణంగా దశలవారీగా మార్పులు చేయాలని బ్యాంకులకు స్పష్టమైన గడువు విధించింది. సెప్టెంబర్ 30 నాటికి దేశంలోని 75 శాతం ఏటీఎంలు, 2026 మార్చి 31 నాటికి 90 శాతం ఏటీఎంలలో ఈ సౌకర్యం అందుబాటులోకి రావాలని స్పష్టం చేసింది. ఈ మార్పుల కోసం బ్యాంకులు కొత్తగా ఏటీఎం యంత్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం ఉన్న యంత్రాల సామర్థ్యాన్ని బట్టి వాటిలో చిన్న సర్దుబాట్లు చేస్తే సరిపోతుందని సూచించింది. ఆర్‌బీఐ తాజా ఆదేశాలతో ఇకపై ఏటీఎంలలో చిన్న నోట్ల లభ్యత గణనీయంగా పెరగనుంది.

## తెలంగాణకు హెచ్చరిక... నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు

**హైదరాబాదే, ఆగష్టు 26 (భారత శక్తి) :** తెలంగాణ రాష్ట్రాన్ని వర్షాలు ముంచెత్తనున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. కొన్ని జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన జారీ చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ఉదయం వాయవ్య బంగాళాఖాతం, ఒడిశా తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడింది. ఇది రానున్న రెండ్రోజుల్లో పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణలో మంగళ, బుధవారాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని అంచనా వేశారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం, ఈ రోజు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తూర్పు తెలంగాణలోని జిల్లాల్లో కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక రేపు ఖమ్మం, కొమురంభీం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని తెలిపింది. వీటితో పాటు ఆదిలాబాద్, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన నివేదికలో స్పష్టం చేసింది.

## సముద్రంలో శత్రువులకు చెక్.. నౌకాదళంలోకి రెండు స్వదేశీ యుద్ధనౌకలు

**ఢిల్లీ, ఆగష్టు 26 (భారత శక్తి) :** భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానం మరోసారి తన సత్తాను చాటింది. దేశీయంగా నిర్మించిన రెండు అత్యాధునిక నీలగిరిక్లాస్ స్టెల్త్ యుద్ధనౌకలు 'ఐఎన్ఎస్ హిమగిరి', 'ఐఎన్ఎస్ ఉదయగిరి' మంగళవారం నౌకాదళంలోకి ప్రవేశించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఈ రెండు యుద్ధనౌకలను లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోని రెండు వేర్వేరు ప్రతిష్ఠాత్మక షిప్‌యార్డ్‌ల నుంచి ఒకేసారి రెండు ప్రధాన యుద్ధనౌకలను ప్రారంభించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రాజెక్ట్ 17 ఆల్ఫా (పీ17ఏ)లో భాగంగా ఈ యుద్ధనౌకలను నిర్మించారు. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను, సాంకేతికతను వినియోగించారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని అధికారులు తెలిపారు. ఐఎన్ఎస్ హిమగిరిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) నిర్మించగా, ఐఎన్ఎస్ ఉదయగిరిని ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎల్) తయారుచేసింది. ఈ రెండు నౌకలు ఒకేసారి దళంలోకి చేరడం, దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యం ఎంతగా పెరిగిందో తెలియజేస్తోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకలు తూర్పు నౌకాదళంలో సేవలు అందించనున్నాయి. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని, వారి 'ముత్యాల హారం' వ్యూహాన్ని అడ్డుకోవడంలో ఈ యుద్ధనౌకలు కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. ఈ నౌకల చేరికతో భారత నౌకాదళ యుద్ధ సన్నద్ధత మరింత పెరిగింది.

**నౌకల ప్రత్యేకతలివే..**

సుమారు 6,700 టన్నుల బరువు, 149 మీటర్ల పొడవు ఉండే ఈ నౌకలు గంటకు 28 నాట్ల (సుమారు 52 కిలోమీటర్లు) వేగంతో ప్రయాణించగలవు. వీటిలో అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీని వాడటం వల్ల శత్రువుల రాడార్లకు సులభంగా చిక్కవు. బరాక్ 8, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, 76 ఎంఎం గన్ లతో వీటిని శక్తిమంతం చేశారు. అంతేకాదు, టార్పెడోలను ఎదుర్కొనే మారీచ్ వంటి పటిష్ఠ వ్యవస్థలను వీటిపై మోహరించారు. అంతేకాకుండా, రెండు హెలికాప్టర్లను కూడా ఆపరేట్ చేయగల సామర్థ్యం వీటి సొంతం.

## హైదరాబాద్ మహీంద్రా యూనివర్సిటీలో డ్రగ్స్ కలకలం..

**హైదరాబాదే, ఆగష్టు 26 (భారత శక్తి) :** హైదరాబాద్‌లోని ప్రముఖ మహీంద్రా యూనివర్సిటీలో మాదకద్రవ్యాల వాడకం వెలుగులోకి రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. ఐదుగురు విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడం ఆందోళన కలిగిస్తోంది. ఓ రెస్టారెంట్ యజమాని ఇచ్చిన కచ్చితమైన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు వర్సిటీలో సోదాలు జరిపి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. 50 మంది విద్యార్థులను దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, మల్నాడు రెస్టారెంట్ యజమాని ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు మహీంద్రా యూనివర్సిటీలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో కిలోన్నర గంజాయితో పాటు 47 గ్రాముల ఓజీ వీడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీమారుతి కొరియర్ సర్వీస్ ద్వారా ఢిల్లీ నుంచి ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. గతంలో విద్యార్థులు నిక్ అనే నైజీరియన్ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసి నగరంలోని పలు పబ్‌లలో పార్టీలు చేసుకున్నట్లు కూడా గుర్తించారు. డ్రగ్స్ బారిన పడిన విద్యార్థులకు పోలీసులు ప్రస్తుతం కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా: మహేశ్ కుమార్ గౌడ్‌కి రఘునందన్ రావు సవాల్




హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మా పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్తాం.. దానికి మీరు కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు. "పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. ఓటు చోరీ చేస్తే దేశంలో ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాల్లో మేమే గెలుస్తాం కదా. మీరెందుకు 8 ఎంపీ స్థానాలు గెలుస్తారు?అసదుద్దీన్ ఎలా గెలుస్తారు. దమ్ముంటే మీ 8 మంది ఎంపీలతో రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటర్ లిస్ట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్దాం. అప్పుడు వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయి. భాజపాను అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా? కుంటి సాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వచ్చింది?" అని రఘునందన్‌రావు ప్రశ్నించారు.

## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు: పాకిస్థాన్‌కు సీడీఎస్ పరోక్ష హెచ్చరిక

**ఢిల్లీ, ఆగష్టు 26 (భారత శక్తి) :** "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, అది ఇప్పటికీ కొనసాగుతోంది" అని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, "భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు" అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు.భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. "రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి" అని ఆయన తెలిపారు. 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం 'సశస్త్ర', 'సురక్షిత్', 'ఆత్మనిర్భర్'గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ 'రణ్ సంవాద్' సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

# నిరుపేదల గూటికి అవినీతి సెగ..




- ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో భారీ అక్రమాలు..
- కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు..
- అడ్డగోలుగా మారిపోయిన ఆదర్శవంతమైన పథకం..
- నాసిరకం మెటీరియల్ తో నిర్మాణాలు..
- గాలివాటుకే దెబ్బతింటున్న పలు గృహాలు..
- కమిషన్ల కోసం అడ్డదారులు తొక్కుతున్న అధికారగణం..
- పెచ్చుమీరిపోయిన రాజకీయ నాయకుల జోక్యం..
- అనర్హులకు, లిస్ట్ లో లేనివాళ్ళకు ఇండ్ల కేటాయింపు...
- సంపన్నులకు సైతం ఇండ్లు ఇస్తున్న దారుణం..
- నిజమైన నిరుపేదలకు మిగులుతోంది చివరకు కన్నీరే..
- అధికారులకు, కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు తప్ప.. నిరుపేదలకు శూన్యమే..
- అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలన్నదే " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ" పోరాటం..

**హైదరాబాద్, ఆగష్టు 26 ( భారత శక్తి) :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరుగుతున్నాయి.. నిజంగా ఇల్లు లేని పేదలకు ఇళ్లు ఇవ్వకుండా, రాజకీయ నేతల అనుచరులు, బంధువులు, ఆర్థికంగా బలమైన కుటుంబాలు లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఇది చాలా దారుణం అంటున్నారు విశ్లేషకులు.. చాలా చోట్ల పేర్లు చేర్పించుకోవడానికి అధికారులకు, మధ్యవర్తులకు లంచాలు ఇవ్వాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

**నిధుల దుర్వినియోగం :**

ఇళ్ల నిర్మాణానికి మంజూరైన నిధులు వేరే దారి మళ్లిపోయాయి. రికార్డుల్లో ఇళ్లు నిర్మించినట్టు చూపించి, వాస్తవంగా అవి పూర్తి కాకుండా నిలిచి పోవడమో.. లేక నాసిరకం పనులు జరిగాయన్నది వాస్తవం..

**నకిలీ లబ్ధిదారుల ఎంపిక :**

రికార్డుల్లో లేని వ్యక్తుల పేర్లు చేర్చి నిధులను ఎగవేశారు. కొన్ని చోట్ల ఒకే వ్యక్తికి రెండు మూడు ఇళ్లు కేటాయించిన ఉదాహరణలు వెలుగులోకి వచ్చాయి.

**నాణ్యత లేకుండా ఇళ్ల నిర్మాణం :**

కాంట్రాక్టర్లతో చేతులు కలిపిన అధికారులు తక్కువ నాణ్యత కలిగిన సామగ్రిని వాడారు. ఫలితంగా ఇళ్లు పగుళ్లు పడటం, అర్థాంతరంగా ఆగిపోవడం, లబ్ధిదారులు తమ సొంత డబ్బుతో పూర్తిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**విపరీతమైన రాజకీయ జోక్యం :**

ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ఓటు బ్యాంక్ రాజకీయంగా మారింది. అధికార పార్టీ అనుచరులకే ఎక్కువగా కేటాయింపులు జరిగి, నిజమైన పేదలు పక్కకు తొలగిపోయారు.

**చుట్టుముట్టిన చట్టపరమైన సమస్యలు :**

కొన్ని ఇళ్లు ప్రభుత్వ భూములపై లేదా వివాదాస్పద స్థలాల్లో నిర్మించడం వలన లబ్ధిదారులు యాజమాన్యం పొందలేక ఇబ్బందులు పడ్డారు.

కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా, ఇప్పటికీ చాలా మంది పేదలు తమకంటూ ఓ సొంత ఇల్లు లేకుండా ఉన్నారు. ఇది అత్యంత దారుణం..

ప్రజా సంక్షేమ పథకాలపై నానాటికీ నమ్మకం లేకుండా పోతోంది.. పేదల ఆశలతో, కలలతో అక్రమంగా ఆటలాడుకుంటున్న ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం సన్నగిల్లిపోతుంది..

ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ ఎంతో మంచి ఉద్దేశంతో ప్రారంభమైనా, అవినీతి, బంధుప్రీతి, పర్యవేక్షణ లోపాల వలన చెడిపోయింది. ఇలాంటి పథకాలు నిజమైన లబ్ధిదారుల దాకా చేరాలంటే కఠినమైన బాధ్యతా వ్యవస్థ, పారదర్శక డిజిటల్ రికార్డులు, స్వతంత్ర ఆడిట్ తప్పనిసరిగా ఉండాలని, ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించి.. అడుగులు వేయాలని. పేదల గూడును పదిలంగా ఉంచాలని డిమాండ్ చేస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ"..



---

# ప్రకృతి ప్రేమికుడు పార్వతి పుత్రుడు

**వినాయక చవితి నాడు విఘ్నేశ్వరుని ఏక వింశతి (21 రకాల) పత్రులతో అనగా ఆకులతో పూజించేవారు. పూర్వం ఈ పత్రులన్నీ పొలాల గట్ల మీద తోటల వెంట వెళ్లి ఏరి తెచ్చుకునే వారు. ఏవైనా దొరకని వాటికి ప్రత్యామ్నాయంగా గరికతో గణపతిని పూజించేవారు. ఇక దేవదారు వంటి కొన్ని రకాల పత్రులు మన ప్రాంతంలో లభ్యం కావు. అటువంటి పత్రులను ప్రత్యేకంగా సేకరించే అలవాటు కూడా గణపతి భక్తులకు ఉండేది. వినాయకుని పత్రి పూజలో దాగిన అనేక ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని ఆయుర్వేదం తెలుపుతుంది. ఆ విషయాలను ఈ వ్యాసంలో తెలుసుకుందాం!**



**ఆగష్టు 26 ( భారత శక్తి) :** పార్వతీ పుత్రుడైన గణేశుడు ప్రకృతి ప్రేమికుడని ఒక ప్రతీతి. ఆయన ప్రకృతికి అధినాయకుడు కూడా. వ్యవసాయపు పనులు ముమ్మరంగా ఉండే వర్షాకాలంలో వినాయక చవితి పండుగ వస్తుంది. వినాయకుని ఏకదంతం నాగలికి సంకేతంగా భావిస్తారు. ఆయన లంబోదరం ధాన్యపు గాదెను సూచిస్తుంది. కడుపు చుట్టూ ఉన్న నాగబంధం పంటల్ని పాడు చేసే ఎలుకల్ని నాశనం చేస్తుందంటారు. ఇలా వినాయక రూపానికి, వ్యవసాయానికి ఉన్న అనుబంధం గురించిన భావనలు అపారంగా ఉన్నాయి. ముఖ్యంగా వినాయక చవితిలో 21 రకాల పత్రులను సేకరించడం కోసం చిన్న పెద్ద తోటల వెంట, పొలాల గట్ల వెంట వెళ్లేవారు. ఆ ఔషధ గుణాలు కలిగిన చెట్లపై ఎక్కి ఆకులు తెంచుకురావడం కూడా ఆరోగ్యాన్ని వృద్ధి చేసే అలవాటే అవుతుంది. తర్వాత చెరువులలోని బంక మట్టిని వినాయకుడి బొమ్మ కోసం సేకరిస్తారు. ఊరంతా ఒక్కసారిగా చెరువులోని మట్టిని తీయడం వల్ల పూడిక తొలగిపోతుంది. అటుపైన మట్టి గణపతిని తయారు చేసుకొని పాలవెల్లిని కట్టి 21 రకాల పాత్రులతో పూజిస్తారు. 9 రోజులపాటు అక్షతలు, పసుపు, కుంకుమ వగైరాలతో పాటు, మాగిన ఆకులు ఆనాడు చెరువుల్లో నీటిని శుద్ధి చేసేవి. ఆకులలోని ఔషధీ గుణాలు నీళ్లలోని కాలుష్యాన్ని వ్యాధికారక క్రిములను తొలగించేవి.

**మట్టి వినాయకుల విగ్రహాలని పూజిద్దాం!**

వృత్తికా రూపంలో అర్చన సర్వ శ్రేష్టమైనది. మృత్తిక అనగా మట్టి. వాతావరణ కాలుష్యాన్ని నీటి కాలుష్యాన్ని నివారించేందుకు గాను వినాయక పూజలో పూర్తిగా మట్టి వినాయక ప్రతిమలనే వినియోగిద్దాం! మృత్తిక అంటే మట్టి రూపంలోనే వినాయకుని పూజిద్దాం! ఏ దేవతా ప్రతిమనైనా తయారుచేసిన తర్వాత శీఘ్రంగా పూజించాలి. వినాయక చవితి నాటి ఉదయాన్నే మట్టి వినాయకుడిని తయారు చేసుకోవడం మన సనాతన ఆచారం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీలో విద్యుత్, ఇంధనం విరివిగా ఉపయోగిస్తారు. దీని వల్ల భూతాపం పెరిగిపోతుంది. మట్టితో కాకుండా ఇతర పదార్థాలతో చేసిన విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవు. దీనివల్ల నిమజ్జనంలోని ముఖ్య ఉద్దేశం నెరవేరదు. అందువల్ల మనం చేసిన పూజంతా కూడా వృధా అవుతుంది. ఇదే కాకుండా విగ్రహారాధన అంటే నమ్మకం లేని వాళ్ళ వద్ద విగ్రహాలు కొనడం కూడా సనాతన ధర్మానికి విరుద్ధమే అవుతుంది. కనుక విగ్రహారాధనను విశ్వసించే వారి వద్దనే విగ్రహాలను కొందాం! అంతేకాక మట్టి విగ్రహాలనే కొని పూజించడం వలన మన కోరికలు తీరడమే కాక ప్రకృతిని రక్షించిన వాళ్ళం అవుతాం! ఈ విషయాన్ని గణపతి భక్తులమైన మనమంతా గమనిద్దాం!

*** ఏక వింశతి (21) పత్రులలో దాగిన ఆరోగ్య రహస్యాలు**

వినాయకుని ఏకవింశతి (21) పత్రులతో పూజిస్తారు కదా! 21 పత్రులతో అంటే ఆకులతో విఘ్నేశ్వరుడికి పూజ చేస్తారు.

ఈ ఆకు పూజ అందులోనూ 21 ఆకులతో వినాయకుడికి పూజ చేయడమేమిటి? అనే సందేహం కలుగుతుంది. ఆ సందేహానికి సమాధానంగా మన పురాణాల్లో అనేక చోట్ల వివరణలు కనిపిస్తాయి. ముఖ్యంగా అధర్వణ వేదంలో అంతర్భాగమైన ఆయుర్వేద శాస్త్రం వినాయకుడికి సమర్పించే 21 రకాల ఆకులలోను అద్భుత ఔషధ గుణాలు ఉన్నాయని చెబుతుంది. ఇలాంటి ఔషధ లక్షణాలున్న ఆకును చిన్ననాటి నుంచే పిల్లలకు వినాయకుని పూజ పేరుతో పరిచయం చేస్తే వారి జీవితాలకు ఎంతో మేలు కలుగుతుందని మన పెద్దలు భావించేవారు. ఈ 21 రకాల ఆకులలో దాగిన ఔషధ గుణాలను ఇప్పుడు తెలుసుకుందాం!

**ఏక వింశతి (21) పత్రులు ఇవే:**



1) మాచి పత్రం, 2) బృహతీ పత్రం, 3) బిల్వ పత్రం, 4) దుర్వాయుగ్మ పత్రం, 5) దత్తూర పత్రం, 6) బదరీ పత్రం, 7) అపామార్గ పత్రం, 8) తులసి పత్రం, 9) చూత పత్రం, 10) కరవీర పత్రం, 11) విష్ణు క్రాంత పత్రం, 12) దాడిమీ పత్రం, 13) దేవదారు పత్రం, 14) మరువక పత్రం, 15) సింధు వార పత్రం, 16) జాజి పత్రం, 17) శమీ పత్రం 18) అశ్వత్థ పత్రం, 19)అర్జున పత్రం, 20) అర్క పత్రం, 21) గండకీ పత్రం,



1) మాచి పత్రం: తెలుగులో కూడా మాచీ పత్రమనే అంటారు. ఇది నేత్రవ్యాధులను,చర్మవ్యాధులను పోగొడుతుంది.
2) బృహతీ పత్రం: దీనిని నేల మునగ వాకుడు ఆకు అంటారు. ఇది మూలశంక, దగ్గు, మలబద్ధకము నివారిస్తుంది.
3) బిల్వ పత్రం: దీనినే మారేడు అంటారు ఇది చక్కెర వ్యాధిని ఎంతో నివారిస్తుంది.
4) దూర్వాయుగ్మ పత్రం: దీనినే జంటగరిక అంటారు. ఇది మూత్ర సంబంధమైన వ్యాధులను తొలగిస్తుంది.
5) దత్తూర పత్రం: దీనినే ఉమ్మెత్త ఆకు అంటారు. ఇది మానసిక రోగాల నుండి రక్షిస్తుంది.
6) బదరీ పత్రం: దీనినే రేగు ఆకు అంటారు. ఇది పిల్లలకు సంబంధించిన రోగాలను పోగొడుతుంది.
7) అపామార్గ పత్రం: దీనినే ఉత్తరేణి ఆకు అంటారు. ఇది దంత వ్యాధులను చర్మ రోగాలను ఇట్టే పోగొడుతుంది.
8) తులసి పత్రం: దీనిని తులసి ఆకు అంటాం. ఇది దగ్గు, వాంతులు, నులిపురుగులు, జలుబు మొదలైన వ్యాధులను తొలగిస్తుంది.
9) చూత పత్రం: దీనిని మామిడి ఆకు అంటారు. ఇది చర్మ రోగాల నుండి కాళ్ళ పగుళ్ళ నుండి అతిసారా వ్యాధి నుండి రక్షిస్తుంది.
10) కరవీర పత్రం: దీనికే గన్నేరు ఆకు అని మరో పేరు. ఇది జ్వర తీవ్రతను నివారిస్తుంది.
11) విష్ణు క్రాంత పత్రం: దీనినే అవిసె ఆకు అంటారు ఇది తామర రక్తదోషం లాంటి వ్యాధులను పోగొడుతుంది
12) దాడిమీ పత్రం: దీనికి దానిమ్మ అని పేరు. ఇది దగ్గు, ఉబ్బసం, అజీర్ణం కళ్ళ వాపు రోగాలను తొలగిస్తుంది.
13) దేవదారు పత్రం: తెలుగులో కూడా దీన్ని దేవదారు గానీ పిలుస్తారు. ఇది శ్వాస కోశ సంబంధమైన వ్యాధులను నివారింప చేస్తుంది.
14) మరువక పత్రం: దీనినే మరువం అంటాం. దీనిని ముఖ్యంగా మహిళలు పూలలో సువాసన కొరకు అల్లుకుంటారు. దీనికి మరువం అని తెలుగులో పేరు. ఇది శరీర దుర్వాసనను పోగొట్టి సువాసనను కలిగిస్తుంది.
15) సింధు వార పత్రం: దీనికి వావిలి ఆకు అని పేరు. ఇది బాలింతల వాత రోగం వంటి నొప్పులు దూరం చేస్తుంది.
16) జాజి పత్రం: తెలుగులో కూడా జాజి ఆకు అని పిలుస్తారు. ఇది నోటి దుర్వాసన పోగొడుతుంది.
17) శమీ పత్రం: తెలుగులో దీనినే జమ్మి ఆకు అంటారు. ఇది దసరా పండుగ రోజున పూజించి పరస్పరం 'బంగారం' అనే పేరుతో ఇచ్చిపుచ్చుకునే ఆచారం ఉంది. ఈ జమ్మికి మహాభారతం, రామాయణం సంబంధించిన అనేక సందర్భాలు ఉన్నాయి. ఇది కుష్టు వ్యాధి నుండి కాపాడటమే కాక అవాంచిత రోమాలను తొలగించి చర్మాన్ని మెరుగుపరుస్తుంది.
18) అశ్వత్థ పత్రం: దీనికే రావి ఆకు అని పేరు. ఇది శ్వాసకోశ సంబంధమైనటువంటి వ్యాధులను నివారిస్తుంది.
19) అర్జున పత్రం: దీనికే మద్ది ఆకు అని పేరు ఇది దీర్ఘం కాలం నుండి బాధిస్తున్న గాయాలను నివారిస్తుంది.
20) అర్క పత్రం: దీనికే జిల్లేడు ఆకని పేరు. ఇది సూర్య సంబంధమైనటువంటి పత్రము. ఇది ముఖము యొక్క రంగును మార్చి ఆకర్షణీయంగా చేస్తుంది.
21) గండకి పత్రం: దీనిని అడవిముల్ల అని అంటారు. దీనిని సేవించడం వల్ల అతిమూత్ర వ్యాధి తగ్గుతుంది.

ఇదీ వినాయకచవితి ఏకవింశతి పూజలో దాగిన రహస్యం! మన ఋషీశ్వరులు చెప్పిన సనాతన హైందవ ధర్మ రహస్యాలను తెలుసుకుందాం! మన ఆచారాలను పాటిద్దాం! మన హైందవ సనాతన ధర్మాన్ని రక్షిద్దాం!

**"సాహిత్య కళా విభూషణ"**
**స్వర్ణ నంది పురస్కార గ్రహీత**
**చౌడూరి నరసింహారావు**
**సాహిత్య, ఆధ్యాత్మిక విశ్లేషకులు**

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.